

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 14-9-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 167 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి తె.3.06 తదుపరి నవమి; నక్షత్రం: రోహిణి ఉ.8.41 తదుపరి మృగశిర; వర్జ్యం: మ.2.00-3.32; దుర్ముహూర్తం: సా.4.37-5.26; అమృతఘడియలు: శేషం ఉ.7.11 వరకు, రా.11.09-12.40; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.14 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చుక్క నీటినీ వదలొద్దు

కృష్ణా జలాల్లో ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలి

- గరిష్ఠ వాటా సాధనకు పట్టుబట్టాలి
- ఆధారాలన్నీ ట్రైబ్యునల్‌కు అందించాలి
- రాష్ట్రానికి మొత్తం 904 టీఎంసీలు రావాలి
- 299 టీఎంసీలకు ఒప్పుకొని గత సర్కారు తెలంగాణకు తీరని అన్యాయం చేసింది
- కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదనలపై ఉన్నతాధికారులకు సీఎం దిశానిర్దేశం
- 23, 24, 25 తేదీల్లో ట్రైబ్యునల్లో విచారణ


నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణకు చెందాల్సిన నీటి వాటాలో చుక్క నీరు కూడా వదులుకునేది లేదు. కృష్ణా జలాల్లో గరిష్ఠ నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలి. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి, న్యాయ నిపుణులకు అందించాలి. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకోవాలి. రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలి" అని న్యాయ నిపుణులు, నీటి పారుదల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో న్యూఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రైబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శనివారం సీఎం రేవంత్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, కేంద్ర జలవనరుల సంఘం మాజీ చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, నీటిపారుదల శాఖ


మిగతా 13వ పేజీలో...

కృష్ణా జలాల్లో 71 శాతం ఇవ్వాల్సిందే!

- కృష్ణా ప్రాజెక్టులను బీఆర్ఎస్ పూర్తి చేయలేదు
- నీళ్లను సంపూర్ణంగా వాడుకోలేక పోవడానికి కారణం ఇదే
- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్

13

కొండలు, లోయల మధ్య.. విశ్వాసమనే వంతెన వేయాలి



- భారతమాత కిరీటంలో మణిపూర్ ఒక రత్నం
- ఇక్కడ ఎలాంటి హింసకు తావుండొద్దు
- శాంతితోనే అభివృద్ధి
- ఇందుకు అన్ని గ్రూపులు ముందుకు రావాలి
- ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ప్రధాని
- ఘర్షణలతో అట్టుడికిన రెండేళ్ల తర్వాత మణిపూర్‌కు మోదీ
- కుకీ, మైతేయి తెగల కుటుంబాలకు పరామర్శ
- మణిపూర్ ఇన్నాళ్లకు గుర్తొచ్చిందా?
- ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మండిపాటు

14

అసహనం పరాకాష్ఠకు!


కొత్త పలుకు

రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో రాజ్యాంగం లోపభూయిష్టంగా ఉందని కాదు.. పాలకులు బాధ్యతారహితంగా, రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా వ్యవహరించడం వల్ల అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లి ప్రజల్లో అసహనం పరాకాష్ఠకు చేరింది.

4

అధికార దురహంకారంతో వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వాలపై మన ప్రజలు బ్యాలెట్‌ను బుల్లెట్‌లా ప్రయోగించారే గానీ, పొరుగు దేశాల్లో వలే విధ్వంస చర్యలకు పాల్పడలేదు. ఇందుకు మన సమాజాన్ని చూసి మనం గర్వించాలి. అయితే ప్రజలు మాత్రమే ఎల్లవేళలా విజ్ఞత ప్రదర్శించాలనుకోవడం అత్యాశే అవుతుంది. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాలలో వలే తిరుగుబాట్లు చేయరు. అంతమాత్రాన ప్రజలను టేకెన్ ఫర్ గ్రాంటెడ్ అన్నట్టు తీసుకోకూడదు.

రాజ్యాంగబద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. మన దేశంలో ప్రస్తుతం ఫలానా వ్యవస్థ పటిష్ఠంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తోందని చెప్పలేని పరిస్థితి నెలకొంది. అధికార దుర్వినియోగం పరిపాటిగా మారిపోయింది. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత అటు పాలకులు, ఇటు రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. లేని పక్షంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో వలె కాకపోయినా మన దేశంలో మరో రూపంలో అశాంతి ప్రబలుతుంది.



ఎటు చూసినా రైలు!

- రాష్ట్రవ్యాప్తంగా రైలుమార్గం
- రూ.81 వేల కోట్లతో 40 ప్రాజెక్టులు
- 4,353 కి.మీ. మార్గం
- కొత్త లైన్లకు సర్వేలు
- ఉన్న లైన్ల విస్తరణ..
- కేంద్ర ప్రభుత్వం మంజూరు
- సీఎంతో రైల్వే అధికార్ల చర్చ

12


ఆసియా కప్‌లో నేడు భారత్ - పాక్ పోరు

11

ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు

- మా సత్తా చూపిస్తాం
- సీఎంకు కేటీఆర్ సవాల్
- గ్రూప్-1 ఉద్యోగాలను కాంగ్రెసోళ్లు అమ్ముకున్నారు
- ఒక్కో పోస్టుకు రూ.3 కోట్ల చొప్పున 1500 కోట్లు
- 'గద్వాల గర్జన' లో కేటీఆర్

13



మీకు ఇచ్చేందుకు పైసా కూడా లేదు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నేనేం చేయలేను.. డబ్బులన్నీ జీతాలు, పథకాలకే సరిపోతున్నాయి

- 'ప్రైవేటు కాలేజీల'కు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టీకరణ
- సమ్మె విరమించుకోవాలన్న మంత్రి శ్రీధర్‌బాబు
- 1200 కోట్లైనా ఇవ్వాలి: సంఘం ప్రతినిధులు




హైదరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): "డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, ఇతర సంక్షేమ పథకాలకే పోతున్నాయి. ఇక మిగిలిందేమీ లేదు. రీయింబర్స్‌మెంట్‌పై నేనేం చేయలేను. మీకు ఇచ్చేందుకు పైసా కూడా లేదు. నన్నేం చేయమంటారో మీరే చెప్పండి" అని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే సోమవారం నుంచి బంద్ పాటిస్తామని నోటీసు ఇచ్చిన కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు.. శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రూ.1200 కోట్లను వెంటనే విడుదల చేస్తే సమ్మె యోచన విరమించుకుంటామని, మిగతా నిధులు నిర్దిష్ట కాలపరిమితిలోగా ఇవ్వాలని కోరారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ ఇచ్చేందుకు ప్రభుత్వం వద్ద ఏమీ లేదని స్పష్టం చేసినట్టు తెలిసింది. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలో వారు సమావేశమయ్యారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, భారీ స్థాయి నిధులతో ముడిపడిన అంశమైనందున క్రమకమంగా పరిష్కరిస్తామని శ్రీధర్‌బాబు అన్నారు. సమ్మె ఆలోచన విరమించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి సైతం వారితో సమావేశమయ్యారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చెల్లించాల్సిన బకాయిల వివరాలు తెలుసుకున్నారు. దాదాపుగా రూ.3500 కోట్లు రావాల్సి ఉందని ప్రతినిధులు పేర్కొనగా.. విడతలవారీగా చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. ఉన్నత విద్యలో అనేక సంస్కరణలు తీసుకురావాలని భావిస్తున్న తరుణంలో సమ్మె నిర్ణయం సరి కాదన్నారు. కాగా, మాసబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం కాలేజీల యాజమాన్యాలు సమావేశం కానున్నాయి. మంత్రులతో జరిగిన చర్చలు, ఇతర అంశాలపై అందరితో చర్చించి.. బంద్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యాల సమాఖ్య చైర్మన్ ఎన్.రమేష్ బాబు, సెక్రటరీ జనరల్ కేఎస్ రవికుమార్, సంస్థాగత కార్యదర్శి కే సునీల్ కుమార్ తెలిపారు.

లోకం తీరు



రీయింబర్స్‌మెంట్ రాకుండానే 3 లక్షల మంది చదువు పూర్తి!

నాలుగేళ్లుగా పైసా కూడా ఇవ్వని పాలకులు

- బాజాప్తా ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలు
- నష్టపోతున్నది పేద, మధ్య తరగతి విద్యార్థులే
- నెరవేరని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం లక్ష్యం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం ఆదిలాబాద్‌కు చెందిన పేద గిరిజన విద్యార్థి రాజ్‌కుమార్ ఎంసెట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 3500 లోపు ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో కన్వీనర్ కోటాలో సీఎస్‌లో సీటు వచ్చింది. ఫీజు అంతా ప్రభుత్వమే చెల్లిస్తుందని తల్లిదండ్రులు భావించగా.. నాలుగేళ్లలో రూ.3.60 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంది కదా? అని ప్రశ్నిస్తే.. ప్రభుత్వం చెల్లించాక మీది మీకు ఇచ్చేస్తాం.. ముందైతే చెల్లించాల్సిందే అని కాలేజీ యాజమాన్యం తెగేసి చెప్పింది. ఇది అతనొక్కడి సమస్యే కాదు.. రాష్ట్రంలోని మూడు లక్షల మంది విద్యార్థులదీ ఇదే పరిస్థితి. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల కాకపోవడంతో ఇంజినీరింగ్, బీఫార్మసీ, నర్సింగ్ కోర్సులకు చెందిన ఒక బ్యాచ్ ముగిసింది. మూడేళ్ల వ్యవధిగల ఎల్‌ఎల్‌బీ, రెండేళ్ల వ్యవధి గల ఎంబీఏ, ఎంసీఏ, ఎల్‌ఎల్ఎం లాంటి కోర్సులనూ విద్యార్థులు పూర్తి చేసుకున్నారు. ఇలా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకుండానే యూజీ, పీజీ చదువులు పూర్తిచేసుకున్న విద్యార్థుల సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల పైగా ఉంటుంది. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు బాహాటంగానే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకుంటున్నాయి. అటు.. పాలకులు, ఇటు.. యాజమాన్యాల మధ్య విద్యార్థులే ఎక్కువగా నష్టపోతున్నారు.

ఫీజులు తీసుకుని.. ఖాళీ చెక్కులిచ్చి..

రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్ల బీటెక్, రెండేళ్ల ఎంటెక్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య దాదాపు 4 లక్షలు కాగా, ఫార్మసీ, పాలిటెక్నిక్, మేనేజ్‌మెంట్, న్యాయ, బీఈడీ, ఎంఈడీ వంటి ఇతర వృత్తి విద్య కోర్సులు అభ్యసించే వారి సంఖ్య మరో 4లక్షల వరకు ఉంటుంది. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద పైసా కూడా విడుదల కాకపోవడంతో ఇంజనీరింగ్, నర్సింగ్, బీఫార్మసీ కోర్సుల్లో ఒక బ్యాచ్, కొన్ని వృత్తి విద్యాకోర్సుల్లో రెండు బ్యాచ్‌లకు చెందిన వారి చదవులు పూర్తయ్యాయి. వీరి సంఖ్య అటుఇటుగా 3లక్షల వరకు ఉంటుందని అంచనా. నాలుగేళ్ల పాటు విద్యార్థులే ఆయా కాలేజీలకు ఫీజులు చెల్లించాల్సి వచ్చింది. గట్టిగా ప్రశ్నించినా, ఫీజులు చెల్లించకున్నా.. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీలు ఇబ్బందులు పెడుతున్నాయి. చివరి సంవత్సరంలో పూర్తి ఫీజు చెల్లించిన విద్యార్థులకు ఖాళీ చెక్కులు ఇచ్చి, ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తే మీరు చెల్లించిన మొత్తం తిరిగి ఇచ్చేస్తామంటూ నమ్మబలుకుతున్నాయి. అయితే, ఉచిత విద్య పేరిట చేర్చుకుని లక్షల రూపాయలు వసూలు చేస్తుండడంతో.. పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ.. కాలేజీల యాజమాన్యాల వాదన మరోలా ఉంది. తమకు ప్రభుత్వం నుంచి బకాయిలు రావడం లేదని, కాలేజీల నిర్వహణ కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సోమవారం నుంచి కాలేజీల బంద్ పాటిస్తామని ప్రభుత్వానికి నోటీసులు అందించాయి. ఏదేమైనా.. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉద్దేశం.. నెరవేరడం లేదన్న వాదన వినిపిస్తోంది.

కేబుళ్ల తొలగింపుతో 100 కోట్ల నష్టం!

కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్ల అసోసియేషన్ వర్గాల వెల్లడి

ఇంటర్నెట్, టీవీ, ఫోన్ సిగ్నళ్లకు అంతరాయాలు

హైదరాబాద్/కవాడిగూడ/హైదరాబాద్ సిటీ : సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకున్న కేబుల్, ఇంటర్నెట్ ఆప్టికల్ కేబుళ్లను విద్యుత్ శాఖ తొలగిస్తుండటంతో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో కేబుల్ టీవీ, ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి ఎన్ని రోజులు పడుతుందనేదానిపై స్పష్టత రావడంలేదు. కేబుళ్ల తొలగింపుతో దాదాపు రూ.100 కోట్ల నష్టం వాటిల్లిందని తెలంగాణ కేబుల్, నెట్ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. అయితే ఇప్పటిదాకా కేబుళ్ల తొలగింపుతో ఇంటర్నెట్, కేబుల్ టీవీ ప్రసారాలకే ఇబ్బందులు రాగా.. తాజాగా రెండు రోజుల నుంచి ఫోన్ సిగ్నళ్ల సమస్య మొదలైంది. కేబుల్ వైర్ల తొలగింపుతో వినియోగదారులతోపాటు ఆస్పత్రులు, రెవెన్యూ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లోనూ ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలుగుతోంది. రాష్ట్ర సచివాలయంలోనూ ఈ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పలు సెక్షన్లలో పనులు నిలిచిపోయాయని ఉద్యోగులు చెబుతున్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల గగ్గోలు..

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లు (ఐఎస్‌పీ) 30 మంది ఉండగా.. కేబుల్ టీవీ ప్రసారాలకు సంబంధించి ఎంఎస్‌వోలతోపాటు వీరి కింద లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీవో) ఉంటారు. ప్రస్తుతానికి హైదరాబాద్ పరిధిలో దాదాపు 30-40 లక్షల కేబుల్, ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా ఆప్టికల్ వైర్లను తొలగిస్తుండడంతో ఇంటర్నెట్ సేవలు అందక వినియోగదారులు తమపై ఒత్తిడి చేస్తున్నారని ప్రొవైడర్లు వాపోతున్నారు. ఉప్పల్-అల్వాల్-ఏఎస్‌రావు నగర్ పరిధిలో ఉన్న ఓ సర్వీస్ ప్రొవైడర్‌కు దాదాపు 60-70 కిలోమీటర్ల మేర ఆప్టికల్ లైన్ ఉంది. ఇప్పుడు దాన్ని కట్ చేశారని, వాటి మరమ్మతులు, కొత్త వైర్ల కోసం దాదాపు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక కొన్ని టెలికాం టవర్లకు వెళ్లే వైర్లు కూడా కట్ కావడంతో ఫోన్లకు సిగ్నల్ సమస్య తలెత్తుతోంది. దీని పరిష్కారానికి కొన్ని రోజులు పడుతుందని సంబంధితవర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో ఒక్కసారిగా ఆప్టికల్ కేబుళ్లను తొలగిస్తుండడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధి ఒకరు చెప్పారు. తొలగిస్తున్న కేబుళ్ల పునరుద్ధరణకు వర్షాలు ఆటంకంగా మారుతున్నాయన్నారు. కేబుళ్ల తొలగింపు విషయంపై చర్చలు జరుగుతున్నాయని, కానీ అవి కొలిక్కి రావడంలేదని అసోసియేషన్ చెబుతోంది.

ఇంటర్నెట్ సేవల్లో తీవ్ర అంతరాయం

హైదరాబాద్‌లో విద్యుత్ స్తంభాలపై కేబుళ్ల తొలగింపుతో ఇంటర్నెట్, కేబుల్ సేవల్లో తీవ్ర అంతరాయాలు నెలకొంటున్నాయి. గచ్చిబౌలి, కొండాపూర్, రాయదుర్గం, పుప్పాలగూడ, నానక్‌రాం గూడ, డీఎల్ఎఫ్, హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో రెండు రోజులుగా ఇష్టానుసారంగా కేబుళ్లు తొలగించడంతో ఇంటర్నెట్, కేబుళ్ల సేవలపై తీవ్ర ప్రభావంపడుతోంది. మూడు వారాలుగా గ్రేటర్‌వ్యాప్తంగా తరచూ ఈ సేవల్లో అంతరాయాలు నెలకొంటున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్‌నెట్ సేవల్లో గంటల కొద్దీ అంతరాయాలతో వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కేబుళ్ల తొలగింపుతో ఇంటర్‌నెట్ సేవలతో పాటు టీవీలు సరిగా రావడం లేదని, తరచూ సిగ్నల్ సమస్యలు తలెత్తుతున్నాయని వినియోగదారులు అంటున్నారు.

కేబుళ్ల తొలగింపును ఆపాలి

కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్ల డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు ఐదు లక్షల మంది కేబుల్ ఆపరేటర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, విద్యుత్ శాఖ అధికారుల చర్యల వల్ల కేబుల్ ఆపరేటర్లు రోడ్డున పడుతున్నారని, వెంటనే కేబుల్ వైర్ల కోతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ (ఫాకో) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేబుల్ ఆపరేటర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేబుల్ ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ మహాధర్నాకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ హాజరై మద్దతు ప్రకటించారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ కేబుల్ ఆపరేటర్ల ఉపాధిని దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక పాలసీ ప్రకటించి కేబుల్ ఆపరేటర్ల జీవనోపాధిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు డి.సతీష్‌బాబు, గౌరవ అధ్యక్షుడు వి.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేబుళ్ల కోతలను వెంటనే నిలిపివేసి కేబుల్ వ్యవస్థ క్రమబద్ధీకరణకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. కేబుల్ ఆపరేటర్లు ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్ల ఉపాధికి నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపి ఆదుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేబుల్ ఆపరేటర్లు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



ఇందిరాపార్కు వద్ద కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్ల ధర్నాలో పాల్గొన్న దాసోజు, బూరనర్సయ్యగౌడ్

500 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

- శంషాబాద్‌లో ఇంటర్మీడియట్ బోర్డు భూమి కబ్జా
- ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన
- షెడ్లూ, ప్రహరీ తొలగింపు
- 12 ఎకరాల భూమిని కాపాడి బోర్డుల ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైడ్రా మరోసారి కబ్జాదారులపై కొరడా ఝుళిపించింది. శనివారం శంషాబాద్‌లో రూ.500 కోట్ల విలువైన 12 ఎకరాల సర్కారు స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి కాపాడింది. ఆక్రమణలు తొలగించడమేకాకుండా 'ఇది ప్రభుత్వ భూమి.. హైడ్రా పరిరక్షించింది' అని రాసి ఉన్న బోర్డులు ఏర్పాటు చేసింది. హైడ్రా వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం శాతంరాయి గ్రామంలోని సర్వే నంబర్ 17లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. దీనిపైస్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో అధికారులు సమగ్ర పరిశీలన చేశారు. అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకొని షెడ్లు, చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ తొలగించింది. 12 ఎకరాల్లో ఎకరంమేర నివాసాలు, ఆలయం, మసీదు ఉండగా.. వాటి జోలికి వెళ్లలేదని సంస్థ స్పష్టం చేసింది. శాతంరాయిలోని 12 ఎకరాల భూమిని 2011లో ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డుకు కేటాయించింది. భూమి తమదని స్థానిక నేత ఒకరు, అనీష్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బోర్డులు ఏర్పాటు చేసింది. ఆ భూమిలో వారు నిర్మాణాలకు ప్రయత్నించారు. షెడ్లు, ప్రహరీ నిర్మించారు. వీటి ఫొటోలను స్థానికులు హైడ్రాకు పంపారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా భూమి కబ్జాపై ఫిర్యాదు చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా బృందం అది సర్కారు స్థలంగా తేల్చింది. రాళ్లు, రప్పలతో వ్యవసాయ యోగ్యం కాని భూమిలో వ్యవసాయం చేస్తున్నామని, అసఫ్‌జాహీ పైగా వారసుల నుంచి కొన్నామని కబ్జాదారులు చెబుతున్నారు. అయితే శంషాబాద్ పరిధిలో పైగా కుటుంబాలకు చెందిన భూములులేవని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు. దీంతో కబ్జాదారుల వాదనలో వాస్తవం లేదన్న నిర్ణయానికి వచ్చారు. మరో ప్రాంతంలో ఉన్న భూములను శాతంరాయిలో చూపి కబ్జా చేయాలని చూశారని హైడ్రా పేర్కొంది. అనీష్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు చెందిన శ్రీపాద దేశ్ పాండే పలు భూముల వివాదాల్లో ఉన్నట్టు హైడ్రాకు మరిన్ని ఫిర్యాదులు అందాయి.

రేపటి లోగా 22ఏ జాబితాలు ఇవ్వండి

- కలెక్టర్లకు స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ లేఖలు
- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్య

హైదరాబాద్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిషేధిత జాబితా(22ఏ)లో ఉన్న భూముల అంశంలో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై ప్రభుత్వం స్పందించింది. 22ఏలో ఉన్న భూముల వివరాలను సోమవారం(సెప్టెంబరు 15)లోగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్లకు అందజేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు లేఖలు రాశారు. 2016లో జారీ అయిన జీవో 121లో నిర్దేశించిన ప్రకారం భూముల జాబితాను ఇవ్వాలని, తెల్ల కాగితం మీద భూముల వివరాలు రాసి ఇస్తే పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. నిషేధిత భూముల జాబితాను సబ్ రిజిస్ట్రార్లకు 9వారాల్లోగా అందించాలని ఆగస్టు 25న ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జాబితాల అంశంలో కలెక్టర్లకు లేఖలు వెళ్లాయి. అయితే, 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 22ఏ జాబితాలు అందిన వెంటనే వాటిని సమీక్షిస్తామని స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు.

నిషేధిత భూముల శాతం పెరుగుతూ వస్తోంది

సాధారణంగా ఓ గ్రామంలో 3 వేల నుంచి 5 వేల ఎకరాల భూమి ఉంటుంది. అందులో అటవీ భూములు, వాగులు, కుంటలు, చెరువులు, గుట్టలు, దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు 10 నుంచి 20 శాతం మించి ఉండవు. కానీ, 2017 నుంచి రాష్ట్రంలో ఈ సంఖ్య పెరుగుతోంది. పలు కారణాలతో పట్టా భూములు కూడా నిషేధిత జాబితాలో చేరుతున్నాయి. ఒక సర్వే నంబరులో కొంత ప్రభుత్వ భూమి ఉంటే.. ఆ సర్వే నంబరులో ఉన్న మొత్తం భూమిని 22ఏలో పెడుతున్నారు. గతంలో నిషేధిత జాబితాలో ఉండి తర్వాత ప్రభుత్వం తొలగించినా.. వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. అలాగే, 22ఏ జాబితా తయారు చేసే సమయంలో టైపింగ్ పొరపాట్ల వల్ల కూడా కొన్ని భూములు జాబితాలోకి ఎక్కుతున్నాయి. భూభారతి పోర్టల్ ప్రకారం 40 శాతం భూములు 22ఏ కింద ఉన్నాయి. అలాగని, ప్రభుత్వం ఈ విషయంలో ఉదారంగా స్పందిస్తే.. కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉంది. ఈ సమస్యను సమీక్షించేలా రాష్ట్ర స్థాయిలో ఓ వ్యవస్థ ఉండాలి. - భూమి సునీల్

తెలంగాణకు కాళేశ్వరమే జీవధార


- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు, నిపుణులు

పంజాగుట్ట, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టే జీవధార అని, ఈ ప్రాజెక్టును ఓ వైఫల్యంగా చిత్రీకరించేందుకు సర్కారు యత్నించడం సరికాదని పలువురు నాయకులు, లక్ష కోట్ల అవినీతి అంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీనియర్ జర్నలిస్టు ఎ.రమణ కుమార్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'గోదావరి జలాలు- కాళేశ్వరం ప్రాజెక్టు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, సీపీఎం నాయకుడు సాగర్, సీపీఐ నాయకురాలు పశ్య పద్మ, నీటిపారుదల రంగ నిపుణుడు వి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. నీటి కోసం, భూమి కోసం ఎన్ని లక్షల కోట్లు ఖర్చు చేసినా తప్పు లేదని, కానీ ప్రజాధనం వృథా కావొద్దని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను బూచీగా చూపి గోదావరి జలాలను బనకచర్ల తీసుకెళ్లేందుకు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు కుట్ర చేస్తున్నారని క్రాంతి కిరణ్ ఆరోపించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డ నుంచి మిడ్ మానేరుకు కాలువలు లేదా టన్నెల్ ద్వారా నీటిని తరలించే అవకాశం లేనందునే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాల్సి వచ్చిందన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ టి.వెంకటేశం మాట్లాడుతూ మేడిగడ్డ సహా ఇతర బ్యారేజీల నుంచి ఇప్పటికీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందన్నారు.

బడిలో మత్తుమందు తయారీ!

- ఓల్డ్ బోయిన్‌పల్లి మేధ పాఠశాలలోని రెండు గదుల్లో అల్ప్రాజోలం ఫ్యాక్టరీ
- కల్లు దుకాణాలకు సరఫరా
- పక్కా సమాచారంతో ఈగిల్ దాడి
- ఏడు కిలోల అల్ప్రాజోలం పట్టివేత

హైదరాబాద్ సిటీ/ బోయినపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాల.. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు.. కానీ అదే భవనంలోని రెండు గదుల్లో రహస్యంగా అల్ప్రాజోలం మత్తు మందు తయారవుతోంది.. పలు ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లకు, ఇతర దుకాణాలకు సరఫరా అవుతోంది. సదరు పాఠశాల నిర్వాహకుడే అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు ఈ దందాకు తెరతీశారు. శనివారం ఈగిల్ (నార్కోటిక్) బృందం ఆ పాఠశాలపై దాడి చేసి, గుట్టు రట్టు చేసింది. హైదరాబాద్‌లోని ఓల్డ్ బోయినపల్లిలో మల్లెల జయప్రకాశ్‌గౌడ్ మేధ పాఠశాలను నిర్వహిస్తున్నారు. అందులో కొంత గ్రౌండ్ ఫ్లోర్, ఒకటో అంతస్తులో తరగతి గదులు ఉన్నాయి. రెండో అంతస్తులో ఆఫీస్ రూమ్ ఉంది. అయితే జయప్రకాశ్‌గౌడ్‌కు తనకు తెలిసిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా ఏడాది క్రితం గురువారెడ్డి పరిచయం అయ్యారు. తన వద్ద అల్ప్రాజోలం తయారీ



అల్ప్రాజోలం తయారు చేస్తున్న గది, పరికరాలు

ఫార్ములా ఉందని, కోట్లు సంపాదించవచ్చని గురువారెడ్డి చెప్పారు. ఆ ఫార్ములా, తయారీ పద్ధతి తెలుసుకున్న జయప్రకాశ్.. పాఠశాల రెండో అంతస్తులో ఆఫీసు పక్కన రెండు గదుల్లో మినీ ఫ్యాక్టరీ పెట్టి అల్ప్రాజోలం తయారుచేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లోని బూత్పూర్‌తోపాటు పలు ప్రాంతాల్లోకి కల్లు కాంపౌండ్లకు, కల్లు విక్రేతలకు దానిని సరఫరా చేస్తున్నారు. దీనిపై సమాచారం అందిన ఈగిల్ బృందం శనివారం దాడి చేసింది. తయారు చేసి సిద్ధంగా ఉంచిన అల్ప్రాజోలం 3.5 కిలోలు, తయారీ ప్రక్రియ చివరిలో ఉన్న అల్ప్రాజోలం 4.3 కిలోలు, అల్ప్రాజోలం తయారీ పరికరాలు, ముడి పదార్థాలు, మాత్రలతోపాటు రూ.21 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. జయప్రకాశ్‌గౌడ్‌తోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. ముడి పదార్థాలు ఎక్కడి నుంచి తెస్తున్నారు? తయారు చేసిన అల్ప్రాజోలంను ఎవరెవరికి అమ్మారు? ఇందులో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందన్న అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఏడుస్తుందని చంపేశాం

- వివాహేతర సంబంధానికి అడ్డం అన్న ఆలోచనతో ప్రియుడితో కలిసి రెండేళ్ల కూతురును చంపిన తల్లి
- చిన్నారిని కొట్టి.. గొంతు నులిమి దారుణ హత్య



నిందితులు మమత, ఫయాజ్

తూప్రాన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డను ప్రియుడితో కలిసి హత్య చేసిన ఘటనలో తల్లి మమత, ఆమె ప్రియుడు షేక్ ఫయాజ్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. తూప్రాన్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ నరేందర్‌గౌడ్ కేసు వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్‌పల్లికి చెందిన మమత(23) వివాహం సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం వడ్డెపల్లికి చెందిన బంటు భాస్కర్‌తో జరిగింది. వీరికి చరణ్(4), తనుశ్రీ(2) సంతానం. పెళ్లికి ముందు నుంచే మమతకు గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్(30)తో వివాహేతర సంబంధం ఉంది. మరోవైపు, భర్త భాస్కర్ అమాయకత్వం మమతకు నచ్చలేదు. దీంతో ఆమె కొంతకాలం క్రితం ప్రియుడు ఫయాజ్‌తో పరారైంది. కొద్దిరోజులకు తిరిగి వచ్చినా భర్తతో కలిసి ఉండేందుకు ఇష్టం లేక మేలో తల్లిగారింటికి పిల్లలతో వెళ్లిపోయింది. మే 21న కొడుకు చరణ్‌ను తల్లిగారింటి వద్దనే వదిలి తనుశ్రీని తీసుకొని అత్తగారింటికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పిన మమత ఫయాజ్‌తో మళ్లీ పరారైంది. అయితే, మమత ఇంటికి రాలేదని అల్లుడు భాస్కర్ చెప్పడంతో 27న మమత తండ్రి రాజు శివ్వంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జ్వరంతో చనిపోయిందని అబద్ధాలు

ఏపీలోని గుంటూరు జిల్లా నర్సరావుపేట మండలం కనపర్రు వద్ద మమత, షేక్ ఫయాజ్ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని శుక్రవారం శివ్వంపేట తీసుకొచ్చారు. తనుశ్రీ ఎక్కడని అడగగా, జర్వంతో చనిపోయిందని ఇద్దరు రకరకాలుగా చెప్పడంతో లోతుగా ప్రశ్నించారు. దీంతో, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని, ఏడుస్తూ ఇబ్బంది పెడుతోందని, అందుకే చంపేశామని వారు ఒప్పుకొన్నారు. కనపర్రుకు పరారైన వీరు మే 28న చిన్నారి పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. తర్వాత జూన్ 4న బైక్‌పై శభాష్‌పల్లికి తీసుకువచ్చారు. శభాష్‌పల్లిలోనే తనుశ్రీని కొట్టి, గొంతు నులిమి హతమార్చి పూడ్చి పెట్టారు. అదే రాత్రి తిరిగి వెళ్తూ బైక్‌లను చోరీ చేస్తూ పెట్రోల్ ఉన్నంత వరకు వెళ్తూ.. ఇలా నాలుగు బైకులు మార్చేసి కనపర్రుకు వెళ్లిపోయారు. మిస్సింగ్ కేసులో వీరిని అరెస్ట్ చేయగా, కన్నబిడ్డను ప్రియుడితో కలిసి చంపేసిన విషయం బయటకు వచ్చింది. శుక్రవారం వారిద్దరు చూపించిన ప్రాంతంలో తవ్వి చిన్నారి మృతదేహాన్ని బయటకు తీశారు. శనివారం బంటు మమత, ప్రియుడు షేక్ ఫయాజ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫయాజ్‌పై 20 కేసులు ఉన్నాయని, శివ్వంపేట పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు.

మహిళను హత్య చేసి.. ఆరు గంటలు సిటీలోనే తిరిగి..

- కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ హత్యకేసును సినీ ఫక్కీలో ఛేదించిన పోలీసులు
- నిందితుల ఫోన్ కాల్స్ ఆధారంగా నిఘా
- విమానాల్లో ఒక టీమ్ ఢిల్లీకి, మరో టీమ్ రాంచీకి..
- జార్ఖండ్‌లోని రాంచీలో ఇద్దరు నిందితులు, వారికి సహకరించిన మరొకరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో జరిగిన రేణు అగర్వాల్ హత్య కేసును పోలీసులు సినీ ఫక్కీలో ఛేదించారు. హత్య చేసి జార్ఖండ్‌లోని రాంచీకి పారిపోయిన యువకులపై.. టెక్నాలజీతో నిఘా పెట్టి, విమానంలో వెళ్లి పట్టుకున్నారు. వారికి సహకరించిన మరో యువకుడినీ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రోల్డ్‌గోల్డ్ ఆభరణాలు, కొంత బంగారం, 16 గడియారాలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సీపీ అవినాశ్ మహంతి శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

దోపిడీ కోసం రెండు రోజులు రెక్కీ..

స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో ఉండే రాకేశ్ అగర్వాల్, రేణు అగర్వాల్ దంపతుల ఇంట్లో పశ్చిమబెంగాల్‌కు చెందిన శంకర్ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా జార్ఖండ్‌కు చెందిన హర్ష పదిరోజుల క్రితం పనిలో చేరాడు. అదే అపార్టుమెంట్ పై అంతస్తులో ఉండే రాకేశ్ సోదరుడి ఇంట్లో జార్ఖండ్‌కే చెందిన రోషన్ అనే యువకుడు 11 నెలలుగా పనిచేస్తున్నాడు. రోషన్‌కు డ్రగ్స్, గంజాయి వ్యసనాలు ఉన్నాయి. అతడిపై జార్ఖండ్‌లోని మూడు పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. ఈ ఇద్దరూ కలసి రాకేశ్ అగర్వాల్ ఇంట్లో బంగారం, డబ్బు కొట్టేసేందుకు పథకం వేశారు. ఇందుకోసం ఈ నెల 8, 9 తేదీల్లో రెక్కీ చేశారు. 10వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న రాకేశ్ భార్య రేణు అగర్వాల్‌ను కట్టేసి.. లాకర్ తాళాలు ఎక్కడున్నాయో చెప్పాలని చిత్రహింసలు పెట్టారు. ఆమె చెప్పకపోవడంతో కుక్కర్‌తో తలపై కొట్టి, కత్తితో గొంతుకోసి హత్య చేశారు. తర్వాత అదే ఇంట్లో స్నానం చేశారు. ఇంట్లో ఉన్న 16 గడియారాలు, రోల్డ్‌గోల్డ్ ఆభరణాలను తీసుకుని, బ్యాగులో బట్టలు సర్దుకుని యజమాని స్కూటీపై హఫీజ్‌పేట రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. ఎంఎంటీఎస్‌లో సికింద్రాబాద్ వెళ్లడానికి టికెట్లు కొన్నారు. కానీ ప్లాట్‌ఫామ్ వద్ద పోలీసులను చూసి స్టేషన్ బయటికి వచ్చారు. రాత్రి 11 గంటల వరకు బస్సుల్లో నగరంలోనే తిరిగారు. తర్వాత మాదాపూర్‌లో క్యాబ్ మాట్లాడుకుని రాంచీకి బయల్దేరారు. ఇలా హత్య చేసి మధ్యాహ్నం 4:30 గంటలకు బయటికి వచ్చిన నిందితులు.. ఆరున్నర గంటలు నగరంలోనే తిరిగారు.



రేణు అగర్వాల్ (ఫైల్)

టెక్నాలజీతో నిఘా పెట్టి.. విమానాల్లో వెళ్లి..

హత్య ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ, ఇతర ఆధారాలతో నిందితులు క్యాబ్‌లో రాంచీకి బయల్దేరినట్టు గుర్తించారు. ఢిల్లీలోని ఓ యువకుడికి పలుమార్లు ఫోన్ చేసి మాట్లాడటంతో ఢిల్లీకి పారిపోయే యత్నంలో ఉండొచ్చని భావించారు. వెంటనే విమానంలో ఒక టీమ్‌ను రాంచీకి, మరో టీమ్‌ను ఢిల్లీకి పంపారు. అయితే నిందితులు రాంచీకి చేరుకుని.. రోషన్ సోదరుడు రాజువర్మ గదికి వెళ్లారు. రాజువర్మ వారిని ఒక ఓయో లాడ్జిలోని గదిలో ఉంచాడు. ఢిల్లీ వెళ్లిన పోలీసు బృందం.. నిందితులతో ఫోన్ మాట్లాడిన యువకుడిని పట్టుకుంది. అతడితో నిందితులకు ఫోన్ చేయించి వారెక్కడ ఉన్నదీ తెలుసుకుని రాంచీలో ఉన్న పోలీసు బృందానికి సమాచారం అందజేసింది. ఈ బృందం స్థానిక పోలీసుల సాయంతో లాడ్జికి వెళ్లి.. హర్ష, రోషన్‌లతోపాటు వారికి సహకరించిన రాజువర్మను అరెస్టు చేశారు. ఈ సమయంలో రోషన్ డ్రగ్స్ మత్తులోనే ఉన్నాడని పోలీసులు తెలిపారు.

పాఠశాలలో కామాంధుడు

విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

దేహశుద్ధి చేసిన ఓ బాలిక తల్లిదండ్రులు, బంధువులు

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు..నల్లగొండ జిల్లాలో ఘటన

నకిరేకల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా వ్యవహరించాడు. తనకు సహకరిస్తే ఏం కావాలన్నా ఇస్తానని, ఊరు చివర ఉండే తన ఇంటికి ఒంటరిగా రావాలని ఓ విద్యార్థిని వేధించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో శనివారం జరిగింది. జిల్లాలోని ఓ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్ పాఠశాలలోని బాలికలతో కొన్నాళ్లుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఓ బాలిక ధైర్యం చేసి తనకు పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడి నుంచి ఎదురవుతున్న వికృత చేష్టలు, అసభ్యకర ప్రవర్తనను తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సెక్సీగా ఉంటావని, తనకు సహకరిస్తే ఏం కావాలన్నా ఇస్తానని, ఊరు చివర ఉండే తన ఇంటికి ఒంటరిగా రావాలని వేధిస్తున్నారని తల్లిదండ్రులకు తెలియజేసింది. తాను పాఠశాలకు వెళ్లలేనని బాలిక తల్లిదండ్రులకు తేల్చిచెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడి ఇంటి వద్దకు వెళ్లి నిలదీశారు. ఇంటిమీదకు వచ్చినందుకు కేసు పెడతానని శ్రీనివాస్ బాలిక తల్లిదండ్రులను బెదిరించడంతో ఆగ్రహానికి లోనైన బాలిక తల్లిదండ్రులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. అనంతరం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేశారని పేర్కొంటూ సదరు ఉపాధ్యాయుడు కూడా బాలిక తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు.

మే..మే.. అంటూ దొంగలను పట్టించిన మేకలు

- అపహరణకు గురైన మూగజీవాలు.. జియాగూడ మార్కెట్‌లో తమ యజమానిని చూసి అరుపులు

షాద్‌నగర్/ చౌదరిగూడ సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మే.. మే.. అని అరిచే మేకలే కదా అని చులకనగా చూసి వాటిని అపహరించిన దొంగల ఆటను ఆ మేకలే కట్టించాయి. అపహరణకు గురైన మూడు రోజుల తర్వాత ఓ మార్కెట్‌లో తమ యజమానిని గుర్తించి పరుగులు పెట్టిన మేకలు.. దొంగలను పట్టించాయి. ఈ ఘటన హైదరాబాద్, పాతబస్తీలోని జియాగూడ మార్కెట్‌లో జరిగింది. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో వెంకటయ్యకు చెందిన 30 మేకలను ఈ నెల 9న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వెంకటయ్య, అతని కుటుంబసభ్యులు ఆ రోజు నుంచి వాటి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వెంకటయ్య కుమారుడు ప్రవీణ్ సెప్టెంబరు 11న జియాగూడ మేకల మార్కెట్‌కు వచ్చాడు. అక్కడ ఓ కంటెయినర్ వద్ద ఉన్న కొన్ని మేకలు ప్రవీణ్‌ను చూసి అరవడం మొదలుపెట్టాయి. దీంతో ప్రవీణ్ తమ కోడ్ బాషలో ఆ మేకలను పిలిచాడు. అంతే ఆ మేకలన్నీ ఒక్కసారిగా ప్రవీణ్ దగ్గరికి పరుగు తీశాయి. దీంతో ఆ మంద వద్ద ఉన్న వ్యక్తులను ప్రవీణ్ ప్రశ్నించగా.. తాము మేకలను రూ.30 లక్షలకు కొన్నామని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ప్రవీణ్‌ను వారు భయపెట్టేందుకు యత్నించారు. ప్రవీణ్ ద్వారా విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న వెంకటయ్య తదితరులు కుల్సుంపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ మేకలతో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాన్ని అంగీకరించారు. నిందితులను, మేకలను శుక్రవారం రాత్రికి చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన మరో ముగ్గురు తమ ముఠాలో ఉన్నారని ఆ దొంగలు చౌదరిగౌడ పోలీసులకు వెల్లడించారు. దీంతో చౌదరిగూడ పోలీసులు పరిగికి వెళ్లి ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారు దొంగిలించి దాచిపెట్టిన సుమారు 200 మేకలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రాణం మీదకి తెచ్చిన పానీపూరి

- రోడ్డు పక్కన పానీపూరి తిని ఆస్పత్రిపాలైన ఐటీ ఉద్యోగి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పానీపూరి ఓ యువకుడి ప్రాణాల మీదికి తెచ్చింది. రోడ్డు పక్కన ఓ బండి వద్ద పానీపూరి తిని అక్కడి నీళ్లు తాగడంతో హెపటైటిస్-ఏ బారినపడి నెల రోజులు పాటు ఆస్పత్రిపాలయ్యాడు. హైదరాబాద్ ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(22) తీవ్ర అస్వస్థతతో ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రికి నెల రోజుల క్రితం వచ్చాడు. వైద్యులు ఆరా తీయగా... అక్కడికి రెండు వారాల క్రితం రోడ్డు పక్కన బండి వద్ద పానీపూరి తిని అక్కడి డబ్బాలోని నీటిని తాగినట్టు చెప్పాడు. రక్త పరీక్షలు చేయగా హెపటైటిస్ ఏ తీవ్రంగా ఉండటమే కాక కాలేయం ఎంజైములు పెరిగినట్టు, యాంటీ-హెచ్ఏవీ ఐజీఎం యాంటీబాడీలు పాజిటివ్ అని తేలినట్టు ఆ ఆస్పత్రి గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కలువల హర్షతేజ తెలిపారు. దీంతో 4 వారాల చికిత్స అనంతరం కాలేయం పరిస్థితి మెరుగుపడి రోగి కోలుకున్నాడని ఇటీవల డిశ్చార్జి చేశామని తెలిపారు.

మాజీ నక్సలైట్‌కు భూకేటాయింపులో నిర్లక్ష్యమా?

- వివరణ ఇవ్వకుంటే వ్యక్తిగతంగా హాజరవ్వాలి
- సిద్ధిపేట్ కలెక్టర్ నిర్లక్ష్యంపై హైకోర్టు అసహనం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నక్సలైట్ల చేతిలో హత్యకు గురైన ఓ మాజీ నక్సలైట్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం భూమి కేటాయించడంలో నిర్లక్ష్యం వహించడంతోపాటు కౌంటర్ దాఖలు చేయకుండా జాప్యం చేస్తున్న సిద్ధిపేట జిల్లా కలెక్టర్ పనితీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. భూకేటాయింపునకు సంబంధించి ఈసారి కౌంటర్ దాఖలు చేయకపోతే సిద్ధిపేట కలెక్టర్ ప్రత్యక్షంగా హాజరుకావాలని పేర్కొంటూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. అప్పటి పీపుల్స్ వార్ గ్రూప్‌లో 16 ఏళ్లపాటు అజ్ఞాత జీవితం గడిపిన ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నాగవెల్లి మోహన్, అలియాస్ నక్క మోహన్ అలియాస్ ప్రకాశ్ 1989లో పోలీసుల ఎదుట లొంగిపోయారు. పునరావాస పాలసీలో భాగంగా మోహన్‌కు భూమి కేటాయించాలని ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్‌కు అప్పటి ఇంటెలిజెన్స్ ఐజీ సిఫార్సు చేశారు. జిల్లాస్థాయి కమిటీ సైతం ఈ మేరకు తీర్మానం చేసింది. అయితే, 2003లో పోలీసులకు సహకరిస్తున్నాడనే కారణంతో మోహన్‌ను నక్సలైట్లు హత్య చేశారు. దీంతో మోహన్ భార్యకు భూమి కేటాయించాలని ఇంటెలిజెన్స్ ఐజీ మళ్లీ జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. మోహన్ భార్య అనేక విజ్ఞప్తులు చేయడంతో ప్రజ్ఞాపూర్‌లో ఎకరం భూమి కేటాయించినా అది ప్రైవేటు పట్టా భూమి కావడంతో భూ వివాదం కారణంగా కేటాయింపు రద్దయింది. దీంతో మోహన్ భార్య అరుణ 2015లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌లో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈనెల 24లోపు కౌంటర్ దాఖలు చేయకపోతే సిద్ధిపేట్ కలెక్టర్ ప్రత్యక్షంగా హాజరు కావాలని ఆదేశాలు జారీచేసింది.

జనజీవన స్రవంతిలోకి మావోయిస్టు నేత పద్మావతి

- ఈమె.. ఒకప్పటి అగ్రనేత కిషన్‌జీ భార్య
- ప్రస్తుతం కేంద్ర కమిటీలో ఏకైక మహిళ
- అనారోగ్యం నేపథ్యంలో లొంగుబాటు
- 25లక్షల చెక్కు అందజేసిన డీజీపీ

హైదరాబాద్/గట్టు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన మహిళా నేత, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి అలియాస్ కల్పన అలియాస్ సుజాతక్క పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, 2011లో మరణించిన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ భార్య అయిన కల్పన స్వస్థలం గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడు. పటేల్ తిమ్మారెడ్డి, వెంకమ్మలకు పద్మావతి రెండో సంతానం. పీపుల్స్‌వార్ నేతలు పటేల్ సుధాకర్ రెడ్డి, పోతుల సుదర్శన్ రెడ్డికి దగ్గరి బంధువైన కల్పన.. వారి ఆలోచనలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై 1982లో పీపుల్స్‌వార్‌లో చేరారు. తొలుత ఆమె రాడికల్ విద్యార్థి సంఘం తరఫున గ్రామ స్థాయి కార్యకర్తగా పని చేశారు. తర్వాత జన నాట్య మండలిలో గద్దర్, సంజీవ్ బృందంలో పని చేశారు. పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో కొనసాగిన పీస్ బుక్ సెంటర్‌లో ఏడాది పాటు పనిచేశారు. అదే సమయంలో ఆమెకు కిషన్ జీతో పరిచయం ఏర్పడింది. 1984లో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత 1987లో కిషన్‌జీ, కల్పనకు గడ్చిరౌలిలో కీలక బాధ్యతలను పార్టీ అప్పజెప్పింది. 2023లో కేంద్ర కమిటీ సభ్యురాలయ్యారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో ఏకైక మహిళా నాయకురాలిగా ఉన్న ఆమె.. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నా రు. గతేడాది అక్టోబరులో చికిత్స కోసం హైదరాబాద్‌వస్తుండగా.. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న ప్రచారం జరిగింది. ఇక, 3 నెలల క్రితం ఆరోగ్యం క్షీణించడంతో జనజీవన స్రవంతిలో కలవాలనుకుంటున్న విషయాన్ని కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు



లొంగిపోయిన మావోయిస్టు పోతుల పద్మావతికి పునరావాస చెక్కును అందజేస్తున్న డీజీపీ జితేందర్

ద్వారా కేంద్ర కమిటీకి ఆమె తెలియజేశారు. 43 ఏళ్ల ఉద్యమ జీవితం తర్వా త జనజీవన స్రవంతి వైపు అడుగులు వేశారు. ఆమె పై 106 కేసులుండగా.. రూ.25 లక్షల రివార్డు ఉంది. డీజీపీ జితేందర్ సమక్షంలో శనివారం కల్పన లొంగిపోగా.. పునరావాస ప్యాకేజీ కింద రూ.25లక్షలను అందజేశారు.

హింసాత్మక పోరాటాలకు కాలంచెల్లింది: సంజయ్

దేశంలో హింసాత్మక పోరాటాలకు కాలం చెల్లిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 'సుజాత లొంగుబాటే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు.

గరియాబంద్ ఎన్‌కౌంటర్ బూటకం: గడ్డం లక్ష్మణ్

నల్లకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ ఎన్‌కౌంటర్ బూటకం అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, గరియాబంద్ ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హైదర్‌గూడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన సాయుధ బలగాలు దండకారణ్యంలో యుద్ధవాతావరణం సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు.

లొంగిపోతే.. అన్ని విధాలా సాయం: డీజీపీ

పోరు వద్దు-ఊరు ముద్దు అంటూ ఆయుధాలను వదిలిసి లొంగిపోయే మావోయిస్టులకు అన్ని విధాలా సాయం చేస్తామని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఇప్పటిదాకా వివిధ రాష్ట్రాలకు చెందిన 404 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీలో 73 మంది మాత్రమే ఉన్నారని, వారిలో 11మంది తెలంగాణకు చెందిన వారు కాగా.. మిగతా వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న 15మంది సభ్యుల్లో.. పది మంది తెలంగాణ వారని చెప్పారు. వీరందరూ ఆయుధాలు వదిలేసి.. జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. తమవల్ల పోలీసు బలగాలకు జరుగుతున్న నష్టాన్ని బయటకు వెల్లడించడం లేదంటూ ఇటీవల మావోయిస్టు పార్టీ ప్రకటనపై విలేకరులు ప్రశ్నించగా.. కర్రెగుట్టల ఎన్‌కౌంటర్‌లో క్రాస్ ఫైరింగ్ వల్లే గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మరణించారని, మావోయిస్టుల దాడిలో కాదని డీజీపీ స్పష్టం చేశారు. కాగా, మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రజా సంఘాలు కోరుతున్న నేపథ్యంలో పోలీసు శాఖ వైఖరి ఏంటన్న ప్రశ్నపై ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి స్పందిస్తూ చర్చల అంశం కేంద్రం పరిధిలోనిదని తెలిపారు.

భూపాలపల్లిలో మతమార్పిడి కలకలం!

హాస్టల్ విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లిన మునిసిపల్ అధికారి భార్య

- మోటివేషన్ పాఠాల పేరిట బైబిల్ పాఠాలు
- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు

భూపాలపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థినులను ఓ అధికారి భార్య తన ఇంటికి తీసుకువెళ్లి మత బోధనలు చేసి, ప్రార్థనలు చేయించడం కలకలం రేపుతోంది. వారిని మతమార్పిడి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. భూపాలపల్లి ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్న మునిసిపల్ టీపీవో సునీల్ ఇంటికి శుక్రవారం సాయంత్రం 12 మంది విద్యార్థినులు వచ్చారు. వీరిలో భూపాలపల్లిలోని బీసీ హాస్టల్‌కు చెందిన ఐదుగురు, ఎస్సీ హాస్టల్‌కు చెందిన నలుగురు, కాటారం మండలం గంగారం గ్రామంలోని మోడల్ స్కూల్‌లో డే స్కాలర్‌లో పదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు ఉన్నారు. టీపీవో భార్య లీనా బీసీ హాస్టల్‌కు వెళ్లి ఐదుగురు విద్యార్థినులను వాచ్‌మన్‌కు చెప్పి బయటకు తీసుకెళ్లింది. అలాగే ఎదురుగా ఉన్న ఎస్సీ హాస్టల్‌కు వెళ్లి వార్డెన్ అనుమతి తీసుకున్నామని వాచ్‌మన్‌కు నమ్మబలికి విద్యార్థినులను బయటకు తీసుకెళ్లింది. మోటివేషన్ తరగతులకు తీసుకెళ్తున్నామని విద్యార్థినులకు చెప్పింది. తన ఇంటికి తీసుకెళ్లాక బైబిల్ గురించి చెబుతూ ప్రార్థనలు చేయించిందని విద్యార్థినులు తెలిపారు. అలాగే సైన్స్ ఫెయిర్ ఉందని చెప్పి ఓ వ్యక్తి.. గంగారం మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థునులను తీసుకెళ్లాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ విద్యార్థినులు భూపాలపల్లిలో మునిసిపల్ అధికారిలో ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో వార్డెన్లు, తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు టీపీవో ఇంటి వద్ద శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగారు. శనివారం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని సీఐ నరేశ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కూడా విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రేయింబవళ్లు.. రైతుల క్యూ!

- యూరియా కోసం తప్పని తిప్పలు
- ఆగ్రహంలో రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- ధర్నాలు, రాస్తారోకోలు, బైఠాయింపులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. పంపిణీ కేంద్రాలు, దుకాణాల ముందు రేయింబవళ్లు బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. అయినా దొరక్కపోవడంతో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ కోయిల్‌కొండలో రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్‌లో ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించడంతో రాకపోకలు నిల్చిపోయాయి. కామారెడ్డి జిల్లా బీబీపేటలోని పంపిణీ కేంద్రానికి యూరియా లోడ్‌తో లారీ రాగా రైతులు భారీ సంఖ్యలో ఎగబడ్డారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ తరుణంలో పోలీసులు పోలీస్ స్టేషన్‌లో రైతులకు టోకెట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక చోట్ల రైతులు గంటల తరబడి బారులు తీరారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఆస్నాద, నాగాపూర్ గ్రామాల్లో యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. కాగా, యూరియా దొరకకపోవడంతో పంట ఎండిపోతోందన్న మనస్తాపంతో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం రైతు నర్సయ్య ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

రైతులను నేరస్తులుగా మార్చిన ప్రభుత్వం: హరీశ్

బస్తా యూరియా కోసం పొలాలు వదిలి పోలీసు స్టేషన్లకు వెళ్లి పడిగాపులు కాసే దుస్థితికి తెచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కామారెడ్డి జిల్లాలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులను పోలీసు స్టేషన్‌కు తరలించారని శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి నేరస్తులా అని ఆయన ప్రశ్నించారు.



టోకెన్ల కోసం కామారెడ్డి జిల్లా బీబీపేట పోలీస్ స్టేషన్ వద్ద క్యూలో కూర్చుని వేచి చూస్తున్న రైతులు

రాష్ట్రంలో రైతుల అవసరాలకు సరిపడా యూరియాను కేంద్రం విడుదల చేసినా ఎందుకు కొరత ఏర్పడిందో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులే యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం ద్వారా కృత్రిమ కొరత సృష్టించారని ఆరోపించారు.

కొరతతో అల్లాడుతున్న రైతులు

నెల రోజులుగా రాష్ట్రంలో యూరియా సమస్య తీవ్రంగా ఉన్నదని, రైతులు యూరియా కోసం అల్లాడిపోతున్న పరిస్థితి నెలకొందని తెలంగాణ వికాస సమితి పేర్కొంది. తమ బృందం క్షేత్రస్థాయిలో చేసిన అధ్యయనం వివరాలను సమితి శనివారం విడుదల చేసింది. ఈ బృందం వర్గల్, గజ్వేల్, రాయపోల్, ములుగు మండలాల్లోని యూరియా విక్రయ కేంద్రాలు, గ్రామాల్లో రైతుల అభిప్రాయాలు సేకరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

అసహనం పరాకాష్ఠకు!

జగన్‌రెడ్డి కేసు పుణ్యమా అని న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు లేకపోతే ఎలా– అని ప్రశ్నిస్తున్న న్యాయ వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి వంటి వారి విషయంలో తీర్పు ఇవ్వడానికి గడువు లేకపోతే ఎలా– అని ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధుల కేసులు ఏడాదిలోగా పరిష్కారం కావాలని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాలలో స్పష్టం చేసింది. అయినా జగన్‌రెడ్డి కేసులలో పుష్కర కాలం గడచినా విచారణ కూడా పూర్తి కాలేదు. ఈ మధ్యలో ఎందరో ప్రధాన న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఇలాంటి సందర్భాలలోనే కదా వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోయేది? తమ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థలోని బాధ్యులపై లేదా? అతీగతీ లేకుండా పడివున్న ఈ కేసులలో భవిష్యత్తులో విచారణ పూర్తై జగన్‌రెడ్డి దోషిగా తేలితే గతంలో ముఖ్యమంత్రిగా ఆయన చేసిన తప్పు ఒప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారు?

'భారత రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం' ..నేపాల్ పరిణామాల నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్య ఇది. రాజ్యాంగాన్ని చూసి మాత్రమే కాదు, అంతటి మహోన్నత రాజ్యాంగాన్ని రచించి మనకు అందించిన రాజ్యాంగ నిర్మాతలను చూసి కూడా గర్వించాలి కదా? భిన్న మతాలు, భిన్న జాతులతో కూడిన మన దేశం భిన్నత్వంలో ఏకత్వంతో అప్రతిహతంగా సాగిపోవడానికి వారు అందించిన రాజ్యాంగమే ప్రాతిపదిక కదా? రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో రాజ్యాంగం లోపభూయిష్టంగా ఉందని కాదు.. పాలకులు బాధ్యతారహితంగా, రాజ్యం వీర భోజ్యం అన్నట్టుగా వ్యవహరించడం వల్ల అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లి ప్రజల్లో అసహనం పరాకాష్ఠకు చేరింది. ఫలితమే ప్రజాగ్రహం పెల్లుబికి పాలకులు దేశం విడిచి పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దుస్థితి వెనుక అమెరికా హస్తమో లేక మరొకరి హస్తమో ఉందని చెప్పుకోవచ్చు కానీ ప్రభుత్వాల పట్ల ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకొని ఉండక పోతే తిరుగుబాట్లు చోటుచేసుకోవు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో మన దేశాన్ని ఏ విధంగానూ పోల్చలేము. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతుల కలబోతగా ఉన్న మన దేశంలో ప్రభుత్వాలపై ఈ రూపంలో తిరుగుబాట్లు అసాధ్యం. అలా జరగాలని కూడా కోరుకోకూడదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక పరీక్షలకు నిలబడి పరిపక్వత చెందింది. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు విజ్ఞత ప్రదర్శించి హద్దులు మీరిన పాలకులకు ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ ద్వారా కర్రు కాల్చి వాత పెడుతున్నారు. అయితే ఏ సందర్భంలో కూడా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజల తీర్పు ఒకే రకంగా ఉండకపోవడం మన విశిష్టత. ఉదాహరణకు, ఎమర్జెన్సీనే తీసుకుందాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన అధికారానికి ముప్పు ఏర్పడుతోందని గ్రహించి దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఫలితంగా లభించిన అపరిమిత అధికారాలతో అధికార యంత్రాంగం ప్రజలను హింసించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలలో ఎమర్జెన్సీ ప్రభావం తక్కువగా ఉండింది. ఈ కారణంగా ఉత్తరాదిలో తుడిచిపెట్టుకు పోయిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదిన కొంత మేరకు నిలదొక్కుకోగలిగింది. అత్యవసర పరిస్థితి నాటి దురాగతాలను కూడా ప్రజలు ఎన్నికల వరకు భరించి బ్యాలెట్ ద్వారా ఇందిరాగాంధీకి గుణపాఠం చెప్పారు. అంతేగానీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయలేదు. 1984లో తెలుగునాట చోటుచేసుకున్న అధికార దుర్వినియోగాన్నే తీసుకుందాం. మెజారిటీ శాసనసభ్యుల మద్దతు కలిగి ఉన్న ఎన్టీఆర్‌ను తొలగించి నాదెండ్ల భాస్కర రావును ముఖ్యమంత్రిగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ రాంలాల్ నియమించారు. ఇది కూడా నాటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రోద్బలంతోనే జరిగింది. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌ను అన్యాయంగా, అక్రమంగా తొలగించడాన్ని జీర్ణించుకోలేని తెలుగు ప్రజలు శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఊపందుకోవడంతో గవర్నర్ రాంలాల్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఇందిరాగాంధీ దిగివచ్చి ఎన్టీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా నియమించడానికి అంగీకరించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆ కారణంగా జరిగిన ఎన్నికల్లో కూడా తెలుగు ప్రజల ఆగ్రహం చల్లారలేదు. దేశవ్యాప్తంగా సానుభూతి పవనాలు వీచి కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ లేనంత స్థాయిలో మెజారిటీ లభించి, రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగునాట మాత్రం ప్రజలు కాంగ్రెస్‌పై తమ కక్ష తీర్చుకున్నారు. అధికార దురహంకారంతో వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వాలపై మన ప్రజలు బ్యాలెట్‌ను బుల్లెట్‌లా ప్రయోగించారే గానీ, పొరుగు దేశాల్లో వలె విధ్వంస చర్యలకు పాల్పడలేదు. ఇందుకు మన సమాజాన్ని చూసి మనం గర్వించాలి. అయితే ప్రజలు మాత్రమే ఎల్లవేళలా విజ్ఞత ప్రదర్శించాలనుకోవడం అత్యాశే అవుతుంది. పాలకులపై ఆ బాధ్యత ఉండదా? ప్రజల మనో భావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలించాల్సిన బాధ్యత పాలకులపై ఉండదా? ఒక్కసారి అధికారంలోకి వస్తే ఐదేళ్ల పాటు విర్రవీగుతూ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడవచ్చా? అలా చేయడం ప్రజల సహనాన్ని పరీక్షించడం కాదా? రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న ఆయా వ్యవస్థల అధిపతులపై కూడా బాధ్యత ఉంటుంది కదా? మన రాజ్యాంగ నిర్మాతలు ఆయా రాజ్యాంగ వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖలు గీశారు. ఒక వ్యవస్థ అధికార పరిధుల్లోకి మరో వ్యవస్థ చొరబడకుండా సరిహద్దులు నిర్ణయించారు. అయితే రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్నవారు బాధ్యతారహితంగా వ్యవహరించిన సందర్భాలలో ఆయా వ్యవస్థల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. శాసనసభలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నాయకుడే ముఖ్యమంత్రిగా నియమితులు కావాలని రాజ్యాంగం అభిప్రాయపడింది. అదే సమయంలో గవర్నర్లు ఎవరినైనా ముఖ్యమంత్రులుగా నియమించవచ్చునని అదే రాజ్యాంగంలో పేర్కొన్నారు. దీని ఉద్దేశం దారినపోయే దానయ్యను ముఖ్యమంత్రిని చేయమని కాదు. ముఖ్యమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి అప్పటికి చట్టసభల్లో సభ్యుడు కాక పోయినా సభలో మెజారిటీ నిరూపించుకొని ఆరు నెలల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాలని రాజ్యాంగంలో నిర్దేశించారు. సదుద్దేశంతో కల్పించిన ఈ వెసులుబాటును రాంలాల్ వంటి వారు దుర్వినియోగం చేశారు. రాజ్యాంగ నిర్మాతల అభిమతాన్ని తప్పుగా అన్వయించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలను ఎన్నో చూశాం. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాల వ్యవధి ఉండాలా? వద్దా? అన్నది ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానం విచారణ పరిధిలో ఉంది. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రాష్ట్రపతి, గవర్నర్లు, న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించడంతో పాటు విశేష అధికారాలూ కల్పించారు. అలా అని మా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామని వారు భావిస్తే ప్రజల్లో అసహనం ఏర్పడదా? బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఏమిటని పాలకులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. పార్లమెంటు ఆమోదించే చట్టాలు సైతం రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేవా అని సమీక్షించి నిర్ణయం తీసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుంది కదా? శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా నెలలూ, సంవత్సరాల తరబడి పక్కన పడేస్తే ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు ఏమి చేయాలి? శాసనసభలు ఆమోదించిన బిల్లులు రాజ్యాంగానికి లోబడి లేని పక్షంలో ఆ విషయం చెప్పి తిరస్కరించవచ్చు. కానీ శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచడం, అదేమంటే మా అధికారాన్ని ప్రశ్నించి, మాకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఎక్కడిది? అని హుంకరించడం సమర్థనీయమా? గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి అవాంఛనీయ వివాదాలు తలెత్తవు కదా? మన దేశంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల విశ్వసనీయత కొంతకాలంగా మసకబారుతోంది.

సీఎం, పీఎం ఇష్టమేనా?

ఇక చట్టసభల విషయానికి వద్దాం. అధికార పార్టీ, అంటే దాని అధినేత మనసులో ఏమనుకుంటారో అవే చట్టాలు అవుతున్నాయి. ఆయా బిల్లులపై పార్టీలో గానీ, మంత్రుల స్థాయిలో గానీ చర్చలు జరగవు. ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి మనసులో మాటకు అనుగుణంగా అధికారులు బిల్లులు రూపొందిస్తున్నారు. సదరు బిల్లులను కనీసం చదవ కుండానే శాసనసభల్లో, పార్లమెంటులో ఆమోదిస్తున్నారని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో ప్రజల ద్వారా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి ఏదైనా కేసులో 3 నెలలకు మించి జైల్లో ఉంటే పదవి కోల్పోవలసి ఉంటుందని లోక్‌సభలో ఇటీవల ఒక బిల్లును ఆమోదించారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన వారిలో ఎంత మంది ఆ బిల్లును చదివారంటే చెప్పలేని పరిస్థితి. ఒకరకంగా చూస్తే ఈ బిల్లు ఉద్దేశం మంచిదే. అయితే మన దేశంలో అస్మదీయుల విషయంలో ఒకలా, తస్మదీయుల విషయంలో మరోలా చట్టాలు, వ్యవస్థలు పనిచేస్తాయన్న విషయం తెలిసిందే కదా? ప్రస్తుత పరిస్థితులలో ప్రతిపక్షాలకు చెందిన లేదా తస్మదీయ ముఖ్యమంత్రులపై కేంద్ర ఏజెన్సీలతో కేసులు పెట్టించి మూడు నెలలకు పైగా జైల్లో పెట్టడం కష్టమా? న్యాయవ్యవస్థ కూడా బెయిలు మంజూరు విషయంలో ఒక్కో సందర్భంలో ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ బిల్లు చట్టమైతే అది దుర్వినియోగం కాదన్న గ్యారెంటీ ఏముంది? కేంద్రంలో అధికారంలో ఉన్న వారికి గిట్టని ముఖ్యమంత్రిని ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని తొలగించబోరన్న గ్యారెంటీ ఏముంది? ఇలాంటి సందేహాలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. మన దేశంలో ఎంతో మంది రాజకీయ నాయకులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. పలువురిపై కేసులు నమోదయ్యాయి. పలువురు ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు బెయిల్‌పై ఉంటున్నారు. కేసులను ఎదుర్కొంటున్న నాయకులు అస్మదీయులు అయితే చట్టాలు వారి చుట్టాలవు తున్నాయి. తస్మదీయులైతే చట్టాలు కాల నాగుల్లా బుసకొడుతూ కాటేస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బెయిల్‌పై ఉన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేపోమాపో కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ విచారణ జరగబోతోంది. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్నారు. అవినీతి కేసులలో బెయిల్‌పై ఉన్న ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. జగన్‌రెడ్డి కేసు పుణ్యమా అని న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు లేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్న న్యాయ వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి వంటి వారి విషయంలో తీర్పు ఇవ్వడానికి గడువు లేకపోతే ఎలా? అని ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధుల కేసులు ఏడాదిలోగా పరిష్కారం కావాలని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాలలో స్పష్టంచేసింది. అయినా జగన్‌రెడ్డి కేసులలో పుష్కర కాలం గడచినా విచారణ కూడా పూర్తి కాలేదు. ఈ మధ్యలో ఎందరో ప్రధాన న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఇలాంటి సందర్భాల లోనే కదా వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోయేది? తమ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పాదుకోవాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థలోని బాధ్యులపై లేదా? జగన్‌రెడ్డిపై త్వరితగతిన విచారణ జరగకుండా అడ్డుకుంటోంది ఎవరు? ఆయనపై త్వరితగతిన విచారణ పూర్తిచేసి, దోషి లేదా నిర్దోషి అని ప్రకటిస్తే ప్రజలకు అటు న్యాయ వ్యవస్థపైనా, ఇటు పాలక వర్గాలపైనా నమ్మకం పెరుగుతుంది కదా? అతీగతీ లేకుండా పడివున్న ఈ కేసులలో భవిష్యత్తులో విచారణ పూర్తై జగన్‌రెడ్డి దోషిగా తేలితే గతంలో ముఖ్యమంత్రిగా ఆయన చేసిన తప్పు ఒప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారు? వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసునే తీసుకుందాం. మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేయడమే కాకుండా ఒక దివంగత ముఖ్యమంత్రికి సొంత సోదరుడు, మరో మాజీ ముఖ్యమంత్రికి సొంత బాబాయి అయిన వివేకానందరెడ్డి హత్య కేసుకే దిక్కూమొక్కూ లేకపోతే ప్రజలకు న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన నమ్మకం ఎందుకుండాలి? ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు మాత్రమే పరిష్కారం అని చెబితే మరి ఇన్ని వ్యవస్థలు ఎందుకు? మనం గర్విస్తున్న రాజ్యాంగానికి ఏపాటి విలువ ఇస్తున్నట్టు?

> **ప్రజలు న్యాయంకోసం చివరిగా తలుపు తట్టేది న్యాయ వ్యవస్థనే. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే మిగతా వ్యవస్థలు ఎన్ని వికారాలు పోయినా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లదు. భారతదేశం అజేయంగా, మన ప్రజాస్వామ్యం అజరామరంగా వెలుగొందుతాయి.**

ప్రజలు ఆగ్రహిస్తే అంతే!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు రాజ్యాంగం బలహీనంగా ఉండటం కారణం కాదని చెప్పవచ్చు. విదేశీ హస్తం కూడా కారణం కాకపోవచ్చు. ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండకపోతే ఏ విదేశీ శక్తి కూడా ఏమీ చేయలేదు. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా విదేశీ హస్తం అని నిందించేవారు. నిజానికి నాటి నుంచి నేటి వరకు ఏ విదేశీ శక్తి లేదా హస్తం మన దేశ పురోగతిని అడ్డుకోలేకపోయింది కదా? ప్రభుత్వాలు, వ్యవస్థలలో అవినీతి పెరిగిపోవడం వల్లనే మన దేశం అభివృద్ధి చెందాల్సినంతగా చెందలేదు. రాజ్యాంగ బద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. జగన్‌రెడ్డి, వివేకానంద రెడ్డి కేసులే అపరిష్కృతంగా ఉన్నాయంటే న్యాయ వ్యవస్థ పైన, ప్రభుత్వాలపైన ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? నేపాల్ ప్రభుత్వం కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించడం వల్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయని చెబుతున్నారు గానీ, అంతకు మించిన కారణం ఉండే ఉంటుంది. కేవలం సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించి నంత మాత్రాన మంత్రులపై దాడులు చేయడం, వారి ఇళ్ల ధ్వంసం చేయడం జరిగే పనేనా? ఆ ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉండి ఉంటుంది. ఆలస్యంగా అందుతున్న సమాచారం ప్రకారం నేపాల్‌కు చెందిన ఒక మంత్రి కారు ఒక మైనర్ బాలికను ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. కారు డ్రైవర్‌ను పట్టుకున్న 24 గంటల్లోనే సదరు డ్రైవర్‌కు బెయిల్ ఇవ్వడం, సదరు సంఘటనను స్వల్పమైనదిగా పేర్కొన డంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిలించిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నిరాశ, నిస్పృహలతో ఉన్న ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించడంతో ఆగ్రహావేశాలు కట్టులుతెగి దాడులకు తెగబడ్డారు. చివరికి ప్రభుత్వం కూలి పోయింది. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి అధ్యక్షుడి బెడ్ రూంలోనూ, స్నానాల తొట్టిలోనూ కూర్చొని ఫొటోలకు పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగుబాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రజల జీవితాలు అమాంతం బాగుపడ్డాయా అంటే లేదనే చెప్పవచ్చు. అయితే అప్పటి తమ కోపానికి కారకులైన పాలకులు దేశం విడిచి పారిపోవ డంతో ప్రజలు శాంతించారు. ఇప్పుడు నేపాల్‌లో కూడా ఓలి ప్రభుత్వం రాజీనామా చేయడంతో ప్రజలు మెల్ల మెల్లగా శాంతించారు. ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తాత్కాలిక ప్రధానిగా నియమించుకుందామని సైన్యం నుంచి ప్రతిపాదన వచ్చినా ఆందోళనకారులు సమర్థించలేదు. అంటే న్యాయ వ్యవస్థపైనా అక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోయారని భావించాలి. ఎట్టకేలకు వివాదం పరిష్కారమైంది. మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కార్కి తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈ మూడు దేశాలు మన దేశానికి మిత్ర దేశాలు. కొంతకాలంగా శ్రీలంక, నేపాల్.. చైనాకు సన్నిహితం అవుతున్నాయని వార్తలు వచ్చాయి. ఈ మూడు దేశాలలో చోటుచేసుకున్న ప్రజల ధర్మాగ్రహం నుంచి మన పాలకులు, రాజ్యాంగ వ్యవస్థల అధిపతులు నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమైనా ఉన్నాయా? అంటే ఉన్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. మన దేశం భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాలలో వలే తిరుగుబాట్లు చేయరు. అంతమాత్రాన ప్రజలను టేకెన్ ఫర్ గ్రాంటెడ్ అన్నట్టు తీసుకోకూడదు. పాలకులు అప్రజాస్వామికంగా, దురహంకారంతో వ్యవహరించారని భావించడంతో 1984లోనే తెలుగునాట ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట సాగిన ఉద్యమం ఒక దశలో హింసాత్మకంగా మారింది. అప్పుడు పోలీసు వ్యవస్థ కూడా ప్రజలతో మమేకం అయింది. ఎన్టీఆర్‌కు అన్యాయం జరిగిందని శాంతిభద్రతలను కాపాడాల్సిన బలగాలు కూడా భావించాయి. దీంతో ఉద్యమకారుల పట్ల సానుభూతితో వ్యవహరించారు. పాలకులు ఈ విషయం గుర్తుంచుకోవాలి. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతురాలు కూడా ప్రజాగ్రహానికి దిగిరాక తప్పలేదు. ఇక్కడ ఇంకో విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలి. నాడు అంతటి ప్రజాదరణను చూరగొన్న ఎన్టీఆర్‌ను ఐదేళ్ల తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో అదే ప్రజలు ఓడించారు. భారతీయులు శాంతి కాముకులు. మన చుట్టూ ఇప్పుడు జరుగుతున్న ఇటువంటి సంఘటనలు మన దేశంలో జరగకుండా మన రాజ్యాంగ నిర్మాతలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పొరుగు దేశాలలో వలె అధికారం సైన్యం చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మిలటరీని, వాయుసేనను, నౌకాదళాన్ని విడివిడిగా ఏర్పాటు చేసి వాటికి అధిపతులను నియమించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారు. ఎల్లయ్య మీద కోపం వస్తే పుల్లయ్యకు పట్టం కడుతున్నారే గానీ ఎన్నికల ప్రక్రియ, రాజకీయ వ్యవస్థపై అపార నమ్మకం ఉండి కాదు. ప్రస్తుతానికి ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అధికారంలోకి రావాలను కుంటున్న వారు సంక్షేమం పేరిట హద్దు మీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు ఎక్కడిది? అన్న ప్రశ్న తరచుగా వినిపిస్తోంది. మరోవైపు వనరులన్నీ పాలకుల మెప్పు పొందిన వారి సొంతం అవుతున్నాయి. ఇంకోవైపు సామాన్యులకు న్యాయం ఎండమావి అవుతోంది. మొత్తం మీద మన దేశంలో ప్రస్తుతం ఫలానా వ్యవస్థ పటిష్ఠంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తోందని చెప్పలేని పరిస్థితి నెలకొంది. అధికార దుర్వినియోగం పరిపాటిగా మారిపోయింది. దీంతో అవినీతిపరులు తప్పించుకోవడం సులువవుతోంది. ఎవరు మాత్రం అవినీతికి పాల్పడటం లేదు? అని ప్రజలు నిస్పృహతో ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత అటు పాలకులు, ఇటు రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. లేని పక్షంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో వలె కాకపోయినా మన దేశంలో మరో రూపంలో అశాంతి ప్రబలుతుంది. ఈ క్లిష్ట సమయంలో న్యాయ వ్యవస్థపైనే గురుతర బాధ్యత ఉంది. న్యాయ వ్యవస్థ తాను రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీనని భీష్మించుకొని ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా వ్యవహరిస్తే మిగతా వ్యవస్థలు కూడా దారిలోకి వస్తాయి. ప్రజలు న్యాయంకోసం చివరిగా తలుపు తట్టేది న్యాయ వ్యవస్థనే. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే మిగతా వ్యవస్థలు ఎన్ని వికారాలు పోయినా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లదు. భారతదేశం అజేయంగా, మన ప్రజాస్వామ్యం అజరామరంగా వెలుగొందుతాయి. జై హింద్!



> **మన చుట్టూ ఇప్పుడు జరుగుతున్న ఇటువంటి సంఘటనలు మన దేశంలో జరగకుండా మన రాజ్యాంగ నిర్మాతలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పొరుగు దేశాలలో వలె అధికారం సైన్యం చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మిలటరీని, వాయుసేనను, నౌకాదళాన్ని విడివిడిగా ఏర్పాటు చేసి వాటికి అధిపతులను నియమించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారు. ఎల్లయ్య మీద కోపం వస్తే పుల్లయ్యకు పట్టం కడుతున్నారే గానీ ఎన్నికల ప్రక్రియ, రాజకీయ వ్యవస్థపై అపార నమ్మకం ఉండి కాదు. ప్రస్తుతానికి ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అధికారంలోకి రావాలనుకుంటున్న వారు సంక్షేమం పేరిట హద్దు మీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు ఎక్కడిది? అన్న ప్రశ్న తరచుగా వినిపిస్తోంది. మరోవైపు వనరులన్నీ పాలకుల మెప్పు పొందిన వారి సొంతం అవుతున్నాయి. ఇంకోవైపు సామాన్యులకు న్యాయం ఎండమావి అవుతోంది.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కిర్క్ హత్యలో కార్ల్ మార్క్స్ 'ప్రమేయం'!!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మానసపుత్రుడైన చార్లీ కిర్క్ దారుణ హత్యకు గురయ్యాడు. ఉథా వ్యాలీ యూనివర్సిటీలో సెప్టెంబరు 11న నిర్వహించిన 'ద అమెరికన్ కమ్‌బ్యాక్ టూర్ కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా కిర్క్‌ను కాలేజీ విద్యార్థి ఒకడు తుపాకీతో కాల్చి చంపేశాడు. కిర్క్ 32 ఏళ్ల యువకుడు. అయితే ఛాందసుడు. కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అనే బాపతు!

అమెరికా కళాశాలల్లో అల్లరిమూకలు కాల్పులు జరిపిన వార్తలు తరచూ వింటుంటాం. ఇది అలాంటి హత్య కాదు. అమెరికన్లేగాక ఈ వార్త తెలిసిన వారంతా దీన్ని ఒకానొక హత్యా సంఘటనగా తేలిగ్గా తీసిపడేయడం లేదు. దాన్నొక భిన్న సైద్ధాంతిక శిబిరాల ఘర్షణగా చూస్తున్నారు. వివిధ దేశాలపై, వివిధ సమూహాలపై ట్రంప్ అనుసరిస్తున్న కక్షసాధింపు విధానాల మీద జరుగబోయే ప్రతిచర్యలకు ఇదొక మచ్చుతునక అంటున్నారు. ఇది ఇంతటితో ఆగదని కూడ కొందరు అంటున్నారు. చార్లీ కిర్క్ మీద కాల్పులు జరిపిన విద్యార్థిని పోలీసులు గుర్తించారు, అరెస్టు చేశారు. అతని పేరు టేలర్ రాబిన్‌సన్. 22 ఏళ్ల యువకుడు. హంతకుడ్ని చూసి ఉథా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ షాక్‌కు గురయ్యాడు. రాబిన్‌సన్ కుటుంబంతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి. మంచి కుటుంబం; మంచి అబ్బాయి; కానీ ఇంతలో ఇలా ఎలా రాడికల్‌గా మారిపోయాడు అంటూ ఆశ్చర్యపోయాడు. అమెరికాలో కూడా కమ్యూనిస్టు తీవ్రవాదుల్ని రాడికల్స్ అంటారు. చార్లీ కిర్క్ క్రైస్తవ మతవాది; అతివాద జాతీయవాది. సులువుగా చెప్పుకోవాలంటే అమెరికాలో పురాతన అమెరికన్లు, సనాతన క్రైస్తవులు మాత్రమే ఉండాలని ప్రగాఢంగా నమ్మేవాడు.

2016 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ "అమెరికాకు పూర్వ వైభవాన్ని పునరుద్ధరిద్దాం" (Make America Great Again – MAGA) అనే నినాదాన్ని ఇచ్చాడు. ఉదారవాదాన్ని తిరస్కరించడం, ప్రపంచీకరణను వ్యతిరేకించడం, అమెరికాకు వలసల్ని అడ్డుకోవడం, అన్నింటా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం అనడం ఇందులో ముఖ్యమైన అంశాలు. రోనాల్డ్ రీగన్ 1980లలోనే ఇలాంటి నినాదాలు ఇచ్చాడు. అయితే, ట్రంప్ వాటికి మరింత పదునుపెట్టాడు. ట్రంప్ విధానాలను చార్లీ గట్టిగా అందిపుచ్చుకున్నాడు. వాటిని దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేయడానికి 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' అనే సంస్థను నెలకొల్పాడు.

2020 నవంబరు నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయాడు. అయినా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌కు అధికారాన్ని అప్ప చెప్పి గద్దె దిగడానికి ట్రంప్ ఒప్పుకో లేదు. 2021 జనవరి 6న వాషింగ్టన్ డీసీలో తన అనుచరులైన అల్లరిమూక లతో ఒక కపట దాడిని నిర్వహించాడు. ఆ అల్లర్లలో కిర్క్ కీలక పాత్ర పోషించి ట్రంప్‌కు మరింత దగ్గర అయ్యాడు. ట్రంప్ రెండోసారి శ్వేతభవన నివాసి కావడంతో కిర్క్ మరింత రెచ్చిపోయాడు. చార్లీకి ఉదారవాదం అస్సలు పడదు. ఒక్కసారి అందులో పడితే కొట్టుకు పోతాం అనేది అతని ప్రగాఢ నమ్మకం. ఉదారవాదం అంటే ఇతర మతాలను, ఇతర దేవుళ్లను గౌరవించాలి. మహిళల్ని ఆదరించాలి. అతనికి గర్భస్రావం, విడాకులు కూడా నచ్చవు. ఎల్‌జీబీటీ క్యూ హక్కులు అస్సలు నచ్చవు.

ఉదారవాదాలకు మూలం కార్ల్ మార్క్స్ అని అతని అక్కసు. తన ప్రత్యర్థుల్ని 'సాంస్కృతిక మార్క్సిస్టులు' అని తిట్టేవాడు. ఇదో విచిత్ర పదబంధం. మార్క్సిజం ఆర్థిక మూలాలను మాత్రమే పట్టించుకుంటుంది గానీ సాంస్కృతిక అంశాలను పట్టించుకోదని మన దేశంలో నయా అంబేడ్కరిస్టులు కొందరు విమర్శిస్తుంటారు. కిర్క్ మార్క్సిజాన్ని ఒక పెద్ద ఉపద్రవంగా పరిగణించేవాడు. ఒకసారి మార్క్సిజం వలలో పడితే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ రాజీపడాల్సి వస్తుందని అతను భావించేవాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా బలపడాలంటే ఫాసిజం, నాజీజం వంటి సిద్ధాంతాలను పునరుద్ధరించాల్సిందే అని నమ్మేవాడు. 'సాంస్కృతిక బోల్షివిక్కు' అనే మాటను హిట్లర్ కాలపు జర్మనీలో ఒక తిట్టుగా వాడేవారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ అనుయాయులు తమ ప్రత్యర్థుల మీద ఇదే మాటను ప్రయోగిస్తున్నారు.

ట్రంప్ బలహీనపడుతున్న దశలో చార్లీ కిర్క్ చెలరేగిపోతుండడం చాలా మందికి చికాకు తెప్పించింది. ఆ మేరకు అమెరికా యువతరంలో అతని మీద ఏవగింపు కూడా పెరుగుతూ వచ్చింది. రాబిన్‌సన్ చాలాకాలంగా కిర్క్ కదలికల్ని గమనిస్తున్నట్టు విచారణలో తేలింది. కిర్క్ సనాతన భావాల్ని అతను అసహ్యించు కునేవాడట. అతన్ని 'ఫాసిస్టు' అనేవాడట. ట్రంప్ కన్నా ముందు వీడి ఆట కట్టించాలి అనే భావంతో ఉండేవాడట. కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'రేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని రాసి ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. అంటే చార్లీ కిర్క్‌ను రాబిన్‌సన్ ఎంతగా అధ్యయనం చేశాడో అతని మీద ఎంతగా కసితో రగిలిపోయాడో అర్థం అవుతోంది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఇటలీలో ఫాసిజాన్నీ, జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద కూడా సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.

> **కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'రేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. ఇటలీలో ఫాసిజాన్నీ జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.**



▪ డానీ (సమాజ విశ్లేషకులు)

పుస్తెల తాడు కోసం వచ్చి..

- వృద్ధురాలిని పొట్టన పెట్టుకున్న దుండగులు
- శవాన్ని బావిలో పడేసి వెళ్లిన వైనం
- నెల్లికుదురులో దారుణ ఘటన


వీరగాని రాధమ్మ (ఫైల్)

నెల్లికుదురు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి నుంచి బంగారు ఆభరణాలు దోచుకోవడానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు.. తమ ప్రయత్నాన్ని ఆమె అడ్డుకోవడంతో హతమార్చి బావిలో పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి... నెల్లికుదురుకు చెందిన వీరగానికి రాధమ్మ (80) ఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఆమె భర్త హుస్సేన్ పదేళ్ల క్రితం మృతి చెందగా, వారి ముగ్గురు కుమారులు ఉండగా వివిధ ప్రాంతాల్లో బతుకుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి, రాధమ్మపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడు చోరీ చేయడానికి ప్రయత్నించారు. అయితే ఆమె వారి ప్రయత్నాన్ని అడ్డుకొని, పుస్తెలతాడు వారికి చిక్కకుండా గట్టిగా పట్టుకుంది. దీంతో సదరు వ్యక్తులు ఆమెను బలంగా కొట్టి, బలవంతంగా బావిలోకి తోసి పరారయ్యారు. వృద్ధురాలి ఇల్లు గల్లీలో చివరన ఉండటం, ఘటన అర్ధరాత్రి జరగడంతో ఎవరికీ తెలియలేదు. శనివారం ఉదయం ఇంటి సమీపంలోని వారికి రక్తపు మరకలు కనిపించడంతో వారు వచ్చి బావిలో చూడగా రాధమ్మశవం కనిపించింది. ఎస్సై రమేష్ బాబు పోలీస్ సిబ్బందితో వచ్చి రాధమ్మ మృతదేహాన్ని బయటకు తీశారు. పుస్తెల తాడును చేతిలో పట్టుకొన్న స్థితిలో రాధమ్మ శవం కనిపించడంతో స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. రాధమ్మ గురించి తెలిసిన వారే ఆమెను పొట్టనపెట్టుకున్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతురాలు కుమారుడు వీరగాని మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



ధాన్యం కొనుగోళ్లకు రైట్ రైట్

- 157 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 2 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- గత ఖరీఫ్‌లో 96.619 మెట్రిక్ టన్నులు సేకరణ
- కొనుగోళ్లపై 16న కార్యప్రణాళిక ఖరారు
- మార్గదర్శకాలను జారీ చేసిన సర్కారు

వచ్చే నెల మొదటి వారం నుంచి షురూ

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేసేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ సమాయత్తం అవుతోంది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) మార్గదర్శకాల ప్రకారం ఖరీఫ్ ధాన్యం సేకరణ అక్టోబరు 1న మొదలు కావాలి. ఈ మేరకు ఎఫ్‌సీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో అదే తేదీ నుంచి, వీలైతే కాస్త ముందుగానే.. అంటే ఈనెల 25న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేందుకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (టీజీసీఎస్) ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో కూడా జిల్లా పౌరసరాలశాఖ అధికారులు ఏర్పాట్లకు నడుం బిగించారు. వాస్తవానికి హనుమకొండ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు మిగతా జిల్లాల కన్నా ఆలస్యంగా ప్రారంభమవుతాయి.

సాధారణంగా అక్టోబర్ మొదటి లేదా రెండవ వారంలో కొనుగోళ్లు మొదలవుతాయి. మిగతా జిల్లాలో కన్నా ఈ జిల్లాలో రైతులు వరినాట్లను కాస్త ఆలస్యంగా వేస్తారు. జిల్లాలోని 12గ్రామీణ మండలాల్లో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో కాస్త ముందుగానే వరి సాగు ప్రారంభమవుతుంది. మిగతా తొమ్మిది మండలాల్లో ఆలస్యంగా పంట చేతికి రావడం వల్ల కొనుగోళ్లు కూడా ఒక నెల ఆలస్యంగా మొదలవుతాయి. త్వరగా పంట చేతికి వచ్చే మండలాల్లో సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలను తెరవాలనే ఆలోచనలో పౌరసరఫరాల అధికారులు ఉన్నారు. వడ్లు మార్కెట్‌లోకి ఎప్పుడు వచ్చినా వెంటనే కొనుగోలు చేసేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోనున్నట్టు చెబుతున్నారు. ఈనెల 16వ తేదీన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రణాళికపై చర్చించటానికి కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారులు ఇతర అధికారులతో చర్చించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

2 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఈ సారి ఖరీఫ్‌లో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా ఆమేరకు కొనుగోళ్లు చేయడానికి సిద్ధమవుతున్నారు అయితే వాస్తవ అంచనాల ప్రకారం లక్షా 50వేల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు కేంద్రాలకు రావచ్చునని అధికారులు భావిస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 157 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఐకేపీ కేంద్రాలు 48 కాగా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) 109.అయితే (మిగతా 6వ పేజీలో)


కాశిబుగ్గలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ

ఏదో అదృష్టం కొద్దీ ఎమ్మెల్యే అయ్యాడు..

- నాపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా..
- అధిష్ఠానం పేర్కొన్న వారినే ధర్మకర్తలుగా నియమించా..
- ఎమ్మెల్యే నాయినిపై మంత్రి కొండా సురేఖ ఫైర్

వరంగల్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి హోదాలో ఒక దేవాలయంలో ఇద్దరు ధర్మకర్తలను నియమించే స్వేచ్ఛ, అధికారం తనకు లేదని చెప్పడం బాధాకరమని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం ఆమె వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎవరి లిమిట్స్‌లో వారుండాలని, భద్రకాళి ఆలయ ధర్మకర్తల నియామకంపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వాఖ్యలపై మంత్రి స్పందించారు. భద్రకాళి దేవాలయంలో ఇద్దరు ధర్మకర్తల నియామకాలు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉండడంతో, ఎవరినో ఒకరిని వేశామని అన్నారు. వాళ్లు తనవాళ్లు కాదని, పై నుంచి ఒకరిద్దరు అడిగిన వాళ్లనే నియమించామని, తన వెంట తిరిగేవాళ్లను వేయలేదని అన్నారు. "నాయిని రాజేందర్‌రెడ్డి నాకంటే చిన్నోడు.. నాకంటే ముందు నుంచే ఎమ్మెల్యే కావాలనుకున్నాడు.. కానీ పాపం నా తరువాత అయ్యిండు. అది కూడా ఏదో అదృష్టం కొద్ది అయ్యాడు. నేను ఆయనను ఏమీ అనదలుచుకోలేదు. ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా" అన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే పెద్దపీట

ప్రజల అభివృద్ధి, సంక్షేమానికే తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కొండాసురేఖ అన్నారు. శనివారం ఆమె19వ డివిజన్‌లో రూ.1.43 కోట్లతో చేపట్టిన అర్బన్ ప్రైమరీహెల్త్ సెంటర్, (మిగతా 6వ పేజీలో)

అధికార పార్టీలో మళ్లీ లొల్లి



- భద్రకాళి ఆలయ ధర్మకర్తలుగా మూగ శ్రీనివాస్, ఎస్.శ్రీధర్‌రావు నియామకంపై వివాదం
- మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పరస్పర విమర్శలు
- వారిద్దరూ 'తమ మనుషులు' కాదని ఎవరికి వారు వెల్లడి
- నేడు ఆలయంలో ప్రమాణ స్వీకారం

7

పెండింగ్ కేసులకు అందరూ బాధ్యులే..

- హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్
- జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 24,510 కేసుల పరిష్కారం
- ముగ్గురికి పరిహారం అందజేసిన న్యాయమూర్తి


జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

వరంగల్ లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులు పెరగడానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులతో సహా అందరూ బాధ్యులేనని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం హనుమకొండలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశం హాలులో హనుమకొండ వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. వివిధ కోర్టుల్లో కొంతకాలంగా కేసుల పరిష్కారంలో ప్రత్యేకమైన చొరవ చూపి వివిధ రకాల మార్గాల ద్వారా ప్రయత్నం చేస్తున్నప్పటికీ అనుకున్న మేరకు పరిష్కరించలేకపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షిదారులు సమాన బాధ్యత తీసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. న్యాయమూర్తులు పాత సివిల్‌కేసులపై దృష్టి సారించి మధ్యవర్తిత్వం వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో పరిష్కారమైన మూడు ప్రమాద బీమా కేసులకు సంబంధించి బాధితులకు చెక్కుల ద్వారా నష్ట పరిహారాన్ని స్వయంగా అందజేశారు. అంతకు ముందు వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనం ముందు మధ్యవర్తిత్వం ద్వారా జరిగే లాభాలకు సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి బీవీ నిర్మల గీతాంబ, హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కె.పట్టాభి రామారావు, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసో సియేషన్ల అధ్యక్షులు వలున సుధీర్, పులి సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు సాయి కుమార్, క్షమాదేశ్ పాండే, హనుమ కొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్, అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు, వివిధ బ్యాంక్ ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

24,510 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా 24,510 కేసులను పరిష్కరించినట్లు వరంగల్, హనుమ కొండ జిల్లాల ప్రధాన సెషన్స్ జడ్జిలు కం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు బీవీ నిర్మల గీతాంబ, కె.పట్టాభి రామారావు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం శనివారం లోక్ అదాలత్ నిర్వహించి పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించినట్లు వారు తెలిపారు. ఈ మేరకు కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయవాదులకు, కక్షిదారులకు, పోలీసులకు, వివిధ సంస్థల అధికారులకు అభినందనలు తెలిపారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 10బెంచ్‌లను ఏర్పాటుచేసి 5,938 పెండింగ్ కేసులను పరిష్కరించినట్లు వారు తెలిపారు. వీటిలో 26 సివిల్‌కేసులు, 24మోటారు ప్రమాద బీమా కేసులు, 5,912 క్రిమినల్ కేసులు, వివిధ బ్యాంకుల ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించామని, వాటి ద్వారా రూ.2,28,82,709 బ్యాంకులకు రుణాల చెల్లింపులు జరిగాయని (మిగతా 6వ పేజీలో)

రూ. 200 కోట్లకు అమ్ముడుపోయావ్..

- నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్..
- నా నోటి కాడి బుక్కను, ఇందిర కంచాన్ని లాక్కున్నావు..
- ఎమ్మెల్యే కడియంపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ ఫైర్



జనగామ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'కడియం శ్రీహరీ.. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన నువ్వు నిజాయితీ ఉంటే రాజీనామా చేయి.. బీఆర్‌ఎస్‌లో ఉండగా ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని చెప్పావు.. కాంగ్రెస్‌తో బేరం కుదుర్చుకొని రూ.200 కోట్లకు అమ్ముడుపోయి ప్రభుత్వం కూలకుండా రేవంత్‌రెడ్డికి మద్దతు ఇచ్చావు' అంటూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తీవ్ర పదజాలంతో విమర్శించారు. జనగామ జిల్లాకేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడియంపై ధ్వజమెత్తారు. కడియం రాజకీయం జీవితం మొత్తం అబద్ధాల పుట్ట అని, వ్యక్తిగత లబ్ధి, ఆర్థిక లాభాలు, బిడ్డ భవిష్యత్తు కోసమే కాంగ్రెస్‌లో చేరాడంటూ ధ్వజమెత్తారు. తాము బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామని, అభివృద్ధి కోసమే రేవంత్‌రెడ్డిని కలిశామని ఎనిమిది మంది ఎమ్మెల్యేలు స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారని, కానీ కడియం ఎందుకు వివరణ లేదని ప్రశ్నించారు. శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పడం లేదన్నారు. టాల్ మ్యాన్ అని చెప్పుకునే శ్రీహరికి పౌరుషం ఎటు పోయిందని ఎద్దేవా చేశారు. ఒకవేళ బీఆర్‌ఎస్‌లోనే ఉంటే ముక్కు నేలకు రాసి తెలంగాణ భవన్‌కు రావాలని, కేసీఆర్‌ను కలిసి, యూరియా కొరతపై మాట్లాడాలని సూచించారు. తన నోటి కాడి బుక్కను, సింగపురం ఇందిర కంచాన్ని లాక్కున్న శ్రీహరికి పుట్టగతులు ఉండవని శాపనార్థాలు పెట్టారు. 65ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్‌ను అప్పనంగా వాడుకుంటున్నాడని, రాజ్యాంగం మీద, ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం అవినీతి తిమింగలం అని కొండా మురళి ఊరికే అనలేదని రాజయ్య గుర్తుచేశారు. కడియం ఆస్తులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కాంగ్రెస్‌కు అప్రూవర్‌గా మారిన శ్రీహరిని స్పీకర్ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ చర్య తీసుకోని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.


తాటికొండ ఖిలాగుట్ట

కోటపై పట్టింపేది?

- తాటికొండ పాపన్న కోటలో అద్భుత కట్టడాలు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో నిర్లక్ష్యం
- కాలగర్భంలో కలుస్తున్న నిర్మాణాలు
- శిథిలమవుతున్నా చలించని సర్కారు
- ప్రభుత్వం స్పందించాలని పర్యాటకుల డిమాండ్

7

నగరంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- జేఎన్‌ఎస్‌లో వచ్చే నెల 16 నుంచి 18 వరకు నిర్వహణ
- సమష్టి కృషితో విజయవంతం చేయాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- అండర్-23 జాతీయ, అంతర్జాతీయ అథ్లెట్ల రాక


జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 16నుంచి 18వరకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీల నిర్వహణపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడారు.

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులతో ఈ నెల 15, 16 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి ని కలిసి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ గురించి వివరిస్తామన్నారు. పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులకు పాల్గొననున్న నేపథ్యంలో వారికి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అదే విధంగా జేఎన్ స్టేడియంతో పాటు సింథటిక్‌ట్రాక్ ను జిల్లా స్పోర్ట్స్ ఉన్నాతాధికారులతో కలిసి త్వరలోనే పర్యవేక్షించి సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతమన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దేశంలోని 28రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 100మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, 700మంది అథ్లెట్లు, 200 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, అసోసియేషన్ బాధ్యులు పాల్గొనడం జరుగుతుందన్నారు. జంప్స్, త్రోస్, రన్నింగ్‌లో నిర్వహించే పోటీల్లో టీఎస్ఆర్ ఫోటో ఫినిషింగ్ సిస్టం, దేశ వ్యాప్తంగా క్రీడాభిమానులు వివిధ మాధ్యమాల్లో వీక్షించే వీలుగా లైవ్ స్ట్రీమింగ్‌తో పాటు క్రీడాకారులకు డోపింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కొదిరిపాక సారంగపాణి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, అజీజ్‌ఖాన్, డీవైఎస్‌వో అశోక్‌కుమార్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, మామిండ్ల రాజు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, విష్ణు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగిన రైతు

● యూరియా దొరకక పంట ఎండుతుండటమే కారణం
● మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో ఘటన


పురుగుల మందుతాగిన మల్లెల నర్సయ్యను ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా దొరకడం లేదని, పంట ఎండుతోందనే మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన మల్లెల నర్సయ్యకు 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి పంట సాగు చేశాడు. శనివారం తన పంటను చూసుకునేందుకు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. వరి సరిగ్గా ఎదగకపోవడం, మరోవైపు ఎర్ర బారుతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. సరైన సమయంలో పంటకు యూరియా వేయకపోవడంతోనే తన పొలం ఎర్రబారిపోయిందని మనోవేదనకు గురయ్యాడు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో చుట్టు పక్కల పొలంలో ఉన్న రైతులు గమనించి నర్సయ్య కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం కొత్తగూడ పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్సనందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కాగా, నర్సయ్య భార్య నర్సమ్మ రెండేళ్ల క్రితం మరణించగా, వారికి ఇద్దరు కూతురులు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భారీగా పొగాకు ఉత్పత్తుల పట్టివేత

రూ.10లక్షల విలువ చేసే గుట్కాలు సీజ్


స్వాధీనం చేసుకున్న గుట్కాలతో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, సిబ్బంది

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. హనుమకొండ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కమలాపూర్ మండలం ఉప్పల్‌కు చెందిన అకినపల్లి వంశీధర్ గుట్కాలను డంప్‌చేశాడని పక్కా సమాచారం మేరకు సోదాలు చేసి రూ.10,03,760 గుట్కాలు సీజ్ చేసి వంశీధర్‌ను అరెస్టు చేయగా, గుట్కాలు సప్లయ్ చేసే మరో ఇద్దరు వ్యక్తులు వరంగల్ మట్టెవాడకు చెందిన కొలారియ ధీరజ్, కరీంనగర్‌కు చెందిన గాజుల అనిల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సోదాలు సీఐ కె.శ్రీధర్, ఎస్సై వీరస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట వీడిన కేయూ లా విద్యార్థులు

రిజిస్ట్రార్ రామచంద్రం హామీతో విరమణ



రిజిస్ట్రార్ రామచంద్రంకు వినతి పత్రాన్ని ఇస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ లా విద్యార్థులు పోరుబాట వీడారు. సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం ఉదయం నుంచి చేస్తున్న నిరవధిక నిరసనలను ఆదివారం సాయంత్రం విరమించారు. రెండో రోజు కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి నిరసనకు దిగిన విద్యార్థుల వద్దకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వచ్చి స్టూడెంట్స్ సమస్యలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను విన్నవించారు.

ఐదేళ్ల లా ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయాలని, కేయూ క్యాంపస్ నుంచి యూనివర్సిటీ న్యాయ కళాశాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న బార్ కౌన్సిల్ ఫీజులను విరమించుకోవాలని, గర్ల్స్ విద్యార్థులకు మొదటి ఏడాదిలోనే హాస్టల్ వసతి కల్పించాలని, పరీక్షలకు సెల్ఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని, నూతన లా కాలేజీ భవనం, రెగ్యులర్ ఫ్యాకల్టీ నియమించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం స్పందిస్తూ.. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారని, ఆయన రాగానే లా స్టూడెంట్స్ సమస్యలను దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పోరుబాటను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు లా స్టూడెంట్స్ ప్రకటించారు. అంతకు ముందు రిజిస్ట్రార్‌తో కేయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, లా హాస్టల్ జేడీ డాక్టర్ చల్లా శ్రీనివాస్‌లతో విద్యార్థులు దశలవారిగా చర్చలు జరిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మావోయిస్టు నేత బాలకృష్ణ అంత్యక్రియలు

హైదరాబాద్‌లో నిర్వహణ


బాలకృష్ణ (ఫైల్)

కాజీపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు అగ్రనేత మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ అంత్యక్రియలు ఆదివారం హైదరాబాద్‌లో జరుగనున్నట్లు అమరుల బంధుమిత్రుల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. అంతిమ యాత్ర ఆదివారం ఉదయం 11 గంటలకు సుల్తాన్‌పుర రోడ్ నంబర్-1 చాదర్‌ఘాట్ నుంచి మొదలై అంబర్‌పేట శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగుతుంది. అనంతరం అంబర్‌పేట శ్మశానవాటికలో దహన సంస్కారాలు జరుగుతాయని తెలిపారు. మిత్రులు, బంధుమిత్రులు, ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు అందరు పాల్గొని ఘనంగా జోహార్లు అర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిద్దాం.. జోహార్ గరియా బంద్ అమరవీరులకు అనే నినాదాన్ని వినిపించేందుకు అమరవీరుల బంధుమిత్రుల సంఘం పెద్దఎత్తున తరలివెళ్లనున్నట్లు సమాచారం. బాలకృష్ణ దహన సంస్కారాలకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి మావోయిస్టు సానుభూతిపరులు, కళాకారులు పెద్దఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లనున్నట్లు తెలిసింది.


కేరళ సదస్సులో దేశ విదేశాల ప్రతినిధులతో మేయర్ సుధారాణి

వరంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం వల్ల నగరం అభివృద్ధి చెందుతోందని మేయర్ గుండు సుధారాణి అన్నారు. రెండు రోజులు (గురు, శుక్ర) కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరిగిన కేరళ అర్బన్ కాన్‌క్లేవ్-2025లో మేయర్ హాజరై మాట్లాడారు. వరంగల్ నగరంలో అమలవుతున్న పథకాలపై ప్రసంగించారు. వరంగల్ నగరంలో మాస్టర్ ప్లాన్ అమలవుతోందని, అందులో భాగంగా యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) నిర్మాణం కోసం ఇప్పటికే రూ.4,170కోట్ల నిధులు కేటాయించామన్నారు. నగరంలో విమానాశ్రయం ఏర్పాటుకు వేగవంతంగా అడుగులు ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ రెండు రోజుల సదస్సులో దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

ఏదో అదృష్టం కొద్దీ ఎమ్మెల్యే అయ్యాడు

(5వ పేజీ తరువాయి)

రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఓ-సిటీలో మెగా గ్యాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ కనెక్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అనేక అభివృద్ధి పనులు చేశామని, సంక్షేమ పథకాలను అమలు చేశామని అన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగులకు అరువై వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, వరంగల్ ఏసీపీ శుభం ప్రకాష్, స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, నాయకులు నల్గొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, దాసరి రాజేష్, గనిపాక సుధాకర్, మాదినేని మల్లేశం, కూచన రవిందర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉనికి కోసమే ప్రతిపక్షాల విమర్శలు

ప్రతిపక్షాలు తమ ఉనికి కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని మంత్రి సురేఖ అన్నారు. శనివారం ఆమె హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాగితాలపై అభివృద్ధి చూపించిందని, తమ ప్రభుత్వం చేసి చూపిస్తోందని అన్నారు. అది చూసి తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు తమ ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని, వారిని ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినపుడు బుద్ధి చెబుతారని అన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో వైద్యుడిని సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, ఎలక్ట్ ప్రెసిడెంట్ వంగ రాజిరెడ్డి తెలిపారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో క్యాన్సర్, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్యాన్సర్ వస్తే గతంలో చికిత్సలేదని, ఇప్పుడు అధునాతనమైన పరిజ్ఞానంతో, పరికరాలతో క్యాన్సర్ వ్యాధిని నయం చేసేందుకు అన్ని సదుపాయాలు ఉన్నట్లు డాక్టర్ బెజగం మహేష్ పేర్కొన్నారు. ముందస్తుగా అవగాహన కలిగి క్యాన్సర్ స్క్రీనింగ్‌టెస్టులు చేయించుకుంటే వ్యాధిని తగ్గించుకోవచ్చని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేముల ప్రసాద్, డాక్టర్ గోపీనాథ్, రోటరీ క్లబ్ కార్యదర్శి గంగోజుల నరేష్, కోశాధికారి మిర్యాల రాజ్‌కుమార్, దారం శ్రీనివాస్, పాశం సంజీవరెడ్డి, రొండ్ల నరేందర్‌రెడ్డి, అంచూరు విజయ్‌కుమార్, బొల్లం మోహన్, అనిల్‌కుమార్, ముంద వేణు, రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.70 వేల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలు అపహరణ


బుధరావుపేటలో చోరీ జరిగిన ఇంట్లో వివరాలను సేకరిస్తున్న సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి

ఖానాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగి రూ.70వేల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన బుధరావుపేటలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధరావుపేట గ్రామానికి చెందిన సుధగాని సాంబయ్య ఈ నెల 7న తన కుమారుడు రాజేష్ అనారోగ్యానికి గురవడంతో ఇంటికి తాళం వేసి హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం ఈ నెల 12న అర్ధరాత్రి తిరిగి ఇంటికి చేరుకోగా ఇంటికి వేసిన తాళం తొలగించి ఉంది. ఇంట్లోకి వెళ్లిచూడగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న 4 గ్రాముల బంగారు రింగు, తులం వెండి రింగు, 14 తులాల 3 బ్రాస్‌లెట్స్, 10 తులాల పట్టీలతో పాటు మరో రూ.10వేల నగదును అపహరిం చుకుపోయారు. దీంతో చోరి జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం సంఘటనా స్థలానికి దుగ్గొండి సీఐ సాయిరమణ, స్థానిక ఎస్సై రఘుపతిలు చేరుకుని వివరాలు సేకరించారు. సమీపంలో జీపీ కార్యాల యంలో సీసీ పుటేజీలను పరిశీలించారు. క్లూస్ టీం సైతం చేరుకుని వేలిముద్రలను గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ట్లు ఎస్సై తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

దామెర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందు నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఇదే నెల(13-09-2023)లోనే హనుమకొండ ఏకశిల పార్క్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు రిలే దీక్షలు చేపట్టగా అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగుల గురించి మాట్లాడినట్లు గుర్తుచేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్య చాలా చిన్నదని, తమ ప్రభుత్వం రాగానే నెల రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి.. అక్కడే ఉన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు రూ.20లక్షలు చెల్లించాలని, అలాగే ఆరోగ్య బీమా రూ.10లక్షలు అందించాలని కోరారు.

కోతకు గురవుతున్న కాకతీయ కెనాల్ గట్లు

● పట్టించుకోని అధికారులు


కోతకు గురైన కెనాల్ గట్టు

గీసుగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) కాకతీయ కెనాల్ గట్లు పలు చోట్ల కోతకు గురయ్యాయి. దీంతో కాలువ పక్క గట్టు రహదారిపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. చేలల్లో పడిన వర్షం వరదంతా కాలువలోకి రావడంతో ప్రమాదకరంగా కోతకు గురైంది. కైటెక్స్ సమీపంలోని కోట వెంకటాపూర్‌కు వెళ్లే మార్గం వద్ద, డీబీఎం 40 గేట్ల సమీపంలో వరద కోతకు పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. దీంతో కెనాల్ గట్టు రహదారి కుంచించుకుపోయింది. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ కేసులకు అందరూ బాధ్యులే..

(5వ పేజీ తరువాయి)

న్యాయమూర్తులు పేర్కొన్నారు. చలాన్ల ద్వారా 76,7 20 కేసులు కూడా పరిష్కరించినట్లు వీటిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు ఉన్నాయని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

అదే విధంగా హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 8 బెంచ్‌లు ఏర్పాటు చేసి మొత్తం 18,581 కేసులు పరిష్కరించారు. మోటారు ప్రమాద బీమా కేసులు 62 పరిష్కరించి రూ.7,31,55,963 బాధితులకు నష్టపరిహారం ఇప్పించారు. సివిల్ కేసులు 5, ఈపీ కేసులు 2, ఎస్టీసీలు 17,911, క్రిమినల్ కేసులు 482, చెల్లని చెక్కు కేసులు 6, ఎక్సైజ్ కేసులు 16, పీఎల్‌సీ కేసులు 94, మెయింటనెన్స్ కేసులు 2, గృహహింస చట్టం కేసులు 2, మొత్తంగా 18,581 కేసులు పరిష్కరించినట్లు హనుమకొండ జిల్లా జడ్జి కె.పట్టాభి రామారావు తెలిపారు. అదే విధంగా ఈ చాలాన్‌ల ద్వారా 38,285 ట్రాఫిక్ కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా వినూత్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, న్యాయవాది డేవిడ్‌రాజ్‌కుమార్ 300 పులిహోర ప్యాకెట్లు కక్షిదారులకు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లకు రైట్ రైట్

(5వ పేజీ తరువాయి)

గత ఖరీఫ్‌లో మార్కెట్‌లోకి ధాన్యం రాకను బట్టి 146 కేంద్రాలనే తెరిచారు. వీటి ద్వారానే కొనుగోళ్లు జరిగాయి. ఈ సారి ఖరీఫ్‌లో కూడా దాదాపు ఇన్నే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అయితే ధాన్యం రాకను బట్టి అదనంగా మరిన్ని తెరిచే అవకాశం ఉంది. ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఈ సమీప గ్రామాలను అనుసంధానం చేస్తారు.

కేంద్రాల వద్ద ఏర్పాట్లు

కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందే చేస్తున్నారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు 1,580 టార్పాలిన్లు, ధాన్యం శుద్ధికి 158 క్లీనర్లు, తేమను కొలిచేందుకు 170 మాయిశ్చర్ మీటర్లు, ధాన్యం తూకానికి 158 యంత్రాలను అందుబాటులో ఉంచనున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లోకి ఎత్తేందుకు చాలినన్ని గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచుతున్నారు. గత యాసంగి సీజన్‌లో 21,47,498 గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచగా ఖరీఫ్ అధికంగా వచ్చే ధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంతకన్నా ఎక్కువ గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

రవాణా ఏర్పాట్లు

కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు జిల్లా పరిధిలోని 12 గ్రామీణ మండలాలను 5 సెక్టార్లుగా విభజించనున్నారు. ఒక్కో సెక్టార్‌కు ఒకరు చొప్పున 5గురు రవాణా ఆపరేటర్లను నియమించనున్నారు. 30,000 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని నిలువ చేసే సామర్థ్యం కలిగిన గోదాములు ఏనుమాముల, కమలాపూర్-1, కమలాపూర్-2, ధర్మసాగర్, మునిపల్లి, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ధాన్యం తరలింపులో జాప్యాన్ని నివారించేందుకు రైస్‌మిల్లులతో కొనుగోలు కేంద్రాలను అనుసంధానించనున్నారు.

గత ఖరీఫ్‌లో..

2024-25 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో మొత్తం 96,619.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో గ్రేడ్-ఏ రకం 25,713.240 మెట్రిక్ టన్నులు కాగా, కామన్ రకం 6,980.280 మెట్రిక్ టన్నులు కాగా, ఫైన్ రకం 63925.640 మెట్రిక్ టన్నులు. 22780 మంది రైతుల నుంచి సేకరించిన ఈ ధాన్యానికి రూ. 224.01 కోట్లను చెల్లించారు. గత ఖరీఫ్ సీజన్‌లో 15135 మంది రైతులకు సంబంధించి కొనుగోలు చేసిన 63925.640 మెట్రిక్ టన్నుల సన్నరకాలకు రూ.31,96,28,200 బోనస్ చెల్లించారు. గత యాసంగికి సంబంధించి బోనస్ ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించలేదు. హనుమకొండ జిల్లాకు సంబంధించి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు రూ.7కోట్లు ఇప్పటి వరకు రైతులకు అందలేదు. ఈ క్రమంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి బోనస్‌పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడాల్సి ఉంది.

60 శాతం సన్నరకాలే..

2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ప్రకటించింది. ఈ మేరకు సాధారణ రకానికి క్వింటాకు రూ.2,369 చొప్పున గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,389 చొప్పున చెల్లిస్తారు. సన్నరకాలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. యాసంగితో పోల్చితే ఖరీఫ్‌లో సన్నాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఖరీఫ్‌లో సాగైన వరిలో 60 శాతంపైగా సన్న రకాలే.

కోటపై పట్టింపేది ?



తాటికొండ ఖిలాగుట్టలోని బురుజు

- తాటికొండ పాపన్న కోటలో అద్భుత కట్టడాలు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో నిర్లక్ష్యం
- కాలగర్భంలో కలుస్తున్న కట్టడాలు
- శిథిలమవుతున్నా చలించని సర్కారు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బహుజనుల నాయకుడు, పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న నిర్మించిన కోట రోజు రోజుకూ శిథిలమవుతోంది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో గుట్ట పైన గుట్ట దిగువన పాపన్న నిర్మించిన కోట గోడలు, గడీ కాలక్రమేణ శిథిలావస్థకు చేరుతున్నాయి. శిథిలమవుతున్న కట్టడాలను పునరుద్ధరిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్లుతుందని ప్రజలు కోరుతున్నారు. పాపన్నకోటను పర్యాటక కేంద్రంగా మార్చే దిశగా 2019 అక్టోబరులో వరంగల్ నిట్ ప్రొఫెసర్, సివిల్ ఇంజనీర్ కామేశ్వరరావు ఆధ్వర్యంలోని ఇంజనీర్ల బృందం కోటను పూర్తిస్థాయిలో పర్యటించి అభివృద్ధి చేయడానికి నివేదిక రూపొందించి అప్పటి ప్రభుత్వానికి నివేదించారు. తర్వాత అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను గ్రామ నాయకులు కలిసి కోటను అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందించారు. మంత్రి ఆదేశాల మేరకు పురావస్తు శాఖ అధికారులు 2021 జూలై 9న కోటను సందర్శించి కోట అభివృద్ధికి చేయాల్సిన పనులకు ఎస్టిమేషన్‌లు తయారు చేసుకొని వెళ్లారు. పురావస్తుశాఖ అధికారులు వచ్చి వెళ్లి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా కోటను పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చారిత్రక కట్టడాలను పర్యాటక కేంద్రంగా గుర్తిస్తామని చెప్పి నివేదికలు తయారు చేయించి, చివరకు మొండిచేయి చూపెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన పాపన్న కోటను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

కోటలో అద్భుతమైన కట్టడాలు

16వ శతాబ్దంలో మొగలాయి చక్రవర్తులను గడగడలాడించిన స్వయంపాలన కోసం కుతుబ్‌షాహీలను ఎదిరించి ప్రత్యేక రాజ్యాన్ని స్థాపించి భారతదేశ చరిత్రలోనే తొలి బహుజనుల పాలకుడిగా సర్వాయి పాపన్న నిలిచాడు. సముద్ర మట్టానికి సుమారు మూడు వేల అడుగుల ఎత్తున పాపన్న తన రాజ్యాన్ని నిర్మించడం విశేషంగా చెప్పుకోవచ్చు. గుట్ట పైన అద్భుతమైన కట్టడాలున్నాయి. శత్రు రాజ్యాలపై దాడులు చేసేందుకు సైనిక బలగాలను మోహరించేందుకు అనువైన ప్రాంతాన్ని ఎంచుకోవడంలో భాగంగానే తాటికొండ గ్రామాన్ని ఎంచుకున్నాడని చరిత్రకారులు చెబుతున్నారు. మొగల్ సైన్యాన్ని ఎదుర్కోవడానికి గుట్ట దిగువన 500 ఎకరాల స్థలంలో ఆయుధ కర్మాగారాన్ని ఏర్పర్చి ఇక్కడ లభ్యమయ్యే చిట్టిరాళ్లను కరిగించి ఇనుపగుండ్లను రూపొందించి వాటితో శత్రుమూకల పై దాడులు చేసి ప్రజలకు అండగా పాపన్న నిలిచాడు. గుట్ట పైన నిర్మించిన కోట వద్దకు వెళ్లడానికి రాతి కట్టడాలను ఏర్పాటు చేసి ప్రవేశ ద్వారాలు దాటనిదే ముందుకు వెళ్లకుండా ఉన్న నిర్మాణం తీరు చూడముచ్చటగా ఉంది. గుట్టపైన విభిన్న రకాల ఏడు గుండాలు నేటికి ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. గుట్టపై 100 ఎకరాల విస్తీర్ణంతో చదునైన ప్రదేశం విస్తరించి ఉంది. గుట్ట పైన శివలింగాలు దర్శనమిస్తున్నాయి.

శివాజీకి సమకాలికుడిగా గుర్తింపు ఉన్నా..

ఛత్రపతి శివాజీ సమకాలికుడైన పాపన్నకు శివాజీకి ఇచ్చిన గుర్తింపును నేటికీ దక్కడం లేదని చరిత్రకారులు చెబుతున్నారు. 1874లో ఇంగ్లాండ్ రచయిత జేఏ బోయేల్ ఇండియన్ ఆంటీ క్యూరీ ఇంగ్లిష్ దిన పత్రికలో పాపన్న తాటికొండలో జన్మించినట్లుగా తన వ్యాసంలో ప్రచురించినప్పటికీ ఇక్కడ జన్మించలేదని పాపన్న చరిత్రను వక్రీకరిస్తున్నారని గ్రామానికి చెందిన వారు వివరిస్తున్నారు. రజాకార్ల దోపిడి నుంచి ప్రజలను రక్షించుకోవడానికి ఖిలాషాపూర్‌లో కోటను నిర్మించాడనే నానుడి ఉందన్నారు.



ఖిలాగుట్ట పైన ఉన్న పురాతన నీటి కోనేరు

తాటికొండలో జన్మించిన పాపన్న..

పరిడాల రామారావు 1948లో రాసిన సర్వాయి పాపడు అనే పుస్తకంలో పాపన్న తాటికొండలో జన్మించినట్లు పేర్కొన్నారు. 1972లో జగ్గయ్య, విజయ నిర్మల నటించిన శభాష్ పాపన్న చిత్రంలో బుర్రకథ ప్రదర్శన సన్నివేశంలో పాపన్న పుల్గామ్ అనే గ్రామంలోని తన అమ్మమ్మ ఇంట్లో జన్మించి, స్వగ్రామమైన తాటికొండలో పెరిగినట్టు వివరించారు. ఎస్ఎం ప్రాన్‌రావు రాసిన ప్రజాజ్యోతి పాపన్న (సర్వాయి పాపన్న చారిత్రక ఆధారిత నవల) పుస్తకంలో తాటికొండను కేంద్రంగా చేసుకొని స్వగ్రామంలో రాజ్య విస్తరణను పాపన్న చేసినట్లు రాసి ఉంది. ఇప్పటికి తాటికొండలోని ఖిలాగుట్ట పైన, దిగువన పాపన్న రాజ్యా విస్తరణకు సంబంధించిన అనేక ఆధారాలు నేటికి కనిపిస్తున్నాయి.

కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ



చరిత్రకు నిలువుటద్దంగా నిలుస్తున్న తాటికొండ కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరుతాం. వీర యోధుడు పాపన్న కీర్తిని నలు దిశలా చాటేలా తగు చర్యలు తీసుకుంటాం. కోట దిగువన గల 5ఎకరాల స్థలంలో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేసి సర్దార్ పాపన్న పార్కుగా నామకరణం చేశాం.

సర్దార్ పాపన్న చరిత్రను వక్రీకరించడం సరికాదు..

ఉబ్బని భిక్షపతి, రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సర్వాయి పాపన్న తాటికొండ వాస్తవ్యుడైనప్పటికి, ఆయన చరిత్రను కొందరు వక్రీకరిస్తూ తప్పుడు సమాచారం రాస్తున్నారు. నిజానికి పాపన్న జన్మస్థలం తాటికొండ గ్రామమే. కోటకు మరమ్మతులు చేసి భవిష్యత్తు తరాలకు తెలిసేలా పర్యాటకశాఖ కృషి చేయాలి. ఎంతో ఘన చరిత్ర కలిగిన పాపన్నకు సరైన గుర్తింపును తీసుకురావాలి.



ఉమ్మడి వరంగల్ జట్లను అభినందిస్తున్న జంగా రాఘవరెడ్డి, అరూరి రమేశ్

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి
- ప్రతిభతో ఉన్నత స్థితికి ఎదగాలి : మాజీ ఎమ్మెల్యే అరూరి
- కూనూరులో రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం

జఫర్‌గఢ్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తోందని రాష్ట్ర కో-ఆపరేటివ్, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి 44వ సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరులో ప్రారంభమయ్యాయి. జడ్పీ హైస్కూల్‌లో టోర్నమెంట్ కన్వీనర్ గాదెపాక అయోధ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ క్రీడల అభివృద్ధికి నిధులు వెచ్చించడంతో పాటు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారిని ప్రోత్సహిస్తోందన్నారు. గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని విస్మరించిందన్నారు. శారీరక వ్యాయామం, క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలపై తమ ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు.

కాగా, శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలను జంగా రాఘవరెడ్డి, ఆరూరి రమేశ్‌లు ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయా ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారులను వారు కలిసి అభినందించారు. కాగా, తొలిరోజు పోటీల్లో మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, బాలురు, బాలికల జట్లు విజయం సాధించినట్లు క్రీడా నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో డీఎస్‌డీవో వెంకటరెడ్డి, తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బంగారప్ప, రమణ, సహకార సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోశాధికారి కాటం రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి నీరటి ప్రభాకర్, హెచ్‌ఎంలు పర్వేజ్, సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు కాటం లక్ష్మారెడ్డి, వాసుదేవరావు, ముచ్చ భాస్కర్‌రెడ్డి, నెల్లుట్ల అజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, నరహరి, పీడీ సాయికుమార్, అన్నెబోయిన భిక్షపతి, బి.పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో మళ్లీ లొల్లి

- భద్రకాళి ఆలయ ధర్మకర్తలుగా మూగ శ్రీనివాస్, ఎస్.శ్రీధర్‌రావు నియామకంపై వివాదం
- మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పరస్పర విమర్శలు
- వారిద్దరూ 'తమ మనుషులు' కాదని ఎవరికి వారు వెల్లడి
- నేడు ఆలయంలో ప్రమాణ స్వీకారం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో తాజాగా జరిగిన ఇద్దరు ధర్మకర్తల నియామకం.. అధికార పార్టీలో రాజకీయ పోరుకు తెరలేపింది. ఈ విషయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖ పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్నారు. భద్రకాళి ఆలయానికి ఇప్పటికే 12 మందితో ధర్మకర్తల మండలి ఉండగా, గత బుధవారం (ఈ నెల 10న) మూగ శ్రీనివాస్, ఎస్.శ్రీధర్‌రావు అనే మరో ఇద్దరు వ్యక్తులను ధర్మకర్తలుగా నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ శైలజ రామయ్యార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలో వున్న దేవాలయానికి తనకు తెలియకుండా ధర్మకర్తలను నియమించడం ఏమిటని ప్రశ్నించారు. 'ఇది మంచి పద్ధతి కాదు.. ఎవరి లిమిట్స్‌లో వారు ఉండాలి..' అని వ్యాఖ్యానించారు.

పరోక్షంగా మంత్రి సురేఖను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారం జరగడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ... ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనకు ఇద్దరు ధర్మకర్తలను నియమించుకునే స్వేచ్ఛ లేదా.. అని ప్రశ్నించారు. 'అయినా ధర్మకర్తలుగా నియమితులైన ఆ ఇద్దరు వ్యక్తులు నా మనుషులు కాదు.. అధిష్టానం సూచించిన వారినే ధర్మకర్తలుగా నియమించడం జరిగింది..' అని తెలిపారు. రాజేందర్‌రెడ్డి అదృష్టం కొద్దీ గెలిచాడని ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

అటు ఎమ్మెల్యే, ఇటు మంత్రి.. ఆ ఇద్దరు ధర్మకర్తలు తమ మనుషులు కాదని చెబుతుండటంతో వీరు ఏ 'కోటా'లో నియమితులైనట్టు అని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. మూగ శ్రీనివాస్ గతంలో 'కుడా' చైర్మన్‌గా వ్యవహరించిన మూగా రామ్మోహన్ సోదరుడు కాగా, శ్రీధర్‌రావు కాంగ్రెస్ సీనియర్ నేత కొండపల్లి దయాసాగర్‌రావుకు దగ్గరి బంధువని తెలిసింది.

నేడు ప్రమాణ స్వీకారం

ఇద్దరు ధర్మకర్తల నియామకంపై మాటల మంటలు చెలరేగుతుండగానే.. వారిచే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించాలని దేవాదాయ శాఖ నుంచి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ కావడం విశేషం. ఎమ్మెల్యే, మంత్రి మధ్య వివాదంతో ఇద్దరు ధర్మకర్తల నియామకాన్ని పెండింగ్‌లో పెట్టినట్టు ప్రచారం జరిగింది. కానీ రాత్రి వచ్చిన ఉత్తర్వులతో ఆ ప్రచారానికి తెరపడింది.

భద్రకాళి చెంతన సద్దుల బతుకమ్మ

- మాడ వీధుల మైదానంలో నిర్వహించే యోచన
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా పూల పండుగగా ప్రాచుర్యం పొందిన బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో యేటా తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఆఖరి రోజు పిండి వంటలతో చేసిన సద్దులతో పెద్ద బతుకమ్మలను పేర్చి సద్దుల బతుకమ్మగా పిలుచుకుంటూ చెరువు ప్రాంతాలకు వెళ్లి ఆట పాటలతో కొలుస్తారు. అయితే ఈసారి వేడుకలను భద్రకాళి అమ్మవారి దేవాలయ ప్రాంగణం చుట్టూ నిర్మిస్తున్న మాడవీధుల్లో నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించినట్లు సమాచారం.

ఆలయ ప్రాంగణం చుట్టూ నాలుగు వరుసల్లో మాడవీధులు నిర్మిస్తున్నందున వేలాది మందితో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడానికి ఇదే అనువైన స్థలంగా భావించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులోభాగంగా శనివారం మాడవీధుల ప్రాంగణాన్ని కుడా, మున్సిపల్ అధికారులు, ఇంజనీర్లు పరిశీలించారు. అష్టమి రోజున జగన్మాత జన్మించింది. ఆ రోజునే దుర్గాష్టమిగా పిలుస్తూ జగన్మాతైన భద్రకాళి మాత జన్మదినం కావడంతో అమ్మవారికి సద్దులతో సకల జనులు పూజలు నిర్వహిస్తారు. అమ్మవారిని భద్రకాళి, బతుకమ్మ, భద్రమ్మ ఇత్యాది పేర్లతో పిలుస్తారు. అందుకే భద్రకాళి అమ్మవారు పుట్టిన రోజున సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు.

30న సద్దుల బతుకమ్మ

నవరాత్రుల్లో ఒక్కోసారి పది రోజులు వస్తాయి. ఒక్కోసారి ఎనిమిది రోజులు కూడా వస్తాయి. ఈసారి సద్దుల బతుకమ్మ తిథి రెండు రోజులు వచ్చినందున బతుకమ్మ పండుగను ఈ నెల 30న జరుపుకోవడం శ్రేయస్కరమని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. భద్రకాళి అమ్మవారు జన్మించిన రోజు పుష్పాలపై అమ్మవారిని ఆరాధించే సంస్కృతి ఉందని శృంగేరి పీఠాధిపతులు విద్యారణ్యస్వామి తెలిపారు. ఇదే విషయాన్ని సుప్రసిద్ధ పండితులు బ్రహ్మీ భూత హంసానంద నాథ దీక్ష నామచితులు కూడా స్పష్టం చేశారు.



మాడవీధుల ప్రాంగణం

చట్టాలపై సమగ్ర అవగాహన ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

అవినీతి కేసుల చట్టాల సింపోజియన్‌లో హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

వరంగల్ లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు అన్ని చట్టాలపై సమగ్రమైన అవగాహన ఉండాలని, అప్పుడే కక్షిదారు లకు సరైన న్యాయం అందించగలుగుతామని హనుమకొండ, వరంగల్ జిల్లాల పోర్ట్‌పోలియో జడ్జి హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ము ఖ్యంగా యువ న్యాయవాదులు చట్టాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి కోర్టులో కేసులు వాదించాలని ఆయన సూచించారు. శనివారం తె లంగాణ న్యాయవాద పరిషత్ ఏర్పాటుచేసిన అవినీతి నిరోధక చట్టాలు ప్రాక్టీస్ ప్రొసీజర్ సింపోజియన్‌లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అవినీతి కేసులతో సహా అన్ని కేసుల్లో న్యాయవాదులు మెళకువలు నేర్చు కోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంతానం కమి టీ సిఫారసుల మేరకు 1988లో అవినీతి నిరోధక చట్టం ఏర్పాటైందని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా 62 శాతం అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా అవినీతికి పాల్పడుతున్నట్లు కమిటీ సూచించింది. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాల్లో 93వ స్థానం భారతదేశానిదని, దీని ని బట్టి దేశం అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని హైకోర్టు జడ్జి అన్నారు. అవినీతి నిరోధక చట్టంలో మొత్తం 31 సెక్షన్లు ఉన్నాయని, ప్రతీ సెక్షన్ గురించి న్యాయవాదులకు హైకోర్టు జడ్జి వాటి ప్రాధాన్యతను వివరించారు. అవినీతి నిరోధక కేసులు పరిష్కరించేటప్పుడు న్యాయవా దులు చట్టంలో పొందుపర్చిన సెక్షన్లన్నింటిమీద తర్ఫీదు పొందాలని, దానికోసం నిరంతరం కేరళలోలాగా స్టడీ సర్కిల్ నిర్వహించాలని హైకోర్టు జడ్జి సూచించారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.ప్రభాక ర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సెంసాని సునిల్, హనుమకొండ, వరంగల్ జిల్లాల యూనిట్ అధ్యక్షుడు చొల్లేటి రామకృష్ణ, వల్లెపురెడ్డి మురళీధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కేవీకే గుప్త కోర్టు ఫీజు చట్టంపై రచించిన పుస్తకాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ ఆవిష్కరించారు.

అమ్మవారి సన్నిధిలో..

వరంగల్ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి చేరుకున్న ఆయనకు మంగళవాయిద్యాలతో ఆలయ మర్యాదలతో అర్చకులు, ధర్మకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆయనకు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయమూర్తులు పట్టాభి రామారావు, నిర్మల గీతాంబ, ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీల నుంచి తొలగించాలి



సభలో ఐక్యతను చాటుతున్న నాయకులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం తప్పదని, తమ ప్రాంత నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు తమ సామాజిక వర్గానికి చెందే వరకు పోరాడుతామని తెలంగాణ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేట్ల పాపయ్య దొర అన్నారు. శనివారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ స్వలాభం కోసం అక్రమంగా చేర్చి ఆదివాసీలను అన్యాయం యానికి గురిచేసిందని ఆరోపించారు. 1975 నుంచి 1977 వరకు దేశంలో ఎమర్జెన్సీ ఉన్న కాలంలో దేశ వ్యాప్తంగా చట్టసభలు పనిచేయని కాలంలో లంబాడీలకు చట్టబద్ధత ఏ విధంగా వచ్చిందని ప్రశ్నించారు. స్వాతంత్ర్యానికి పూర్వం 1935లో సైమన్ కమిషన్, 1965లో లోకూర్ కమిటీ ఇచ్చిన నివేదికల ఆధారంగా ఎస్టీలను గుర్తించాలన్నారు. తద్వారా నోటిఫికేషన్ జారీ చేసి రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారంగా అసెంబ్లీలో తీర్మానం చేసి దేశ పార్లమెంట్‌లో తీర్మానం అనంతరం రాష్ట్రపతి ఆమోద ముద్రతో ఎస్టీ తెగలలో గుర్తిస్తారని పాపయ్య దొర పేర్కొన్నారు. ఎటువంటి, ఎలాంటి ఆధారాలు లేకుండా 1976లో కలిపిన లంబాడీలు.. ఆదివాసీల రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కొల్లగొడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సభలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, కోడెం కృష్ణప్రసాద్, చాప బాబుదొర, జేజే రాంబాబు, ప్రొఫెసర్ ఈసం సారయ్య దొర, ధనసరి రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ దబ్బకట్ల సుమన్, ఇరుప సారయ్య దొర, కొమురం ప్రభాకర్, మడే భిక్షపతి, మహిళా జేఏసీ నాయకురాలు చేలా శమంతకమణి, ఈసం స్వరూప, మహాలక్ష్మి, రాధిక, గంగా పాల్గొన్నారు.

రాళ్లను ఎందుకు పూజిస్తారు ?

- వేయిస్తంభాల గుడిలో విశాఖ మహిళల వ్యాఖ్యల కలకలం
- ఘర్షణకు దిగిన భక్తులు
- కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసిన పోలీసులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల ఆలయ సందర్శనకు వచ్చిన విశాఖపట్నంకు చెందిన ఇద్దరు మహిళల తీరు ఉద్రిక్తతకు దారి తీసింది. హిందూ దేవుళ్లను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారంటూ స్థానిక భక్తులు గొడవకు దిగడంతో కలకలం రేగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన ఇద్దరు మహిళలు కరుణాపురం చర్చిలో ప్రార్థనలకు హాజరై శనివారం సాయంత్రం వేయిస్తంభాల ఆలయానికి వచ్చారు. ఈ క్రమంలో వారు ఆలయ ఆవరణలో తిరుగుతూ 'రాళ్లను ఎందుకు పూజిస్తారు? బొట్టు ఎందుకు పెట్టుకుంటారు..?' అంటూ మహిళా భక్తులను ఉద్దేశించి అవహేళనగా మాట్లాడినట్టు చెబుతున్నారు.

దీంతో కోపోద్రిక్తులైన భక్తులు సదరు మహిళలతో ఘర్షణ పడుతుండగా స్థానికుల సమాచారంతో విశ్వ హిందూ పరిషత్ నాయకులు వచ్చారు. వారి రాకతో ఘర్షణ తీవ్రమవుతుండటంతో గుర్తుతెలియని వ్యక్తులు డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

కాగా, ఈ విషయమై హనుమకొండ సీఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. వీహెచ్‌పీ కార్యకర్త సందీప్ ఫిర్యాదు మేరకు మహిళలను విచారించామని, కరుణాపురంలో మూడు రోజులుగా ప్రార్థనలో ఉన్నామని, వైజాగ్ వెళ్లేముందు టూరిస్టు ప్రాంతమైన వేయిస్తంభాల ఆలయాన్ని చూద్దామని వచ్చామని తెలిపారన్నారు.


తమకేమీ తెలియదని, అందరూ గేటులోపలికి చెప్పులతో వెళ్తుంటే తాము కూడా వెళ్లామని, ఎలాంటి మత ప్రచారం చేయలేదని చెప్పారని సీఐ వెల్లడించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి బెంగాల్ కార్మికుడి మృతి

గిర్మాజీపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన లాబాన్ కర్మాకర్ (41) ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి దుర్మరణం చెందాడు. వరంగల్ జీఆర్‌పీ పోలీసులు తెలిపిన ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా చౌదర్ ప్రాంతానికి చెందిన లాబన్ కర్మాకర్ తన బంధువులతో కలిసి వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం విజయవాడలో ఉన్న బంధువుల వద్దకు వెళ్లి శనివారం ఉదయం శాతవాహన రైలులో తిరిగి వస్తుండగా చింతపల్లి -ఎలుగూరు రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు నుంచి జారి పట్టాలపై పడిపోయాడు. ప్రయాణికులు చైన్‌లాగి రైలును నిలిపారు. అతడితో వస్తున్న బంధువులు వెళ్లేసరికే తలకు తీవ్రగాయాలతో లాబాన్ మృతి చెందాడు. వరంగల్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ పి.రాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. పశ్చిమబెంగాల్‌లో ఉన్న అతడి భార్యపిల్లలకు సమాచారం ఇచ్చామని సీఐ పి.సురేందర్ తెలిపారు.



మృతి చెందిన లాబాన్ కర్మాకర్



22 నుంచి వేయి స్తంభాల గుడిలో దుర్గ నవరాత్రులు

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఈసారి దుర్గాదేవి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలోని మారేడు చెట్టు కింద ప్రతిష్ఠిస్తారు. ఇప్పటివరకు ఆలయం లోపల దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తుండడం వల్ల రద్దీ ఏర్పడి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఈ సారి దుర్గాదేవి విగ్రహాన్ని ఆలయ ఆవరణలోని మారేడు చెట్టు కింద ప్రతిష్ఠిస్తారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వైభవోపేతంగా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు కేంద్ర పురావస్తు శాఖ అధికారులు అనుమతిచ్చారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చొరవతో ఇది సాధ్యమైంది.

'బాపూ బాపూ బాపూ' కావ్యావిష్కరణ



కావ్యావిష్కరణలో మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతిని నెలకొల్పడమే ధ్యేయంగా పనిచేసిన మహనీయుడు మహాత్మాగాంధీ అని డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. శనివారం ఎక్సైజ్ కాలనీలో ప్రజాకవి కాళోజీ రచించిన బాపూ.. బాపూ... బాపూ రెండో ముద్రణ ఆవిష్కరణ సభ కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి అధ్యక్షతన జరిగింది. ఇటీవల మరణించిన ప్రముఖ కవయిత్రి అనిశెట్టి రజిత, ప్రముఖ కవి, కథకుడు సంధ్య రంగారావులకు నివాళులర్పించారు. అనంతరం అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా గాంధీ గురించి అద్భుతంగా రాశారని, కానీ కాళోజీ అందుకు భిన్నంగా రాశారన్నారు. గాంధీ గురించి కాళోజీ రాసిన కవిత్వంలో వ్యంగ్యం కనపడుతుందని, ఎందుకంటే గాంధీ గురించి రాసిన వారెవరూ గాంధీ సిద్ధాంతాలను అనుసరించిన వాళ్లు కాదన్నారు. అందుకే బాపూ.. మాకు ఎం మిగిలింది నీ పుట్టిన రోజు, మరణించిన రోజు తప్ప అని కాళోజీ చెప్పడం శాస్త్రీయంగా ఉందన్నారు. ఈ కావ్యం రెండో ముద్రణ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గిరిజా మనోహర్‌బాబు, పొట్లపల్లి శ్రీనివాసరావు, పందిళ్ల అశోక్ కుమార్, చింతకుంట్ల సంపత్‌రెడ్డి, కె.అనంత్‌రెడ్డి, సదా నిరంజన్, వీఆర్ విద్యార్థి, గంటా రామిరెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, బాసిరి సాంబశివరావు, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వరంగల్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరంగల్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు గడిచినా ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పదోన్నతుల్లో జాయిన్ కాకుండా మిగిలిన ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయుల అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలను వేసవి సెలవుల్లో మాత్రమే నిర్వహించాలన్నారు. కామన్ సర్వీస్ రూల్స్ రూపొందించి టీచర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కె.యాకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధానకార్యదర్శి గోవిందరావు, సభ్యులు మహేందర్‌రెడ్డి, రామస్వామి, సూరయ్య, ఆనందచారి, నర్సింహులు, జాన్‌నాయక్, రామ్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

జాంబవ భవన నిర్మాణానికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న దేవేంద్రప్రసాద్

వడ్డెపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాంబవ భవన నిర్మాణానికి శక్తి మేరకు కృషి చేస్తానని, తోటి ఉద్యోగులు సైతం సహకరించాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్ మాదిగ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లా మాదిగ ఉద్యోగుల సమైక్య సమావేశం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రాజు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద దేవేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో జిల్లా, మండల కమిటీల నిర్మాణం చేయాలని కోరారు. అందరు సహకరిస్తేనే జాంబవ భవన నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతీ జిల్లాలో అంబేడ్కర్ ఆశయాలను ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిపాక వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపట్టి యాదగిరి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బొడ్డు దయాకర్ మాదిగ, జాతీయ ప్రచార కార్యదర్శి కుమ్మరి రాజయ్య, జాతీయ, రాష్ట్ర నాయకులు ఎల్తూరి దిలీప్, సోమారపు ఐలయ్య, జాన్ విల్సన్, కొత్తూరు ప్రభాకర్, ఆకారపు మురళి, పుల్ల శ్రీనివాస్, అర్షం రాజు, మునిగాల రవి, ఓనపాకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య
- డాక్టర్లు, వైద్యాధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య సూచించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, పల్లె దవాఖాన వైద్యాధికారులు, టీబీ నోడల్ పర్సన్స్, హెల్త్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్, స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభిమాన్, సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17 నుంచి స్వస్థ నారి స్వశక్త్ పరివార్ కార్యక్రమం ప్రారంభం కానుందని, అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. తమ ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినప్పుడు ఆ ప్రాంతంలోని మహిళలు పరీక్ష శిబిరాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. దోమల బారిన పడకుండా జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. డెంగీ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రై డే కార్యక్రమం, ఫీవర్ సర్వే మంగళ, శుక్రవారం తప్పనిసరిగా చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు వైద్యాధికారి టి.మదన్‌మోహన్‌రావు, డాక్టర్ కె.హిమబిందు, డెమో అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెస్ క్లబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు



ప్రశాంత్‌నగర్‌లో సరదాగా చెస్ ఆడుతున్న ఎమ్మెల్యేలు

కాజీపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో శనివారం ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు చెస్ క్లబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేలు చెస్ ఆడి స్థానిక క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెస్ యువతలో మంచి ఆలోచనలు రేకెత్తించి మేధావులుగా తీర్చిదిద్దుతుందన్నారు. జీవితంలో ఏమైనా సమస్యలు తలెత్తినప్పుడు ఎలా పరిష్కరించాలో చెస్ లాంటి ఆటల ద్వారా మెళకువలు తెలుసుకోవచ్చని అన్నారు. యువత చెస్ లాంటి ఆటల వైపు మొగ్గుచూపితే భవిష్యత్ దృఢంగా నిర్మాణం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రమేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గాయత్రినగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు సంగు సారయ్య

వడ్డెపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 56వ డివిజన్ గాయత్రినగర్ అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రినగర్ కాలనీ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగు సారయ్య, ఉపాధ్యక్షుడిగా దాసరి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా ఊడుగుల మల్లేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరిగా యలకంటి తిలక్‌రెడ్డి, జాయింట్ సెక్రటరిగా మాచర్ల సతీష్‌కుమార్, కోశాధికారిగా కె.సురేందర్ ఎన్నికయ్యారు.

18న తక్కళ్లపల్లి రాము 3వ సంస్మరణ సభ

తెలంగాణ జనవేదిక బాధ్యుడు ఉదయ భానురావు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనవేదిక కన్వీనర్, ప్రముఖ కాంగ్రెస్ నేత తక్కళ్లపల్లి రాము 3వ సంస్మరణ సభ సెప్టెంబరు 18న గురువారం సాయంత్రం 4 గంటలకు హనుమకొండలోని రాజరాజనరేంద్రాంధ్ర భాషా నిలయంలో జరుగనుంది. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎంహెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు అధ్యక్షత వహిస్తారని తెలంగాణ జనవేదిక బాధ్యులు మార్నేని ఉదయభానురావు తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన నాయకులు, నేతలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు హాజరు కావాలని కోరారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



గణితావధాని నర్సింహామూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవాసంఘం భీమారం శాఖ ఆధ్వర్యంలో లయన్ మోత్కూరి మనోహన్‌రావు అధ్యక్షతన శనివారం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గణితావధాని అడ్లూరి నర్సింహామూర్తి పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఉపాధ్యాయులే లేకుంటే మనిషి ఎదుగుదల అక్షరజ్ఞానం కష్టమేనన్నారు. బ్రాహ్మణ సేవాసమితి ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు.

డాక్టర్ కె.శ్రీదేవి, డీఎస్ఎం ప్రసాద్, మండువ వేణు, బీఆర్‌వీ.చెంగల్‌రావు తదితర అనేక మంది ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఐటీసీ మేనేజర్ పాండురంగారావు, అసోసియేట్ ప్రొఫెసర్ పాలకుర్తి దినాకర్, డాక్టర్ దేవులపల్లి వాణి, వెంకటరమణ, అకౌంట్స్ అధికారి రత్నాకర్‌రావు తదితర ప్రముఖులు కూడా కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయుల గుణగణాలను ప్రశంసించారు.

డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న అజీజ్‌ఖాన్ తదితరులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్‌ను యువ క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ (ఎన్ఏపీఈఎస్ఎస్) ఆధ్వర్యంలో మలేషియాలోని యూనివర్సిటీ టెక్నాలజీ మారా, షాఅలంలో ఈ నెల 18నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సులో పాల్గొనేందుకు వెళుతున్న అశోక్‌కుమార్‌ను శనివారం హనుమకొండలోని డీఎస్ఏ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, నెట్‌బాల్ బాధ్యులు లిల్లీ ఫోరెన్స్, సీనియర్ పీడీ రాజలింగ, డీఎస్ఏ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే మలేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సులో పాల్గొనేందుకు వెళుతున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను శనివారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్



గుడిబండల్ జంక్షన్‌లో మెపా జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా)వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మెపా ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ జవహర్ కాలనీలోని మెపా ప్రధాన కార్యాలయం నుంచి కేయూ క్రాస్ రోడ్డు, నయీంనగర్, హనుమకొండ చౌరస్తా మీదుగా 8వ డివిజన్ గుడిబండల్ వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం 8వ డివిజన్ గుడిబండల్ జంక్షన్‌లో మెపా జెండాను ఆవిష్కరించి అక్కడే ఏర్పాటు చేసిన మెపా సమావేశంలో పులి దేవేందర్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం సరికాదని, మెపా రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. హనుమకొండ గుడిబండల్ జంక్షన్‌లో మెపా తొలి జెండాను ఆవిష్కరించి తమ ఐక్యతను చాటుకోవడం అభినందనీయమన్నారు.

మెపా గౌరవ సలహాదారుడు పులి ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతిలో వెనుబడిన వారికి ప్రోత్సాహం అందించడమే మెపా లక్ష్యం అన్నారు. ప్రతీ కుటుంబంలో ఒక విద్యావంతుడు ఉండాలని, చదువుకోవడం ద్వారానే ఆర్థికంగా ఎదగగలమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పులి రాజేష్, పెండ్యాల కృష్ణ, మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్న రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్, మెపా వ్యవస్థాపక సభ్యులు బోనాల రమేష్, హనుమకొండ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గోనెల సాగర్, సభ్యులు పులి మధుసుదన్, రాకేష్, శ్రీనివాస్, కాటబోయిన సునీత, అనురాధ, శివ, కిరణ్, సాహిత్, గుడిబండల్, ఏనుగులగడ్డ ముదిరాజ్ సంఘం పెద్దలు, యువత పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాటం మరువలేనిది

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి



వారోత్సవాల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

హసన్‌పర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మరువలేనిదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి, జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతి హాజరై సీపీఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో హైదరాబాద్ నిజాం నియంతృత్వ ఫ్యూడల్ విధానాలను ఎదిరించి నిజాం తాబేదారులను, దొరల గుండాలను మట్టి కరిపించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో 4వేల గ్రామాలకు విముక్తి కలిగించి 10లక్షల ఎకరాల భూమిని పంచిందన్నారు. ఈ పోరాటంలో 4వేల మంది అమరవీరులను అందించిన విప్లవ వీర చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. నిజాం సైన్యాన్ని, భారత సైన్యాలను మట్టికరిపించిన చరిత్ర తెలంగాణ సాయుధ పోరాట విప్లవీరులు అందించిన రక్త చరిత్ర తెలంగాణ విముక్తికి కారణమన్నారు. పేద ప్రజల విముక్తి కోసం కుటుంబాలను త్యాగం చేసిన ఈ ప్రాంతానికి చెందిన తోకల కొమురారెడ్డి, పాడి మల్లారెడ్డి, పాడి చంద్రారెడ్డి, గంగిళ్ల లింగారెడ్డి, రేణికుంట్ల ఐలయ్య, షరేడి మల్లయ్య అమరత్వం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు భారత్ బచావో నాయకులు దొమ్మటి ప్రవీణ్‌కుమార్, షేక్ బాబు, రాజయ్య, సాంబయ్య, భద్రయ్య, తిరుపతి, సుధాకర్, ముజీగా, అజయ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జడ్పీ ఆఫీస్‌లో క్రీడా పోటీలు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15న ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని శనివారం అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ తెలిపారు. షటిల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్, లైమ్‌స్పూన్, మ్యూజికల్ చైర్ నిర్వహించినట్లు ఆదివారం క్రికెట్ పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఇంజనీర్స్‌డే వేడుకలు, పంచాయతీరాజ్ అధికారుల రక్తదాన శిబిరం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, రిటైర్డ్ ఇంజనీర్లకు సన్మానాలు, క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం కార్యక్రమం నిర్వహిస్తామని సూపరింటెండెంట్ రామకృష్ణ తెలిపారు.

లంబాడీ జేఏసీ వరంగల్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన లంబాడీ జేఏసీ గ్రేటర్ వరంగల్ కమిటీ ప్రతినిధులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ(ఎల్‌జేఏసీ) సమావేశం శనివారం హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో కమిటీ రాష్ట్ర కన్వీనర్లు జైసింగ్ రాథోడ్, జాటోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ లంబాడీ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా భూక్య మోతీలాల్ నాయక్, కన్వీనర్లుగా బానోత్ నవీన్ నాయక్, నూనావత్ జవహర్‌నాయక్, కోకన్వీనర్లుగా భూక్య హుస్సేన్ నాయక్, గుగులోత్ వీరమ్మబాయి, ధరావత్ రాంచందర్, ధరావత్ దేవేందర్, అంగోత్ సుధాకర్, లావుడ్య రాజు, అజ్మీరా సునీత, తేజావత్ ఫణికుమార్, భూక్య రమేష్ తదితరులు ఎన్నికయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రీన్ డే



గ్రీన్ డేపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ శారద

మడికొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ డివిజన్ మడికొండ సెక్టర్ రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రీన్‌డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శారద పిల్లలు, తల్లులతో మొక్కలు నాటించారు. చెట్ల పెంపకం వలన కలిగే లాభాలను, పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తల్లుల కమిటీ అధ్యక్షురాలు నాయిని సరిత, ఆశావర్కర్ రజిత, మహిళలు పాల్గొన్నారు.

గుట్కాల పట్టివేత



సీజ్ చేసిన గుట్కా, బైక్, నిందితులను చూపిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై తరలిస్తున్న రూ.35వేల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. రాజు, దశరథం అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై గుట్కాలు తరలిస్తుండగా కాకాజీకాలనీలో పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై సతీష్, క్రైం హెడ్ కానిస్టేబుల్ రాహుఫ్, కానిస్టేబుల్ అశోక్ ఇద్దరు వ్యక్తుల నుంచి గుట్కాలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 41 మందికి జరిమానా

వరంగల్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ 41 మందిని శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ రూ.42,800 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని 14 మందికి రూ.11,000 జరిమానా విధించారన్నారు.

రేపు వైష్ణవ కృష్ణాష్టమి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇస్కాన్ నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భక్త సేవా సమాజ్ ఆధ్యాత్మిక కేంద్రం వారి ఆధ్వర్యంలో భగవద్గీత, కృష్ణాష్టకం, మధురాష్టకం పారాయణాలు, శ్రీకృష్ణ అష్టోత్తర శతనామాలు, శ్రీకృష్ణ గోపిక వేషాలతో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఔత్సాహికులు 9849 636443 మొబైల్ నెంబరును సంప్రదించాలన్నారు.




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్	హిందీ సిరీస్	సెప్టెంబర్18
అమెజాన్ ప్రైమ్		
జెన్ వి	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 17
జియో హాట్‌స్టార్		
సిన్నర్స్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 18
ది ట్రయల్ 2	హిందీ సిరీస్	సెప్టెంబర్ 19
ఆహా...		
ష్...	తమిళ సిరీస్	సెప్టెంబర్ 19



తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని నటుడు జగపతిబాబు. 'అల్లరి ప్రేమికుడు, శుభలగ్నం, గాయం' వంటి అనేక సూపర్‌హిట్ చిత్రాలలో హీరోగా నటించిన ఆయన... ప్రస్తుతం తన టాక్ షో ద్వారా అందరినీ ఆకట్టుకుంటున్నారు. హీరో... క్యారెక్టర్ ఆర్టిస్టు... విలన్... విభిన్నపాత్రలెన్నో పోషించిన జగపతిబాబును 'నవ్య' పలకరించింది.

సండే సెలబ్రిటీ

నటులను 'నడిచే డబ్బు'గా చూస్తారు

మీరు చాలా సెన్సిటివ్ పర్సన్ అని చాలాసార్లు చెప్పారు. మరి సినిమా ఇండస్ట్రీలో ఎలా కొనసాగుతున్నారు?

నేను ఇండస్ట్రీకి వచ్చే ముందు చాలా మంది... "నువ్వు సెన్సిటివ్. ఇంట్రావర్ట్. సినిమాల్లో ఎలా నటిస్తావు" అని అడిగారు. మొదట్లో నాకు నటనపై ఆసక్తి ఉండేది కాదు. నేను బాగుంటానని కూడా నాకు తెలియదు. సుబ్బిరామిరెడ్డిగారు, రవికిషోర్ నన్ను హీరోగా చేయమని అడిగారు. రవికిషోర్ అయితే... 'మహర్షి' సినిమాలో ఆఫర్ కూడా ఇచ్చాడు. "రాజేంద్ర ప్రసాద్ గారి అబ్బాయిని కాబట్టి ఆఫర్స్ వస్తున్నాయి" అనుకొనేవాడిని. ఒక్కసారి నటుడిని అయిన తర్వాత అంతా మారిపోయింది. నిజ జీవితంలో నేను ఇంట్రావర్ట్. సెన్సిటివ్. కానీ కెమెరా ముందు వేరేగా మారిపోతాను. కెమెరా నా ఫ్రెండ్. దానితో నేను కనెక్ట్ అవుతా! రెచ్చిపోతా. ఇక్కడ మీకో రహస్యం చెబుతా. సినీ కెమెరా ముందు ఎమోషనల్‌గా ఎంతైనా నటిస్తా. కానీ స్టిల్ కెమెరాకు పోజులు ఇవ్వలేను.

మీ నాన్న రాజేంద్రప్రసాద్ గారు పెద్ద నిర్మాత. ఆ వారసత్వం బాధ్యతగా అనిపించదా?

అనిపించదు. జీవితం పట్ల నాకున్న దృక్పథం వేరు. ఈ మధ్యకాలంలో చాలామంది నెపోకిడ్స్ (వారసులు) గురించి ఫిర్యాదులు చేస్తూ ఉంటారు. కానీ నా ఉద్దేశంలో వారసత్వం ఒక ఎంట్రీ పాయింట్ మాత్రమే! ఆ తర్వాత మనని మనమే నిరూపించుకోవాలి. నా రెండో సినిమాకే... మా బ్యానర్ కానీ, నాన్నగారు కానీ నాకు సాయం చేయలేరని అర్థమయిపోయింది. ఆ తర్వాత నేను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. ఇది నా ఒక్కడికే కాదు... చాలామందికి జరుగుతోంది. ఇక్కడ మనుగడ సాగించాలంటే పరిశ్రమ తీరు తెలుసుకొని మసలాలి.

సినీ పరిశ్రమను మీరు ఎలా చూస్తారు?

మా అందరికీ అన్నం పెడుతోంది. అయితే ఇక్కడ నటులను 'నడిచే డబ్బు'గా చూస్తారు. డబ్బులు కనిపిస్తేనే మాట్లాడతారు. లేకపోతే లేదు. ఎందుకంటే ఇది ఒక బిజినెస్. ఒక వ్యక్తి మంచివాడా? చెడ్డవాడా అనే విషయం కన్నా... మార్కెట్ ఉందా? లేదా? డబ్బు వస్తుందా? లేదా? మనకు ఉపయోగం ఉందా? లేదా? అనే విషయాలనే ఆలోచిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే... 'నాకేంటి?' అనే సూత్రం ద్వారానే అన్నీ నడుస్తూ ఉంటాయి. అయితే దీనిని నేను తప్పుపట్టను. ఎందుకంటే ఈ పరిశ్రమ టర్నోవర్ వేల కోట్లకు చేరిపోయింది. అందువల్ల మంచి, చెడు కన్నా లాభం... నష్టాలకే ఎక్కువ విలువ ఉంటుంది.

స్క్రిప్టులు మీరే ఎంపిక చేసుకుంటారా?

నేనే విని, ఎంపిక చేసుకుంటా. నేను ఎంపికచేసుకొనే పాత్రలు విభిన్నంగా ఉంటాయి. స్క్రిప్ట్ బలం, డైరెక్టర్ బలం, బ్యానర్ బలం... కొన్నిసార్లు రెమ్యూనరేషన్ బలం... ఇలా రకరకాల కోణాల నుంచి వీటిని ఎంపిక చేసుకుంటా! స్క్రిప్ట్ నచ్చితే డబ్బులు లేకుండా చేసిన సినిమాలు కూడా ఉన్నాయి. డబ్బుల కోసం స్క్రిప్ట్ నచ్చకపోయినా చేసిన సినిమాలున్నాయి.

మీరు, మీ కుటుంబం చాలా ప్రైవేట్ మనుషులు. మీరు చాలా స్ట్రిక్ట్ ఫాదరా?

లేదండి. మా పిల్లలకు నేను చాలా స్వేచ్ఛ ఇచ్చాను. ఎందుకంటే చిన్నప్పటి నుంచి నేను స్వేచ్ఛా జీవిని. స్కూలు అంటే ఇష్టం ఉండేది కాదు. మా పిల్లలకు కూడా... "మీకు రెక్కలు ఇచ్చాను. స్వేచ్ఛగా ఎగరండి" అని చెప్పేవాడిని. అడిగితే తప్ప వాళ్లకు ఎప్పుడూ సలహాలు కూడా ఇచ్చేవాడినికాదు. నా అభిప్రాయాలు కూడా చెప్పేవాడిని కాదు. వాళ్లు చాలా బాగా పెరిగారు. అప్పుడప్పుడు మా పెద్దమ్మాయి... "నువ్వు మమ్మల్ని స్ట్రిక్ట్‌గా పెంచలేదు" అంటూ ఉంటుంది. "నేను వదిలేశాను. మీరు బాగా పెరిగారు. బాగుపడ్డారు" అని చెబుతూ ఉంటాను. చిన్నప్పటి నుంచి ఇప్పటి దాకా పిల్లలను నేను ఫ్రెండ్స్‌గానే చూశాను.

సముద్రం... నా ఆత్మకథ...

చిన్నప్పుడు మా స్కూలు... బీచ్ పక్కనే ఉండేది. అక్కడ కూర్చుని ఫిలాసఫికల్‌గా రాసుకుంటూ ఉండేవాడిని. అందుకే నేను రాస్తున్న ఆత్మకథ పేరు 'సముద్రం' అని పెట్టుకున్నా! నా ఆలోచనలు, అనుభవాలతో పన్నెండున్నర గంటల వీడియో చేశా. ఎడిటింగ్ బాగా రాలేదు. అందువల్ల విడుదల చేయలేదు. నా ఆత్మకథలో కొన్ని ఖాళీలు ఉన్నాయి. వాటిని పూరించిన తర్వాత దానిని విడుదల చేస్తా!



మీరు హీరోగా ప్రవేశించిన నాటికి... ఇప్పటికీ పరిశ్రమలో ఏవైనా మార్పులు వచ్చాయా?

ఎన్టీఆర్.. ఏఎన్నాఆర్‌ల సమయం నుంచి మా దాకా అందరం ఫాలో అయిన రూల్ ఒకటుంది. హీరోతో పాటుగా సినిమాలోని అన్ని పాత్రలూ బాగా ఉండాలనుకొనేవాళ్లం. అందరికీ ప్రాధాన్యం ఉండేది. ఈ విషయం మాట్లాడుతుంటే... 'శుభలగ్నం' జ్ఞాపకం వస్తోంది. షూటింగ్ సమయంలో డైరెక్టర్ కృష్ణారెడ్డిగారు వచ్చి... "పాత్రపరంగా సినిమాలో ఆమని డామినేట్ చేసేస్తోందండి' అన్నారు. "వైనాట్? నేను హీరోనే. కానీ ఈ సినిమా ఆ అమ్మాయిదే" అన్నా. ఆ రోజుల్లో అలా ఉండేది. అందరూ కథ బరువు మోసేవారు. ఇప్పుడు 'వన్‌మ్యాన్ షో' అయిపోయింది. హీరో మీదే ఫోకస్ అంతా ఉంటోంది. ఒకప్పుడు హీరో లంటే గౌరవం ఉండేది. ఇప్పుడు హీరోలంటే భయం కనిపిస్తోంది. 'అమ్మో! హీరోనా' అనుకుంటున్నారు. కొన్ని పాత్రలు ఎందుకు వస్తున్నాయో... ఎందుకు పోతున్నాయో కూడా తెలియటంలేదు. అందరూ అలా ఉన్నారని అనటంలేదు. కొందరు సెన్సిబుల్ డైరెక్టర్స్ కూడా ఉన్నారు.

నిర్మాతలు ఏటీఎంలు అయిపోయేరనే విమర్శ వినిపిస్తూ ఉంటుంది..!

నిర్మాతకు గౌరవం తగ్గిందనే విషయంలో సందేహం లేదు. నిర్మాతలే సినీ పరిశ్రమకు మూలస్తంభాలు. కానీ వారికి గౌరవం తగ్గింది. చాలా మంది నిర్మాతలు షూటింగ్‌లకు కూడా రావటం లేదు. ఆన్‌లైన్ ప్రొడ్యూసర్ హవా పెరిగిపోయింది. ఒకప్పుడు ఇలా ఉండేదికాదు. నిర్మాతలు సినీ నిర్మాణాన్ని ఎంజాయ్ చేసేవారు. రోజూ షూటింగ్‌కు వచ్చేవారు. ఏవైనా మార్పులు ఉంటే కూడా చెప్పేవారు. ఇప్పుడు అలాంటి వారు తక్కువగా ఉన్నారనే చెప్పాలి.

● సీవీఎల్ఎన్ ప్రసాద్
ఫొటోలు: అశోకుడు

అందుకే కేసినోకు...

నాకు ప్రస్తుతం ఎలాంటి హాబీలు లేవు. ఒకప్పుడు విపరీతంగా పార్టీలు చేసేకొనేవాడిని. అప్పుడు నా రేంజే వేరు. షూటింగ్‌ల మధ్యలో ఫ్లయిట్ ఎక్కి విదేశాలకు వెళ్లి పార్టీ చేసుకొని వచ్చిన రోజులు కూడా ఉన్నాయి. కానీ హఠాత్తుగా నాకు పార్టీలు చాలు అనిపించింది. పార్టీలకు కూడా ఎజెండాలు ఉంటున్నాయి. ఇక్కడ ఒక విషయం చెప్పాలి... నాకు నా చుట్టూ ఉన్న పరిసరాలను, మనుషులను గమనించటమంటే చాలా ఇష్టం. నేను కేసినోకి వెళ్లటానికి ఇదే ప్రధాన కారణం. మిలియన్స్ పోతుంటే ఎలా ఉంటుంది? వస్తుంటే వాళ్ల ఫీలింగ్స్ ఎలా ఉంటాయి అనేవి చూసేవాడిని. నా ఉద్దేశంలో మనిషి బుద్ధి పేకాటలో తెలుస్తుంది. ఒక మనిషి గురించి తెలియాలంటే అతనిని పేకాట ఆడించాలి.

రమ్యకృష్ణ నాకు గాడ్‌మదర్...

ఇండస్ట్రీలో నాకు రమ్యకృష్ణ మంచి స్నేహితురాలు. గాడ్‌మదర్ కూడా. ఈ మాట అనడానికి వెనకొక కారణం ఉంది. 'శుభలగ్నం' సినిమా నాకు రావటానికి తనే కారణం. 'అల్లరి ప్రేమికుడు' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో దత్తు గారి దగ్గర నుంచి 'శుభలగ్నం'కు డేట్స్ కావాలని ఫోన్ వచ్చింది. 'డేట్స్ లేవు.. వద్దని చెప్పేయి" అని మా మేనేజర్‌కు చెప్పా. అతను చెప్పటానికి వెళ్తున్న సమయంలో మా మాటలు రమ్యకృష్ణ విన్నది. "నీకు పిచ్చా! ఆ సినిమా ఒప్పుకో! డేట్స్ మనం ఎడ్జెస్ట్ చేసుకుందాం" అని చెప్పి ఒప్పించింది. తను లేకపోతే 'శుభలగ్నం' లేదు. ఇప్పటికీ తను మా ఫ్యామిలీ ఫ్రెండ్. అప్పుడప్పుడు ఫోన్ చేస్తుంది. "ఎలా ఉన్నావు.డబ్బులు జాగ్రత్తగా పెట్టుకో! అనవసరంగా ఖర్చు చేయకు"అని చెబుతుంది.

వర్షాకాలంలో రకరకాల శిరోజాల సమస్యలు తలెత్తుతుంటాయి. చుండ్రు, దురద, మాడుమీద కురుపులు, శిరోజాలు రాలడం లాంటివి చికాకు కల్గిస్తుంటాయి. వాతావరణంలో ఉండే తేమ వల్ల తలలో చెమట, జిడ్డు చేరి ఈ సమస్యలను జటిలం చేస్తాయి. ఇలా వర్షాకాలంలో ఎదురయ్యే శిరోజాల సమస్యలకు ఆయుర్వేదం చక్కని పరిష్కారాలను చూపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం...

వర్షాకాలంలో జుట్టుకు రక్షణ



ఆయుర్వేద పరిష్కారాలు





● **బృంగరాజ్:** జుట్టు బాగా రాలుతుంటే బృంగరాజ్ నూనెను తలంతా పట్టించిముని వేళ్లతో మెల్లగా మర్దన చేయాలి. రాత్రంతా అలాగే ఉంచుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. బృంగరాజ్ పొడిలో కొబ్బరి నూనె కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని తలంతా పట్టించి అరగంట తరవాత తలస్నానం చేయాలి. ఈ చిట్కాలు పాటిస్తూ ఉంటే శరీరంలో వాత దోషం తగ్గి శిరోజాలకు పోషణ లభిస్తుంది. జుట్టు తెల్లబడడం ఆగుతుంది. మాడుకు రక్తప్రసరణ పెరిగి శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

● **ఉసిరి:** శిరోజాలు నెరుస్తుంటే ఉసిరి నూనెను కొద్దిగా వేడిచేసి తలంతా పట్టించాలి. వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ పావుగంటసేపు తల మీద మర్దన చేయాలి. రాత్రంతా అలాగే ఉంచుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఉసిరి పొడిలో తగినంత పెరుగు కలిపి పేస్టులా చేసి తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి తలస్నానం చేయాలి. ఈ చిట్కాలు పాటించడం వల్ల శరీరంలో పిత్త దోషం తగ్గుతుంది. ఉసిరిలోని సి విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు కుదుళ్లను గట్టిపరుస్తాయి. తలలో రక్తప్రసరణ సజావుగా జరిగి శిరోజాలు ఒత్తుగా పెరిగి మెరుపును సంతరించుకుంటాయి.

● బ్రాహ్మి: దీనితో తయారుచేసిన నూనెను కొద్దిగా వేడిచేసి రాత్రి పూట తలకు పట్టిస్తే మాడు చల్లబడుతుంది. ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా మారుతుంది. ఉదయాన్నే తలస్నానం చేయగానే శిరోజాలు నల్లగా మెరుస్తుంటాయి.

● వారానికి రెండు సార్లు హెర్బల్ నూనెలతో తలకు మర్దన చేయడం వల్ల జుట్టురాలే సమస్యను నివారించవచ్చు. వాతావరణం తేమగా ఉన్నప్పుడు మాత్రం ఎక్కువగా నూనె రాయడం మంచిది కాదు.

● తలస్నానానికి కీటోకోనజోల్ లాంటి మెడికేటెడ్ షాంపూలు ఉపయోగించడం మంచిది. ఇవి మాడుమీద ఏర్పడే ఫంగస్, చుండ్రు, కురుపులను నివారిస్తాయి.

● పెప్టైడ్‌లు, విటమిన్లు, బొటానికల్స్‌తో కూడిన సీరమ్‌లను వాడడం కూడా మంచిదే. ఇవి జుట్టు కుదుళ్లను బలపరచి మాడును ఆరోగ్యంగా మారుస్తాయి.

● ఆయుర్వేద ఉత్పత్తులు సురక్షితమే అయినప్పటికీ వాటిని ఉపయోగించే ముందు ప్యాచ్‌టెస్ట్ చేసుకోవడం మంచిది.



ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- తలంతా జిడ్డుగా ఉందంటూ వేడివేడి నీళ్లతో తలస్నానం చేయకూడదు. అలా చేస్తే మాడుమీద సహజ నూనెల ఉత్పత్తి తగ్గి శిరోజాలు పొడిబారుతాయి. కాబట్టి గోరువెచ్చని నీటితో మాత్రమే తలస్నానం చేయాలి.



- తలస్నానం చేసిన ప్రతిసారీ కండిషనర్‌ను వాడితే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. కండిషనర్ వల్ల వెంట్రుకల్లో తేమ నిలుస్తుంది. కుదుళ్లు బలపడతాయి.
- శిరోజాలను గట్టిగా బిగించి జడ వేసుకోవడం లేదా ముడి పెట్టుకోవడం వల్ల కుదుళ్లు బలహీనమవుతాయి. దీంతో శిరోజాలు అధికంగా రాలిపోతుంటాయి. కాబట్టి జడను తేలికగా అల్లుకోవడం మంచిది.
- శిరోజాలకు అధికంగా నూనె పట్టించి సరిగా తలస్నానం చేయకపోతే కుదుళ్లకు ఆక్సిజన్ అందదు. దీంతో కుదుళ్ల వదులుగా మారి వెంట్రుకలు రాలిపోతాయి. అలాకాకుండా జిడ్డు, మురికి పూర్తిగా వదిలేలా తేలిక పాటి షాంపూతో తలస్నానం చేయాలి. సల్ఫేట్ అధికంగా ఉన్న షాంపూలను వాడకూడదు.
- తడిజుట్టును తువాలుతో ఎలా పడితే అలా రుద్దుతూ తుడవకూడదు. మెత్తటి తువాలుతో మెల్లగా అద్దుతూ తుడుచుకోవాలి. తడి జుట్టును దువ్వకూడదు. శిరోజాలు పూర్తిగా ఆరిన తరవాతనే వెడల్పాటి పళ్ల దువ్వెనతో మెల్లగా దువ్వుకోవాలి. శిరోజాలను గాలికి ఆరనివ్వాలి. హెయిర్ డ్రైయర్‌ను వాడకూడదు.
- శిరోజాలను అధిక వేడితో స్ట్రైటెనింగ్, ఐరనింగ్, కర్లింగ్ చేయించుకోవడం తగ్గించాలి.

సెలబ్ ఫిట్

కష్టపడే తత్వం... అంకితభావం ఉంటే ఎంతటి లక్ష్యమైనా చేరుకోవచ్చని నిరూపించిన మహిళ సయామీ ఖేర్. విలక్షణమైన పాత్రలతో నటిగా అలరిస్తూనే... అలుపెరుగని కృషితో అథ్లెట్‌గానూ అదరగొడుతోంది. కఠినమైన 'ఐరన్ మ్యాన్' రేస్‌ను పూర్తి చేసిన మొట్టమొదటి భారతీయ నటిగా చరిత్ర సృష్టించిన సయామీ... నవతరానికి మార్గదర్శిగానూ నిలుస్తోంది.



సయామీ... మన ఐరన్‌మ్యాన్

'భారత మహిళలు కుటుంబం, ఉద్యోగం, పిల్లల కోసం శ్రమిస్తారు. కానీ తమ గురించి తాము మరిచిపోతారు. వ్యక్తిగత ఆరోగ్యాన్ని ఏమాత్రం పట్టించుకోరు. అత్యధిక శాతం మంది పరిస్థితి ఇదే. ఒక మహిళ తన ఆరోగ్యకర జీవన శైలిపై దృష్టి పెడితే... ఆ ప్రభావం ఆమె చుట్టూ ఉన్నవారిపై కూడా పడుతుందనేది నా నమ్మకం. నడక, నాట్యం, యోగా... ఏదైనా కావచ్చు, రోజుకు కనీసం ఓ అరగంట కేటాయిస్తే చాలు... శారీరకంగా, మానసికంగా దృఢంగా మారతారు. తత్ఫలితంగా ఎన్నో అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంటారు'... అంటున్న సయామీ ఖేర్ నిత్యం తన అభిమానులను ఫిట్‌నెస్ వైపు నడిపించే ప్రయత్నం చేస్తుంటుంది. నటిగా, క్రీడాకారిణిగా... రెండిటికీ సమప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది.

అతడి తరువాత...

ఎంతో క్లిష్టమైన 'ఐరన్‌మ్యాన్ 70.3' రేస్‌ను పూర్తి చేసిన తొలి భారత నటిగా సయామీ గత ఏడాది చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది అదే ఫీట్‌ను మరోసారి సాధించి తన ఫిట్‌నెస్‌కు తిరుగులేదని నిరూపించింది. ఆమె కంటే ముందు నటుడు, మోడల్ మిలింద్ సోమన్ దీన్ని పూర్తి చేశాడు. 'ఐరన్‌మ్యాన్' రేస్‌ను 'వరల్డ్ ట్రయథ్లాన్ కార్పొరేషన్' (డబ్ల్యూటీసీ) నిర్వహిస్తుంది. ఇందులో 1.2 మైళ్ల స్విమ్మింగ్, 56 మైళ్ల సైక్లింగ్, 13.1 మైళ్ల రన్నింగ్ ఉంటాయి. మొత్తం కలిపి 70.3 మైళ్లు. 'నటులకు క్రీడల్లో పాల్గొనడం అంత సులువు కాదు. విభిన్న లోకేషన్లకు వెళుతుంటాం. షూటింగ్ సమయాలు అందుకు అనుకూలించవు. అదే ఉద్యోగం అయితే ఆఫీస్‌కు వేళలు ఉంటాయి. కానీ ఇక్కడ అలా కుదరదు. కొన్నిసార్లు విరామం లేకుండా రోజుల తరబడి వరుస షెడ్యూల్స్ చేయాల్సి వస్తుంది. నైట్ షిఫ్ట్ సరేసరి. ఈ పరిస్థితుల్లో క్రీడల్లో కొనసాగడం పెద్ద సవాలు. శరీరాన్ని ఎంతో కష్టపెట్టాలి. నేను షూటింగ్ నుంచి నేరుగా సాధన కోసం మైదానానికి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. చిన్నప్పటి నుంచీ ఆటలపై మక్కువ నన్ను నడిపిస్తోంది' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చిన సయామీ... తనను చూసి మరింతమంది మహిళలు స్ఫూర్తి పొందుతారని ఆశిస్తోంది. ఇదొక్కటే కాదు... మారథాన్‌లోనూ ఆమె పోటీపడుతోంది.



పాత్రకు తగినట్టు తన ఆకృతిని మార్చుకోవడానికి వెనకాడని సయామీ... 2015లో విడుదలైన 'రేయ్' చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆ తరువాత 'మిర్జా, చోక్డ్, అన్‌పాస్‌డ్, హైవే, వైల్డ్ డాగ్, ఘూమర్, శర్మాజీ కీ బేటీ' తదితర సినిమాల్లో ప్రధాన పాత్రలు పోషించింది. ఆ మధ్య విడుదలైన 'జాట్'లో పోలీస్ అధికారిగా మెప్పించింది. మహారాష్ట్ర నాసిక్‌లో పుట్టిన ఆమె తండ్రి అద్వైత్ ఖేర్ మోడల్. తల్లి ఉత్తర 1982లో 'మిస్ ఇండియా'. అక్క సాంస్కృతి మరాఠీ నటి. ముంబయి సెయింట్ జేవియర్స్ కాలేజీ నుంచి డిగ్రీ పట్టా పొందిన సయామీ... పలు టెలివిజన్ షోలలో కూడా మెరిసింది.

శరీరం చెప్పింది వింటా...

'ఒక్కోసారి తీవ్రమైన పని ఒత్తిడిని మన శరీరం తట్టుకోలేదు. అలాంటప్పుడు వ్యాయామాలు, డైటింగ్ పేరిట దాన్ని కష్టపెట్టడం సరైంది కాదు. అందుకే నేను నా శరీరం చెప్పింది వింటాను. దానికి అనుగుణంగానే నా షెడ్యూల్స్ నిర్ణయించుకొంటాను. శరీరానికి బాగా శ్రమ ఇచ్చానని అనుకున్నప్పుడు పూర్తిగా విశ్రాంతి తీసుకొంటా. నాకు నచ్చిన ఐస్‌క్రీమ్, చాక్లెట్లు తింటా. గత నెలలో ఐరన్ మ్యాన్ రేస్ తరువాత శీతల సరస్సులో ఈత కొట్టాను. అది ఐస్‌బాత్‌లా పని చేసింది' అంటున్న సయామీ... అవసరాన్ని బట్టి జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుంది.

ఇలా ఉంటే అందరినీ ఆకట్టుకుంటారు

చక్కని మాట తీరు, ఆకట్టుకునే వ్యక్తిత్వం అనేవి మనల్ని నలుగురిలో ప్రత్యేకంగా నిలబెడతాయి. అలా అందరితో ప్రశంసలు అందుకోవాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...

- ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ముఖంపై చిరునవ్వు ఉండేలా చూసుకోవాలి. అలాగే నిటారుగా నిలబడాలి లేదా కుర్చీలో హాయిగా కూర్చోవాలి. అక్కడా ఇక్కడా కాకుండా ఎదుటివారి కళ్లలోకి చూస్తూ మాట్లాడాలి. ఇవన్నీ చక్కని ఆత్మవిశ్వాసానికి ప్రతీకలుగా నిలుస్తాయి.
- దుస్తులు మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఆహ్లాదకరంగా కనిపిస్తూ అభిరుచికి అద్దం పట్టేలా దుస్తులు ఉండాలి. సందర్భానుసారం దుస్తులను ఎంపిక చేసుకోవాలి. సరైన దుస్తులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.
- అనుకోని సమస్య ఎదురైనప్పుడు ఇతరులను నిందించకూడదు. దానికి బదులు సమస్య పరిష్కారానికి మనం అనుసరించే వ్యవహారశైలి అందరిలో ఉన్నతంగా నిలబెడుతుంది. అనవసరమైన వాదనలకు పోకుండా సామరస్యంగా సమస్యను తీర్చే ప్రయత్నం చేయాలి.



- సొంత ఆలోచన మాత్రమే సరైనదన్న భావనతో కాకుండా అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. అందరినీ కలుపుకొంటూ, ఏ ఒక్కరినీ నొప్పించకుండా చక్కని వ్యవహార దక్షతను అవలంబిస్తే నలుగురిలో ప్రత్యేకమైన ప్రశంసలు అందుకోవచ్చు.



ఇళయరాజాకు 'భారతరత్న' ఇవ్వాలి

● తమిళనాడు సీఎం స్టాలిన్

'ఇసైజ్ఞాని' ఇళయరాజాకు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' అవార్డును ఇవ్వాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోరారు. ఈ కోరికను ఒక్క తమిళనాడు రాష్ట్ర ప్రజల తరఫున కోరడం లేదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇళయ రాజా సంగీత అభిమానుల తరఫున కేంద్రాన్ని కోరుతున్నట్టు వెల్లడించారు. ఇళయరాజా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 50 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో రాష్ట్రప్రభుత్వం తరఫున శని వారం రాత్రి చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత ఇళయరాజా, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, అగ్ర నటులు కమలహాసన్, రజనీకాంత్, శివకుమార్, ప్రభు, కార్తీ తదితరులు హాజరయ్యారు. ఇళయ రాజాను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహూ కరించిన తర్వాత సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ ఒక గొప్ప సంగీత విద్వాంసుడుకి ఈ సన్మానం నిర్వ హించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లోని కష్టనష్టాలు, సాధక బాధకాలకు, ప్రేమకు, విరహానికి, లాలించేందుకు, జయాపజ యాలకు ఆయన పాటలు అమృతంగా ఉన్నా యన్నారు. ఇళయరాజా కెరీర్‌లో అత్యున్నత పౌర పురస్కారాలు, అవార్డులు, రివార్డులు వచ్చినప్ప టికీ తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో ఇచ్చిన 'ఇసైజ్ఞాని' బిరుదు చిరస్థాయిగా నిలిచిపోవడమే కాదు అదే ఒక పేరుగా మారిపోయిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున వర్ధమాన సంగీత కళా కారుల కోసం యేటా 'ఇళయరాజా' పేరున అవార్డులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ మాట్లా డుతూ... ఇళయరాజా స్నేహానికి అమితమైన విలువ ఇస్తార న్నారు. తన సోదరుడు, భార్య, కుమార్తె చనిపోతే చలించని, కన్నీరు కార్చని ఇళయరాజా... తన స్నేహితుడు ఎస్.పి.బాలసుబ్ర హ్మణ్యం చనిపోతే దుఃఖించారని గుర్తు చేశారు.

చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఘనవిజయం సాధిస్తుంది

మంచు మనోజ్



మంచు లక్ష్మీ ప్రధాన పాత్రధారిగా వంశీకృష్ణ మల్లా తెరకెక్కించిన చిత్రం 'దక్ష'. 'ద డెడ్లీ కాన్సిరసీ' ఉపశీర్షిక. శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ మంచు ఎంటర్టైన్ మెంట్స్ సంయుక్తంగా నిర్మిం చాయి. మోహన్‌బాబు కీలక పాత్రను పోషించారు. ఈనెల 19న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వ హించిన రిలీజ్ ప్రెస్‌మీట్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'నాన్న మోహన్‌బాబు, అక్క లక్ష్మీ నటించిన ఈ సినిమా మీ అందర్నీ ఆకట్టు కుంటుంది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది అనే నమ్మకం ఉంది. ఈ నెలలో విడుదలైన కొన్ని చిత్రాలు విజయపథంలో దూసుకుపోవడం తెలుగు చిత్రసీమ సంతోషించే విషయం' అని అన్నారు. మంచు లక్ష్మీ మాట్లాడుతూ 'ఇందులో నాన్న మోహన్‌బాబు పోషిం చిన పాత్ర సినిమాకే హైలైట్' అని తెలిపారు. వంశీకృష్ణ మల్లా మాట్లాడుతూ 'ఇదో డిఫరెంట్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు.

ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకున్నారు



తేజ సజ్జ

'ప్రేక్షకులు 'మిరాయ్' సినిమాను తమ గుండెల్లో పెట్టుకున్నారు. వారు సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ ప్రోత్సహించడం చూస్తుంటే ఆనందంగా ఉంది. దర్శకుడు కార్తీక్ కష్టం, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ విజన్ వల్లే ఇంత పెద్ద విజయం సాధ్య మైంది. మనోజ్ నటన సిని మాను మరో మెట్టు పైన నిలబెట్టింది. వీఎఫ్‌ఎక్స్‌కు కూడా మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. సినిమా ఆరంభంలో ప్రభాస్ తన గొంతుతో కథను పరి చయం చేసిన తీరు ప్రేక్షకులను అమితంగా ఆకట్టు కుంది' అని తేజ సజ్జ అన్నారు. ఆయన కథానాయకు డిగా నటించిన 'మిరాయ్' చిత్రం ఇటీవలే విడుద లైంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రానికి చక్కని ఆదరణ లభిస్తోందని యూనిట్ తెలిపింది. చిత్రబృందం శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహిం చింది. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లా డుతూ 'ఇది నాకు దాదాపు 12 ఏళ్ల తర్వాత వచ్చిన సక్సెస్. అభినందిస్తూ వచ్చే కాల్స్‌తో నా ఫోన్ నిరం తరం మోగుతూనే ఉంది. ఈ కథలో భాగం చేసినం దుకు కార్తీక్‌కు రుణపడి ఉంటాను' అని చెప్పారు. కార్తీక్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం టీమ్ అంతా నాలుగేళ్లు కష్టపడ్డాం. నాపైన నమ్మకం ఉంచిన విశ్వప్రసాద్‌కి ధన్యవాదాలు' అని అన్నారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'గతేడాది మాకు అంతగా కలసిరాలేదు. 'మిరాయ్' సక్సెస్ మరెన్నో మంచి చిత్రాలు చేసేందుకు ఎనర్జీ ఇచ్చింది. కార్తీక్, తేజ కమిట్మెంట్‌తో పనిచేశారు. మా అమ్మాయి కృతి ప్రసాద్ ఈ సినిమాతో నిర్మాతగా మారారు. తను మా అదృష్ట దేవత' అని ప్రశంసించారు.

మైదానంలో సమరం

ఆసియా కప్


సూర్య

నేడు పాకిస్థాన్‌తో భారత్ పోరు

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఆసియాకప్ మొదలై వారం కావొస్తున్నా జోష్ ఎక్కడ? పైగా అన్నీ ఏకపక్ష మ్యాచ్‌లే.. అంటూ అభిమానులు పెదవి విరుస్తున్న వేళ, ఈ టోర్నీలో అసలు సిసలైన మ్యాచ్‌కు నేడు తెర లేవనుంది. సండే బ్లాక్‌బస్టర్‌గా అలరించనున్న ఈ సమరంలో దాయాదులు భారత్-పాకిస్థాన్ జట్లు ఢీకొనబోతున్నాయి. 'ఆపరేషన్ సింధూర్' తర్వాత పాక్‌తో మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న వేళ.. ఇరు దేశస్థుల భావోద్వేగాలు తీవ్ర స్థాయిలో ఉన్న తరుణాన.. ఎడారి దేశంలో ఎవరిది పైచేయి కానుందో చూడాల్సిందే!

దుబాయ్: అంతర్జాతీయ టోర్నీల్లో భారత్-పాకిస్థాన్ జట్లు తలపడడం చూస్తూనే ఉంటాం. కానీ ఈసారి ఇరు జట్ల మధ్య మ్యాచ్ ప్రత్యేక పరిస్థితుల్లో జరుగబోతోంది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణమే నెలకొంది. అందుకే పాక్‌తో క్రికెట్ ఆడడం అవసరమా? అని ఇప్పటికే భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలు రాజకీయ పార్టీలు కూడా దీనిపై గళమెత్తుతున్నాయి. ఇలాంటి తరుణంలో పాక్‌తో పోరుకు టీమిండియా సిద్ధమైంది. యుద్ధభూమిలోనే కాదు మైదానంలోనూ పాక్ భరతం పట్టేందుకు సూర్యకుమార్ నేతృత్వంలోని భారత యువ ఆటగాళ్లు ఎదురు చూస్తున్నారు. మరోవైపు సీనియర్ ఆటగాళ్లు లేకపోవడంతో పాక్ జట్టు కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయితే జట్టులో స్పిన్నర్లు రాణిస్తుండడం వాళ్లకు సానుకూలాంశం. కాగా.. 2023 తర్వాత భారత్ ఆడిన మొత్తం 39 టీ20ల్లో 27 మ్యాచ్‌లు గెలవడం పొట్టి ఫార్మాట్‌లో మన ఆధిపత్యాన్ని చాటి చెబుతోంది. ఇక, ఇరు జట్ల మధ్య ఓవరాల్‌గా 13 టీ20లు జరిగితే.. భారత్ తొమ్మిది మ్యాచుల్లో, పాక్ మూడింటిలో నెగ్గింది. ఓ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఫేవరెట్‌గా బరిలోకి..

పాక్‌తో పోల్చుకుంటే ప్రపంచ అగ్రశ్రేణి బ్యాటర్లతో కూడిన భారత జట్టు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. వరల్డ్ నెంబర్‌వన్ అభిషేక్, గిల్ తొలిసారి దాయాదితో టీ20 ఆడబోతున్నారు. ఈ జోడీ దూకుడుకు మిడిలార్డర్‌లో సూర్యకుమార్, తిలక్, హార్దిక్, దూబేల హిట్టింగ్ తోడైతే పాక్ బౌలర్లకు కష్టాలు తప్పవు. బౌలింగ్‌లో స్టార్ పేసర్ బుమ్రా పదునైన బంతులకు స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్, వరుణ్ చక్రవర్తిల మ్యాజిక్ స్పెల్ తోడైతే ప్రత్యర్థి బ్యాటర్లు ఉక్కిరిబిక్కిరి కావాల్సిందే. అయితే పొట్టి ఫార్మాట్ అంటే అనిశ్చితికి మారుపేరు కాబట్టి అవతలి జట్టు ఎంత బలహీనంగా కనిపించినా.. దాడి మాత్రం గట్టిగానే ఉండాలనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. కెప్టెన్ సూర్య కూడా తమలో దూకుడు ఏమాత్రం తగ్గదని టోర్నీ ఆరంభంలోనే స్పష్టంగా చెప్పాడు. అయితే పాక్‌పై ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో సూర్య 64 పరుగులే సాధించడం గమనార్హం.


తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), శాంసన్, దూబే, హార్దిక్, అక్షర్, కుల్దీప్, బుమ్రా, వరుణ్.

పాకిస్థాన్: ఫర్హాన్, సయీమ్ అయూబ్, ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), హసన్ నవాజ్, మహ్మద్ హారీస్, మహ్మద్ నవాజ్, ఫహీమ్ అష్రాఫ్, షహీన్ అఫ్రీది, అబ్రార్ అహ్మద్, సుఫియాన్.

పిచ్

ఆరంభంలో కొత్త బంతి స్వింగ్ అయ్యే చాన్సుంది. అయితే మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపగలరు. టాస్ గెలిచిన కెప్టెన్ బౌలింగ్ ఎంచుకోవచ్చు.



పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా

పోటీ ఏమేరకు?

తాజా పాక్ జట్టు లైనప్‌ను గమనిస్తే బహుశా ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్ల పేర్లు తప్ప ఇతరుల గురించి క్రికెట్ అభిమానులకు అంతగా తెలిసి ఉండకపోవచ్చు. స్టార్ ఆటగాళ్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్‌లపై వేటు వేసి ఎక్కువ మంది కొత్తవారితో జట్టును ఎంపిక చేశారు. కొత్త కెప్టెన్ సల్మాన్ ఆఘా నేతృత్వంలోని ఈ జట్టు.. ఓపెనర్ సయీమ్ అయూబ్, ఫఖర్ జమాన్, మహ్మద్ హారీస్‌ల బ్యాటింగ్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంది. బౌలింగ్‌లో పేసర్ షహీన్ అఫ్రీదితో పాటు స్పిన్‌లో మహ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సుఫియాన్ కీలకం కానున్నారు. అన్ని విభాగాల్లో భారత్‌కన్నా కాస్త బలహీనంగా కనిపిస్తున్న పాక్ జట్టు ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఏమేరకు పోటీనివ్వగలదో చూడాలి.

లంక ఆల్‌రౌండ్ షో

ఆసియాకప్‌లో బంగ్లాపై ఘన విజయం

అబుధాబి: ఆసియాకప్‌లో శ్రీలంక జట్టు తమ తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబర్చింది. తద్వారా శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ గ్రూప్ బి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 20 ఓవర్లలో 139/5 స్కోరుకే పరిమితమైంది. మొదటి రెండు ఓవర్లలోనే జట్టు ఖాతా కూడా తెరువకుండా రెండు వికెట్లు కోల్పోయింది. అయితే చివర్లో షమీమ్ (42 నాటౌట్), జకెర్ అలీ (41 నాటౌట్) మెరుపు ఆటతో ఆరో వికెట్‌కు అజేయంగా 86 పరుగులు జోడించారు. హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంక 14.4 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నిస్సాంక (50) అర్ధసెంచరీతో రాణించాడు. కమిల్ మిషారా (46 నాటౌట్) అజేయంగా నిలిచాడు. మెహెదీ హసన్ రెండు వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కమిల్ మిషారాకు లభించింది.


హీలీ హర్మన్

ప్రతీకారం తీరేనా?

నేడు ఆసీస్‌తో భారత మహిళల వన్డే

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ముల్లన్‌పూర్ (చండీగఢ్): గతేడాది ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల జట్టుకు వన్డేల్లో 0-3తో ఘోర పరాభవం ఎదురైంది. ఇప్పుడు ఆ ఓటమికి హర్మన్‌ప్రీత్ సేన స్వదేశంలో బదులు తీర్చుకోవాలనుకుంటోంది. ఆదివారం నుంచి ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ మ్యాచ్‌లను రానున్న వన్డే వరల్డ్‌కప్ సన్నాహకంగానూ ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. ఇటీవలి కాలంలో భారత మహిళలు ఐర్లాండ్, శ్రీలంకలో ముక్కోణపు సిరీస్, ఇంగ్లండ్‌తో వన్డే, టీ20ల్లో సిరీస్‌లను గెలిచి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇదే ఊపులో అలీసా హీలీ సారథ్యంలోని ఆసీస్‌పై పైచేయి సాధించాలనుకుంటున్నారు. ఇక, 9 నెలల విరామం తర్వాత భారత పేసర్ రేణుకా సింగ్ బరిలోకి దిగబోతోంది.

సెంట్రల్ 511

● యష్ 194

● దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్‌కు 362 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. యష్ రాథోడ్ (194) తృటిలో డబుల్ సెంచరీ కోల్పోగా, సారాంశ్ (69) అర్ధసెంచరీ సహాయంతో సెంట్రల్ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులు సాధించింది. గుర్జప్‌నీత్, అంకిత్‌లకు నాలుగేసి వికెట్లు లభించాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌత్ జోన్ శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 129/2 స్కోరుతో నిలిచింది. క్రీజులో స్మరణ్ (37 బ్యాటింగ్), రికీ భుయ్ (26 బ్యాటింగ్) ఉండగా, ఇంకా 233 పరుగులు వెనుకంజలో ఉంది.

మ్యాచ్ బహిష్కరణ డిమాండ్‌కు పంజాబ్ కింగ్స్ వినూత్న ట్విస్ట్!



న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో ఆదివారం జరిగే మ్యాచ్‌ను టీమిండియా బహిష్కరించాలనే డిమాండ్ భారత్‌లో పెద్దఎత్తున వినిపిస్తోంది. చాలామంది క్రికెట్ ఫ్యాన్స్ ఆ మ్యాచ్‌ను తాము తిలకించబోమని సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తున్నారు. పలువురు సెలబ్రిటీలు కూడా వారి బాటలో నడిచారు. తామూ ఇండో-పాక్ పోరును చూడబోమని స్పష్టంజేశారు. ఈక్రమంలో ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ 'మ్యాచ్ బాయ్‌కాట్‌'ను వినూత్నంగా ప్రదర్శించింది. కెప్టెన్ సూర్యకుమార్ ఫొటోతో 'డిఫెండింగ్ చాంపియన్ ఇండియా మ్యాచ్ అంటూ ప్రత్యర్థి స్థానాన్ని 'ఖాళీ'గా చూపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనికి పాకిస్థాన్ సూపర్ లీగ్ జట్టు కరాచీ కింగ్స్ చెస్ ఆట నేపథ్యంగా స్పందించింది. చెస్ బోర్డుకు ఓవైపు పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సల్మాన్ ఆఘా ఫోటోను గ్రాఫిక్ డిజైన్ చేసి..భారత్ స్థానాన్ని ఖాళీగా ఉంచింది.

యోధాస్‌పై జైపూర్ విజయం

జైపూర్: సొంత గడ్డపై ప్రొ. కబడ్డీ లీగ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ తొలి విజయం అందుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో 41-29తో యూపీ యోధాస్‌ను ఓడించింది. నితిన్ కుమార్ సూపర్ 10 సాధించాడు. రైడర్ అలీ 9 పాయింట్లు రాబట్టాడు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 39-33తో తెలుగు టైటాన్స్‌పై నెగ్గింది.

టైటిల్‌కు అడుగు దూరంలో..

ఫైనల్లో సాత్విక్ జోడీ, లక్ష్య

హాంకాంగ్ ఓపెన్



సాత్విక్ చిరాగ్

హాంకాంగ్: కొన్నాళ్లుగా టైటిల్ వేటలో వెనుకంజలో నిలిచిన భారత షట్లర్లు హాంకాంగ్ ఓపెన్‌లో డబుల్ ధమాకా సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. శనివారం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో లక్ష్య 23-21, 22-20 చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 9వ ర్యాంకర్ చో తిన్ చెన్‌ను ఓడించాడు. దాదాపు గంటసేపు సాగిన ఉత్కంఠపోరులో మూడో సీడ్ చో తిన్ నుంచి గట్టి పోటీ ఎదురైనా.. లక్ష్య దీటుగా విజృంభించి విజయం సాధించాడు. సూపర్ 500 టోర్నీలో ఫైనల్ చేరడం 23 ఏళ్ల లక్ష్య సేన్‌కు ఇది గత రెండేళ్లలో తొలిసారి కావడం గమనార్హం. అతను చివరిగా 2023 జులైలో కెనడా ఓపెన్‌లో టైటిల్ పోరుకు చేరాడు. 20వ ర్యాంకరైన లక్ష్య.. ఆదివారం జరిగే ఫైనల్లో రెండో సీడ్ లి షి ఫెంగ్ (చైనా)తో తలపడనున్నాడు. ఇక, పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 21-17, 21-15తో చైనీస్ తైపీ జంట బింగ్ వీ లిన్/చెన్ చెంగ్ కువాన్‌పై గెలిచింది. ఇటీవల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన సాత్విక్ ద్వయం ఈ సీజన్‌లో ఓ టోర్నీ ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి. టైటిల్ పోరులో ఒలింపిక్స్ రజత పతక విజేత, చైనా జంట లియాంగ్ వీ కెంగ్/వాంగ్ చాంగ్‌తో సాత్విక్ జోడీ అమీతుమీ తేల్చుకోనుంది.


లక్ష్యసేన్

ఇషా గోల్డెన్ షూట్

ప్రపంచ కప్‌లో స్వర్ణం కైవసం

నింగ్బో (చైనా): తెలుగు షూటర్ ఇషా సింగ్ అంతర్జాతీయ వేదికపై అదరగొట్టింది. హైదరాబాద్‌కు చెందిన 20 ఏళ్ల ఇషా.. ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో పసిడి మోత మోగించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో చాంపియన్‌గా నిలిచింది. శనివారం ఇక్కడ ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో ఇషా.. 0.1 పాయింట్ తేడాతో స్థానిక ఫేవరెట్ షూటర్ యావో కియాన్‌గ్జున్‌ను ఓడించి స్వర్ణ పతకం పట్టేసింది. ఇషా మొత్తం 242.6 పాయింట్లతో అగ్ర స్థానం దక్కించుకోగా.. కియాన్‌గ్జున్ 242.5 స్కోరుతో రజతంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన ఒలింపిక్ చాంపియన్ వో యెజిన్ 220.7 స్కోరుతో కాంస్య పతకానికి పరిమితమైంది. ప్రపంచ కప్‌లో ఇషాకు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. ఇక పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు భవేశ్ షెఖావత్ 22వ, ప్రదీప్‌సింగ్ షెఖావత్ 23వ, మన్‌దీప్ సింగ్ 39వ స్థానాల్లో నిలిచి నిరాశపరిచారు.



ఫైనల్లో భారత్

చైనాతో ఢీ నేడు మహిళల ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): భారత మహిళల జట్టు ఆసియా కప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో పోరును మన మహిళలు 1-1తో డ్రా చేశారు. అయితే సూపర్-4 చివరి మ్యాచ్‌లో ఆతిథ్య చైనా 1-0తో కొరియాను ఓడించడంతో..భారత జట్టు తుదిపోరుకు క్వాలిఫై అయ్యింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో చైనాతో భారత మహిళలు అమీతుమీ తేల్చుకుంటారు.

ఏడు గంటలు పోరాడినా..

● స్విస్ చెస్‌లో నిహాల్‌కు ఓటమే

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ ఏడు గంటలు పోరాడాడు. అలీరెజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను 82 ఎత్తులవరకు తీసుకెళ్లినా సరీన్‌కు ఓటమి తప్పలేదు. అర్జున్ ఇరిగేసి.. సామ్ సెవియన్‌పై గెలిచాడు. ప్రజ్ఞానంద గేమ్ డ్రాగా ముగిసింది. మహిళల విభాగంలో..హారిక, వైశాలి ప్రత్యర్థులతో పాయింట్లు పంచుకున్నారు.

పసిడి పోరుకు మీనాక్షి

ప్రపంచ బాక్సింగ్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మరో భారత బాక్సర్ స్వర్ణ పతక పోరులో అడుగుపెట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో మీనాక్షి హుడా ఫైనల్‌కు దూసుకు పోయింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో మీనాక్షి 5-0తో మంగోలియాకు చెందిన లుట్సైఖనీ అల్టాన్‌సెట్సెగెని చిత్తు చేసింది. ఈ పోటీలలో ఫైనల్‌కు చేరిన మూడో భారత్ బాక్సర్ మీనాక్షి. ఇంతకుముందు..జైస్మిన్ లంబోరియా (57 కి.), నూపుర్ షెరాన్ (80+కి.) టైటిల్ ఫైట్‌కు చేరిన సంగతి తెలిసిందే. 80+కి. కేటగిరీ సెమీఫైనల్లో షెరాన్ 5-0తో సెమా డుజ్టస్ (టర్కీ)పై గెలిచింది. దాంతో మీనాక్షి, జైస్మిన్, నూపుర్ కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నారు. ఇక మహిళల 80 కిలోల విభాగంలో పూజారాణి సెమీఫైనల్లో ప్రవేశించింది. దాంతో ఆమెకు కనీసం కాంస్య పతకం లభించనుంది. మొత్తంగా..ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి.

సందీప్, ప్రియాంక విఫలం

వరల్డ్ అథ్లెటిక్స్

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తొలిరోజు భారత్‌కు నిరాశజనక ఫలితాలు ఎదురయ్యాయి. శనివారం జరిగిన 35 కిలో మీటర్ల రేస్‌వాక్‌లో సందీప్ కుమార్, ప్రియాంక గోస్వామి విఫలమయ్యారు. పురుషుల 35 కిలో మీటర్ల రేస్‌వాక్‌లో సందీప్ కుమార్ 23వ స్థానంలో నిలిచాడు. మహిళల 35 కి.మీ. విభాగంలో ప్రియాంక 24వ స్థానంతో సరిపెట్టుకుంది. మరో భారత రేస్ వాకర్ రాంబాబు డిస్‌క్వాలిఫై అయ్యాడు. పురుషుల విభాగంలో కెనడా, బ్రెజిల్, జపాన్, మహిళల కేటగిరీలో స్పెయిన్, ఇటలీ, ఈక్వెడార్ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నాయి. మహిళల 1500 మీటర్ల పరుగులో పూజ 11వ స్థానంలో నిలిచి సెమీస్ చేరడంలో విఫలమైంది. ఇక..మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో అంతర్జాతీయ స్టార్లు షకారి రిచర్డ్‌సన్, షేరికా జాక్సన్ సెమీస్‌కు చేరారు. పురుషుల 100 మీ.లలో నోవా లైల్స్, కిషానె థాంప్సన్ సెమీఫైనల్లో అడుగుపెట్టారు.

నేటి భారత్ షెడ్యూల్
మ. 3.10: పురుషుల హైజంప్ క్వాలిఫికేషన్స్ - సర్వేశ్,
సా. 6: పురుషుల 10వేల మీటర్ల రేసు - గుల్వీర్ సింగ్.

వారసత్వంగా వచ్చిన ఆభరణాలపై పన్ను పోటు ఉంటుందా?



మన దేశంలోని సంపన్నులు, మధ్య తరగతి వర్గాలకు బంగారు ఆభరణాలు కూడా ప్రధాన ఆస్తే. వీరిలో చాలా మంది తమ తర్వాత లేదా తమ జీవిత కాలంలో తమ ఆభరణాలను వారి కుటుంబ సభ్యులకు బదిలీ చేస్తుంటారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వారసత్వ ఆభరణాలపైనా పన్ను పోటు తప్పదు. కొద్దిగా జాగ్రత్త పడితే ఈ పన్ను పోటు నుంచి తప్పించుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.

మన సంస్కృతి, సంప్రదాయాల్లో బంగారం, బంగారు ఆభరణాలు ఒక భాగం. పిల్లల పెళ్లిళ్ల ఆ మాటకొస్తే మన దేశంలో జరిగే ప్రతి శుభకార్యమూ వీసమెత్తు బంగారమైనా లేకుండా పూర్తి కాదు. చాలా కుటుంబాల్లో బంగారం, వెండి లేదా వాటితో చేసిన ఆభరణాలు ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతుంటాయి. ఇలా వారసత్వంగా వచ్చిన ఆభరణాలను ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక అవసరం కోసం అమ్మాల్సి రావచ్చు. అప్పుడు ఈ అమ్మకాలపై పన్ను పోటు తప్పదు. అయితే కొన్ని జాగ్రత్తల ద్వారా ఈ పోటు నుంచి బయటపడవచ్చు.

పన్ను ప్రభావం

ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వారసత్వంగా సంక్రమించిన బంగారం, వెండి లేదా వాటితో చేసిన ఆభరణాలను 'ఆదాయం'గా పరిగణించదు. కాబట్టి వారసత్వంగా వాటిని అందుకున్న వ్యక్తులపై వెంటనే ఎలాంటి పన్ను పోటు ఉండదు. ఐటీ చట్టంలోని సెక్షన్ 47 (iii), సెక్షన్ 56 (2) (ఎక్స్) ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

పన్ను ఎప్పుడు?

వారసత్వంగా వచ్చిన ఆభరణాలను అమ్మినప్పుడు మాత్రమే పన్ను వర్తిస్తుంది. అది కూడా ఆ అమ్మకంపై వచ్చిన మూలధన లాభాల (సీజీటీ) ఆధారంగా నిర్ణయిస్తారు.

పన్ను లెక్కింపు ఇలా

ఎవరి నుంచి ఈ ఆభరణాలు సంక్రమించాయో వారు కొనుగోలు చేసిన ధర లేదా 2001 ఏప్రిల్ 1 కంటే ముందు కొనుగోలు చేసి ఉంటే 2001 ఏప్రిల్ 1 నాటికి ఉన్న సముచిత మార్కెట్ ధర (ఎఫ్ఎంవీ), ఆ ఆభరణాలు ఎంత కాలంగా (హోల్డింగ్ పీరియడ్) వాటిని కొన్న వ్యక్తి, వారసుల వద్ద ఉన్నాయనే అంశాల ఆధారంగా ఈ మూలధన లాభాలను స్వల్ప (ఎస్‌టీసీజీ) లేదా దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ)గా లెక్కిస్తారు.

పరిగణనలోకి తీసుకునే అంశాలు

● ద్రవ్యోల్బణ వ్యయ సూచీ (సీఐఐ) ఆధారిత ఇండెక్సెడ్ కాస్ట్ ఆఫ్ అక్విజిషన్ (ఐసీఏ)
● 20 శాతం ఎల్‌టీసీజీ+సర్‌చార్జీ+హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్

ఉదాహరణ: ఆభరణాల అమ్మకం ధర - ఐసీఏ=ఎల్‌టీసీజీ

ఎల్‌టీసీజీ x 20 శాతం (+సర్‌చార్జి) = చెల్లించాల్సిన పన్ను

మూలధన ఆస్తులు అంటే?

మూలధన ఆస్తులు అంటే ఏంటో ఐటీ చట్టంలోని సెక్షన్2 (14) స్పష్టంగా నిర్వచించింది. ఇళ్లు, భూములతో పాటు బంగారం, వెండి, ప్లాటినం లేదా ఏ ఇతర విలువైన లోహాలతో చేసిన ఆభరణాలను కూడా మూలధన ఆస్తులుగానే పరిగణిస్తారు. వీటి అమ్మకాలపై వచ్చే లాభాలనూ మూలధన లాభాలుగానే చూస్తారు. ఏదైనా మిశ్రమ లోహాల్లో బంగారం, వెండి, ప్లాటినం లేదా విలువైన రాళ్లు పొదిగి చేసినా, అవి కూడా ఆభరణాల పరిధిలోకే వస్తాయి.

పన్ను రేటు

గత ఏడాది.. జూలై 2023 కంటే ముందు వారసత్వ ఆభరణాలను మూడేళ్లలోపు అమ్మితే వచ్చిన లాభాలను స్వల్పకాలిక మూలధన లాభాలు (ఎస్‌టీసీజీ)గా పరిగణించి, ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను విధించే వారు. మూడేళ్ల కంటే ఎక్కువ కాలం ఉంచుకుని అమ్మితే వచ్చిన లాభాలను ఇండెక్సేషన్ ప్రయోజనంతో కలిపి 20 శాతం చొప్పున దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను విధించేవారు. అయితే గత ఏడాది జూలై 23 నుంచి ఎల్‌టీసీజీ గడువును రెండేళ్లకు కుదించారు. పన్ను పోటును ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5 శాతానికి తగ్గించారు. వారసత్వంగా వచ్చిన ఆభరణాలను రెండేళ్ల లోపు అమ్మితే వచ్చే స్వల్పకాలిక మూలధన లాభాలపై మాత్రం ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు.

మినహాయింపులు, పొదుపు ఆప్షన్లు

● ఈ ఆభరణాలను విక్రయించగా వచ్చిన మూలధన లాభాలను ఏడాదిలోగా లేదా బదిలీ జరిగిన రెండేళ్లలోగా నివాస గృహ ఆస్తుల కొనుగోలుకు ఉపయోగిస్తే ఐటీ చట్టంలోని సెక్షన్ 54 ఎఫ్ కింద పూర్తి పన్ను మినహాయింపు పొందవచ్చు. అయితే మన దేశంలోని ఆస్తుల కొనుగోళ్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

● ఆభరణాలు అమ్మగా వచ్చిన మూలధన లాభాలను మూడేళ్ల లోపు సొంతింటి నిర్మాణానికి వినియోగించినా రూ.10 కోట్ల వరకు ఈ మినహాయింపు లభిస్తుంది.

● ఆభరణాలను అమ్మగా వచ్చిన లాభాల్లో రూ.30 లక్షల వరకు భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) లేదా గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఈసీ) జారీ చేసే క్యాపిటల్ బాండ్స్‌లో మదుపు చేసినా సెక్షన్ 54 ఈసీ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. కాకపోతే ఈ పెట్టుబడిని ఆభరణాలు అమ్మిన ఆరు నెలల్లోగా పూర్తి చేయాలి.

జోరుగా ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్

● ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా రిటర్న్‌లు

● సోమవారమే ఆఖరి రోజు

ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ ప్రక్రియ జోరందుకుంది. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై)కు సంబంధించి ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా ఐటీ రిటర్న్‌లు దాఖలైనట్టు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ శనివారం ప్రకటించింది. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఆడిట్ అవసరం లేని సంస్థలు సోమవారం లోగా పెనాల్టీ లేకుండా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు. 'ఇప్పటి వరకు ఆరు కోట్లకుపైగా ఐటీ రిటర్న్‌లు ఫైల్ అయ్యాయి. ఫైల్ అయినా రిటర్న్‌లను ఇంకా లెక్కిస్తున్నాం. ఈ మైలురాయిని అందుకునేందుకు సహకరించిన పన్ను చెల్లింపుదారులు, వృత్తి నిపుణులకు కృతజ్ఞతలు' అని ఐటీ శాఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది. రిటర్న్‌ల ఫైలింగ్, పన్ను చెల్లింపులు, ఇతర విషయాల్లో పన్ను చెల్లింపుదారులకు అవసరమైన సాయం అందించేందుకు తమ 'హెల్ప్ డెస్క్' 24 గంటలూ పని చేస్తున్నట్టు ఐటీ శాఖ తెలిపింది. ఇంకా తమ రిటర్న్‌లు ఫైల్ చేయని వ్యక్తులు, సంస్థలు సోమవారం వరకు వేచి చూడకుండా వెంటనే తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలని ఐటీ శాఖ కోరింది.

న్యూమోనియా కోసం దేశీయ ఔషధం

ఓఢ్ లైఫ్‌సైన్సెస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఓఢ్ లైఫ్‌సైన్సెస్ పిల్లల్లో వచ్చే న్యూమోనియా వ్యాధి చికిత్స కోసం దేశీయ పరిజ్ఞానంతో ప్రత్యేక ఔషధాన్ని అభివృద్ధి చేస్తోంది. ఎవోనెమ్-04 పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ ఔషధానికి కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు చెందిన టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు (టీడీబీ) రూ.19.5 కోట్లు మంజూరు చేసింది. ప్రీ క్లినికల్ పరీక్షలు పూర్తయిన ఈ ఔషధాన్ని త్వరలోనే మనుషులపై పరీక్షిస్తామని కంపెనీ తెలిపింది. ఎవోనెమ్-04 అనే ఈ యాంటీబయోటిక్ నెబ్యులైజేషన్ సస్పెన్షన్ ఔషధం పిల్లల్లో వచ్చే న్యూమోనియాను తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేయడంతో పాటు యాంటీమైక్రోబియల్ రెసిస్టెంట్‌గానూ పని చేస్తుందని కంపెనీ తెలిపింది. మన దేశంతో పాటు అనేక దేశాల్లో పిల్లలను కబళిస్తున్న అనారోగ్య సమస్యల్లో న్యూమోనియా ఒకటి. అందుబాటు ధరలో లభించే తమ ఎవోనెమ్-04 ఔషధం ఈ సమస్యను అధిగమించడంలో సమర్థవంతంగా ఉపయోగపడుతుందని కంపెనీ పేర్కొంది.

బిజినెస్ ప్లస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	535
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	135
కరీంనగర్	121	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	125
కర్నూలు	121	నెల్లూరు	130
విశాఖపట్నం	144	అనంతపురం	130
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,170 ▼	1,01,900 ▼	1,42,000 ▲
విజయవాడ	1,13,500 ▲	1,07,000 ▲	1,32,800 ▲
విశాఖపట్నం	1,10,510 ▲	1,01,300 ▲	1,43,000 ▲
రాజమండ్రి	1,11,160 ▼	1,01,900 ▼	1,31,600 ▲
ప్రొద్దుటూరు	1,13,300 ▲	1,04,240 ▲	1,32,000 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

కేటీఆర్‌పై 100 కోట్ల పరువు నష్టం దావా

» ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారు

» ఓయూ పీఎస్‌లో కాంగ్రెస్ నేత చనగాని ఫిర్యాదు


ఓయూ సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1పై ప్రభుత్వ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే ఆయనపై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ హెచ్చరించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై శనివారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గ్రూప్-1 పోస్టులను రూ.3 కోట్లకు అమ్ముకున్నారని నిరాధార ఆరోపణలు చేసిన కేటీఆర్.. 24 గంటల్లో ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రూప్-1 పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వానికి స్పష్టత లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యువతకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం ఎదురుచూస్తున్నారని, యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆమరణ దీక్షకు దిగకముందే ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇవ్వాలన్నారు. ఈ మేరకు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వానికి రాంచందర్‌రావు విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లది మోసం: బండి సంజయ్

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు యువతను మోసం చేశాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పోటీ పరీక్షలను సైతం సక్రమంగా నిర్వహించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, విద్యాసంస్థలు మూత పడుతున్నాయని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సంజయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గ్రూప్-1పై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

» ఉద్యోగానికి మంత్రులు రూ.లక్షల్లో లంచం అడిగారని విద్యార్థులు చెబుతున్నారు: హరీశ్ రావు



సిద్దిపేట సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రూప్-1 ఉద్యోగానికి మంత్రులు, అధికారులు రూ.లక్షల్లో లంచం అడిగారంటూ నిరుద్యోగులు చెబుతున్నారని తెలిపారు. శనివారం సిద్దిపేటలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. పరీక్షలు ఇంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తారా? అంటూ హైకోర్టు ప్రభుత్వంపై మొట్టికాయలు వేసిందన్నారు. ప్రభుత్వం తప్పును సరిదిద్దుకోకుండా అప్పీల్‌కు వెళతామనడం మూర్ఖత్వమే అవుతుందని ఆయన విమర్శించారు.

సింగరేణిలో ప్రమాదం.. కార్మికుడికి తీవ్ర గాయాలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియా పరిధిలోని సింగరేణి కేటీకే 6 ఇన్‌క్లైన్ గనిలో బొగ్గు పెళ్ల పడి ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లికి చెందిన రాదండి మొండయ్య కోల్ కట్టర్‌గా పని చేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా శనివారం మొదటి షిఫ్ట్‌కు హాజరయ్యాడు. తోటి కార్మికులతో కలిసి పనులు చేస్తుండగా పైకప్పు నుంచి భారీ బొగ్గు పెళ్ల కూలి అతడి కాలిపై పడగా తీవ్ర గాయమైంది. ఈ ఘటనలో ఓవర్‌మన్ మనోజ్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో హుటాహుటిన వీరిని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పేరుతో రైతుల శవాలపై రోడ్లు వేస్తారా?

» బలవంతంగా భూములు లాక్కోవద్దు: కూనంనేని

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరిట రైతుల శవాలపై రోడ్లు వేస్తారా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆత్మగౌరవంతో జీవించే రైతుల భూములను రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి బలవంతంగా సర్కారు లాక్కోవడం సరికాదన్నారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కారు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. సంగారెడ్డి-చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్‌లో అవకతవకలు, నష్టపరిహారంపై రైతుల ఉద్యమానికి మద్దతుగా నిలిచి, బాధితుల పక్షాన పోరాడతామని పేర్కొన్నారు. ఓఆర్ఆర్‌కు సమాంతరంగా ఆర్ఆర్ఆర్‌ను తీసుకోవాలన్న నిబంధనను ఉల్లంఘించి.. కొన్ని పరిశ్రమలను కాపాడేందుకు అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. వాస్తవ పరిస్థితిపై సర్కారుకు లేఖ రాస్తానని, న్యాయమైన ఒప్పందం కుదిరే వరకూ పోరాటం చేయాలని రైతులకు సూచించారు.

ప్రాణాలు తీసిన యూరియా సంచి

» వాగులో మునిగి తల్లీకొడుకు, మరో ఇద్దరు చిన్నారుల మృతి

వాంకిడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా సంచులు కడిగేందుకు వాగుకు వెళ్లిన నలుగురు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. కుమరంభీం జిల్లా వాంకిడి మండలం దాబా గ్రామ సమీపంలోని వాగులో శనివారం ప్రమాదవశాత్తు నీట మునిగి తల్లి, కుమారుడు, మరో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. దాబా గ్రామానికి చెందిన మోహర్లే మహేందర్, నిర్మలాబాయి(33) దంపతులకు కుమార్తె లలిత(14), కుమారుడు గణేశ్(12) ఉన్నారు. యూరియా సంచులు కడిగేందుకు నిర్మలాబాయితో పాటు లలిత, గణేశ్ వీరి సమీప బంధువులు ఆదే శేఖర్ కుమార్తె శశికళ(8), వాడైవార్లు కుమార్తె మహేశ్వరి(10)సమీపంలోని వాగుకు వెళ్లారు. యూరియా సంచులు కడుగుతున్న సమయంలో ఒక సంచి నీటిలో కొట్టుకుపోయింది. గణేశ్ సంచిని పట్టుకోవడానికి వెళ్తున్న క్రమంలో వాగులో నీరు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. కుమారుడిని కాపాడేందుకు వెళ్లిన తల్లి నిర్మలాబాయి సైతం నీటిలో మునిగిపోయింది. వాగు ఒడ్డున ఉన్న శశికళ, మహేశ్వరి కూడా వారి కోసం నీటిలో దిగి మునిగిపోయారు. సమీపంలోఉన్న లలిత.. తండ్రికి, స్థానికులకు సమాచారం అందించింది. గ్రామస్థులు అక్కడికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు.

సింగరేణిలో ఆపరేటర్లుగా మహిళలకు అవకాశం

» సీఎండీ బలరాం కీలక నిర్ణయం

కొత్తగూడెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ యంత్రాల ఆపరేటర్లుగా మహిళలకు అవకాశం కల్పించాలని సింగరేణి సంస్థ నిర్ణయించింది. ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్లు, బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. అర్హత ఉన్న మహిళా ఉద్యోగులు సంబంధిత గని మేనేజర్లకు లేదా శాఖాధిపతికి దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. ఈ దరఖాస్తులను జనరల్ మేనేజర్ సీపీపీ (చీఫ్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) నేతృత్వంలోని ఒక కమిటీ పరిశీలిస్తుంది. ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరీ-5లో నియమిస్తారు.

ఎటు చూసినా రైలు!

రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్న రైలు మార్గం

» 40 ప్రాజెక్టులు.. 4,353 కి.మీ.కు రూ.81 వేల కోట్ల ఖర్చు

» కొత్త లైన్లకు సర్వేలు.. ఉన్నవి విస్తరణ.. వివిధ దశల్లో మరిన్ని

» కేంద్ర ప్రభుత్వం మంజూరు.. సీఎం రేవంత్ రెడ్డితో చర్చ


» హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నైకి హైస్పీడ్ కారిడార్, 362 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రైల్‌పైనా సమీక్ష



హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి గద్వాల వరకు.. వికారాబాద్ నుంచి భద్రాచలం వరకు రాష్ట్రవ్యాప్తంగా రైలు మార్గం మరింత విస్తరించనుంది. ఇప్పటికే ఉన్న రూట్లలో లైన్లను మరింత విస్తరించనున్నారు! కొత్తగా మరిన్ని ప్రాంతాల్లో రైల్వే లైన్లు రానున్నాయి! ఇప్పటికే డీపీఆర్ ఆమోదం పొందిన ప్రాంతాల్లో వివిధ దశల్లో పనులు నడుస్తున్నాయి. వెరసి.. రాబోయే పది, పన్నెండేళ్లలో రాష్ట్రంలో ఎటు చూసినా ఏదో ఒక రైలు మార్గం ఉండనుంది. హైస్పీడు రైలు మార్గాలు, వాటి పక్కనే గ్రీన్‌ఫీల్డ్ రహదారులతోపాటు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు తెలంగాణ మీదుగా ఇతర రాష్ట్రాలకు అనుసంధానించేలా పలు ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్త, విస్తరణ దశలో ఉన్న, పనులు కొనసాగుతున్న 40 ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. వీటి నిర్మాణాలు సుమారు 4,353.26 కి.మీ. మేర కొనసాగనున్నాయి. రాబోయే పది, 12 సంవత్సరాల్లో ఇందుకు దాదాపు రూ.81,680.17 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. ఈ మేరకు తెలంగాణకు మంజూరైన ప్రాజెక్టుల వివరాలన్నింటినీ దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులు రెండు రోజుల కిందట సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు హైస్పీడ్ కారిడార్లతోపాటు రీజినల్ రింగు రైలు మార్గాలపైనా ఈ సమీక్షలో చర్చించారు. కాగా, తెలంగాణ మీదుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరితగతిన పూర్తిచేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి.

భూ సేకరణే ప్రధాన సమస్య


దేశవ్యాప్తంగా రైలు, రోడ్డు మార్గాలను 2047 నాటికి మరింత అభివృద్ధి చేయాలన్న లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కలుపుతూ కొత్త రైలు, రోడ్డు మార్గాలను మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా గడిచిన కొంతకాలంగా తెలంగాణకు దాదాపు రూ.81 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయి. అయితే, రైల్వే లైన్ల నిర్మాణానికి భూ సేకరణే ప్రధాన సమస్య. రాష్ట్రంలో భూముల విలువలు పెరగడం, రియల్ ఎస్టేట్ రోజురోజుకు పుంజుకుంటున్న నేపథ్యంలో భూ సేకరణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూసేకరణకు ఇచ్చే భూములకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువ మేరకు ధరలు లేకపోవడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి భూములు కోల్పోతున్న వారికి పరిహారంతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపిస్తే.. ఈ సమస్య నుంచి గట్టెక్కే అవకాశాలున్నాయి.



సమగ్ర నివేదికలు సమర్పించినవి

ప్రాజెక్టులు 10.. పరిధి 786.56 కి.మీ. ఖర్చు: రూ.16,897.25 కోట్లు


రైలు రూటు	కి.మీ.	నిధులు (రూ.కోట్లలో)
1) డోర్నకల్-మిర్యాలగూడ (కొత్త లైను)	97.45	218.45
2) మణుగూరు-రామగుండం (కొత్త లైను)	207.08	4,014.38
3) కరీంనగర్-హసన్‌పర్తి (కొత్త లైను)	61.80	1.418.60
4) భద్రాచలం- కొవ్వూరు (కొత్త లైను)	151	2,867.99
5) సికింద్రాబాద్- వాడి మూడో లైను	183	3,734.90
6) సికింద్రాబాద్- వాడి నాలుగో లైను పనులు	173	4,453.91
7) వికారాబాద్- పరిగి (డబ్లింగ్)	267.77	5,596.04
8) ముద్ఖేడ్- పింపాలకుట్టి (డబ్లింగ్)	173.28	2,677.24
9) కాజీపేట- సికింద్రాబాద్ (3-4 లైను పనులు)	110.46	2,236.18
10) డోర్నకల్ దగ్గర ఆర్వోఆర్	10.05	320.47



సర్వే దశలో ఉన్న కొత్త ప్రాజెక్టులు..

ప్రాజెక్టులు: 20.. పరిధి: 2,437.89 కి.మీ. నిధులు: రూ.49,163.72 కోట్లు.

1) కాజీపేట-బల్లార్ష నాలుగో లైను పనులు. ఇది తెలంగాణలో 190.14 కి.మీ, మహారాష్ట్రలో 43.86 కి.మీ.
2) కాజీపేట- విజయవాడ 4వ లైను. రాష్ట్రంలో 184 కి.మీ. ఏపీలో 36 కి.మీ.
3) కాజీపేట- వరంగల్ దగ్గర రైల్ ఓవర్ రైల్ నిర్మాణాలు.
4) వాడి- గుంతకల్ (3-4 లైను పనులు). తెలంగాణలో 11.11 కి.మీ. ఏపీలో 93.82, కర్ణాటకలో 125.07 కి.మీ.
5) డోర్నకల్- మణుగూరు 3వ లైను.
6) పెద్దపల్లి- నిజామాబాద్ డబ్లింగ్ పనులు.
7) వికారాబాద్- కృష్ణా మధ్య కొత్త లైను.
8) హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్. రాష్ట్రంలో 230 కి.మీ. ఏపీలో 300, కర్ణాటకలో 96 కి.మీ. ఇది కొత్తలైను.
9) హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్. ఇది కొత్త లైను. రాష్ట్రంలో 180, ఏపీలో 464, తమిళనాడులో 61 కి.మీ పరిధి.
10) పటాన్‌చెరు (నాగలపల్లి)- ఆదిలాబాద్ వయా బోధన్, ఆర్మూర్ సెక్షన్. ఇది కొత్త లైను.
11) డోర్నకల్- గద్వాల వయా సూర్యాపేట, నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి వరకు 296 కి.మీ. ఇది కూడా కొత్త లైను.
12) ఆదిలాబాద్-గడ్‌చండూరు కొత్త లైను. ఇది తెలంగాణలో 35.64 కి.మీ, మహారాష్ట్రలో 34.55 కి.మీ ఉంటుంది.
13) కాచిగూడ (ఉమ్దానగర్)-చిట్యాల- జగ్గయ్యపేట వరకు కొత్త లైను. ఏపీలో 10 కి.మీ, తెలంగాణలో 218 కి.మీ పరిధి.
14) కొండపల్లి నుంచి సత్తుపల్లి వరకు కొత్త లైను. ఇది ఏపీలో 4.87 కి.మీ, తెలంగాణలో 55.02 కి.మీ.
15) కొత్తగూడెం- కిరండోల్ కొత్త లైను. తెలంగాణలో 9.51 కి.మీ, ఏపీలో 12.32 కి.మీ, ఛత్తీస్‌గఢ్‌లో 136.51 కి.మీ.
16) తాండూరు సిమెంట్ క్లస్టర్ - జహీరాబాద్ వరకు కొత్త లైను.
17) భూపాలపల్లి నుంచి కాజీపేట వరకు కొత్త లైను.
18) బోధన్ నుంచి బీదర్ వరకు కొత్త లైను. ఇది తెలంగాణలో 89.62 కి.మీ, కర్ణాటకలో 24.48 కి.మీ.
19) బోధన్ నుంచి లాతూర్ కొత్త లైను. తెలంగాణలో 18.40 కి.మీ, మహారాష్ట్రలో 109.92 కి.మీ పరిధి.
20) రీజినల్ రింగు రైలు హైదరాబాద్. ఆర్ఆర్ఆర్ పక్కనే నిర్మాణం. 362 కి.మీ.



రాష్ట్రానికి మంజూరైన ప్రాజెక్టులు ఇవే

పొడవు: 1,129.31 కి.మీ. నిధులు: రూ.15,619.20 కోట్లు

1) మనోహరాబాద్- కొత్తపల్లి కొత్త బీజీ లైను -151.36 కి.మీ.
2) కాజీపేట-బల్లార్ష మూడో లైను. ఇది రాష్ట్ర పరిధిలో 158.24 కి.మీ.. మహారాష్ట్రలో 43.86 కి.మీ ఉంటుంది.
3) కాజీపేట- విజయవాడ మూడో లైను అభివృద్ధి. ఇది రాష్ట్రంలో 183.64 కి.మీ... ఏపీలో 36 కి.మీ.
4) బీబీనగర్- గుంటూరు డబ్లింగ్ పనులు. ఇది రాష్ట్రంలో 139 కి.మీ, ఏపీలో 100 కి.మీ. పరిధి.
5) ముద్ఖేడ్-సికింద్రాబాద్-మహబూబ్‌నగర్-ఢోన్ లైను డబ్లింగ్. ఇది తెలంగాణలో 294.82 కి.మీ, ఏపీలో 73.91 కి.మీ, మహారాష్ట్రలో 49.15 కి.మీ.
6) డోర్నకల్-మణుగూరు డబ్లింగ్. 54.65 కి.మీ.
7) మోటమర్రి- విష్ణుపురం డబ్లింగ్ పనులు. 99.69 కి.మీ.
8) ఎగిడిపల్లి దగ్గర రైల్ ఓవర్ రైల్ పనులు 8.54 కి.మీ.
9) తాండూరు-సీసీఎల్ లైన్ 3.50 కి.మీ. మేర వై కనెక్టివిటీ.
10) విష్ణుపురం, నిజామాబాద్, వికారాబాద్, పెద్దపల్లి, జిల్లాల పరిధిలోని పిండ్యాల-హసన్‌పర్తి 35.97 కి.మీ. పరిధిలో 5 బైపాస్‌లు.

లగచర్లకు రైలు!

ఇండస్ట్రియల్ పార్కుకు సమీపంలో రైల్వేస్టేషన్

కొడంగల్ నియోజకవర్గంలోని తునికిమెట్ల వద్ద ఏర్పాటు

వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో మార్పులు

120 కి.మీ. నుంచి 130.28 కి.మీ.కు పెరగనున్న దూరం

అంచనా వ్యయం 2వేల కోట్ల నుంచి 2,784.11 కోట్లకు పెంపు

ఈ నెలాఖరులోగా రైల్వే బోర్డుకు కొత్త అలైన్‌మెంట్ డీపీఆర్



వికారాబాద్-కృష్ణా నూతన రైల్వేలైన్ అలైన్‌మెంట్ మ్యాప్

వికారాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని లగచర్ల.. రాబోయే రోజుల్లో గేమ్‌చేంజర్‌గా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌కు రోడ్డు రవాణా తదితర మౌలిక వసతులతోపాటు రైల్వే సదుపాయం కూడా రానుంది. వికారాబాద్ నుంచి కర్ణాటక సరిహద్దులోని కృష్ణా రైల్వేస్టేషన్ వరకు ప్రతిపాదించిన కొత్త రైల్వేలైన్.. లగచర్ల మీదుగా వెళ్లనుంది. ఇందుకోసం.. రెండేళ్ల కిందట ప్రతిపాదించిన రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో రైల్వేశాఖ మార్పులు చేసింది. తొలుత వికారాబాద్, పరిగి, కొడంగల్, హుస్నాబాద్, దౌల్తాబాద్, దమ్ముగూడ, నారాయణపేట, కున్సి మీదుగా కృష్ణా వరకు రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్లలో ఏర్పాటు చేస్తున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ మీదుగా ఈ రైల్వేలైన్ వెళ్లేలా అలైన్‌మెంట్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు విజ్ఞప్తి చేసింది. ఇందుకు అనుగుణంగా అలైన్‌మెంట్‌ను మారుస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం వికారాబాద్ నుంచి ప్రారంభమయ్యే రైల్వే లైన్ నస్కల్, పరిగి, తునికిమెట్ల, కొడంగల్, టేకుల్‌కోడ్, మద్దూరు, బాలంపేట, అన్నసాగర్, నారాయణపేట, మక్తల్ మీదుగా కృష్ణా వరకు కొనసాగనుంది. లగచర్ల మీదుగా పరిగి, కొడంగల్ మధ్యలో తునికిమెట్ల వద్ద కొత్తగా రైల్వే స్టేషన్‌ను ప్రతిపాదించారు. లగచర్ల ఇండస్ట్రియల్ పార్కుకు ఈ రైల్వే స్టేషన్ దగ్గర అవుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం...

ఇంతకుముందు వికారాబాద్ నుంచి కృష్ణా వరకు ప్రతిపాదించిన రైల్వే లైన్ 120 కిలోమీటర్ల దూరం ఉండగా, రూ.2 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కొత్తగా ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ప్రకారం దూరం 130.28 కిలోమీటర్లకు, ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,784.11 కోట్లకు పెరిగింది. అయితే 10.28 కిలోమీటర్ల దూరం మాత్రమే పెరిగినా.. ప్రాజెక్టు అంచనా వ్యయం మాత్రం ఒక్కసారిగా రూ.784.11 కోట్లు పెరిగిపోయింది. వికారాబాద్, నారాయణపేట జిల్లాల అభివృద్ధికి దోహదపడే ఈ రైల్వే లైన్ డీపీఆర్‌ను ఈ నెలాఖరులోగా రైల్వే బోర్డుకు అందజేసేలా దక్షిణ మధ్య రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా, వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ ప్రాజెక్టుపై చేసే ఖర్చుతో పోలిస్తే.. రైల్వేశాఖకు వచ్చే ఆదాయం 11 శాతం లోపే ఉందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తమ పరిశీలనలో గుర్తించారు. దీంతో ఇటీవల రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సందర్భంగా అలైన్‌మెంట్ మార్పుతో ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగిన విషయాన్ని రైల్వే అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు వ్యయం భారీగా పెరగడం, రేట్ ఆఫ్ రిటర్న్ (ఆర్వోఆర్) తక్కువగా ఉండడంతో భూసేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీఎంను కోరారు.

గోవాకు తగ్గనున్న దూరం

వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్ పూర్తయితే.. వికారాబాద్ జిల్లా మీదుగా గోవాకు వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం గోవా వైపు వెళ్లాలంటే జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు, గుంతకల్, బళ్లారి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అదే వికారాబాద్- కృష్ణా లైన్ పూర్తయితే ఈ మార్గంలోనే రాయచూర్, హుబ్బళ్లి నుంచి గోవా వెళ్లడానికి అవకాశం ఏర్పడడమే కాకుండా 40 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రయాణికులకు దూరంతోపాటు ప్రయాణించే సమయం తగ్గిపోతుంది. వెనకబడిన కొడంగల్ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు కానున్న వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్‌తో కొడంగల్ ప్రాంత ప్రజలకు మేలు జరగనుంది. ఎంతో కాలంగా రైల్వేలైన్ కోసం ఎదురు చూస్తున్న ఈ ప్రాంత ప్రజల్లో సర్వే పూర్తితో ఆశలు చిగురించాయి. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయంగా కొడంగల్‌కు వచ్చినప్పటి నుంచి రైల్వేలైన్, పరిశ్రమల ఏర్పాటుకు హామీలు ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం సీఎం హోదాలో ఉన్నందున ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు.



యూసుఫ్ గూడలోని నిమ్స్ మే ప్రాంగణంలో నిర్వహించిన విశ్వ ఆయుర్వేద పరిషత్ సదస్సు(వ్యాప్ కాన్- 2005)లో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఆయుర్వేదానికి వ్యతిరేకంగా బహుళ జాతి కంపెనీల కుట్ర

» ప్రాచీన వైద్య విద్యలను, యోగాను కాపాడుకోవాలి

» 2014 తర్వాత ఆయుర్వేదానికి ప్రాధాన్యం పెరిగింది

» భారత్‌ను గ్లోబల్ వెల్‌నెస్ కేంద్రంగా మార్చేందుకు కృషి

» విశ్వ ఆయుర్వేద పరిషత్ సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/బోరబండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బహుళ జాతి కంపెనీలు, అలోపతి మందుల కంపెనీలు ఆయుర్వేదానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఆయుర్వేదానికి వ్యతిరేకంగా ఒక లాబీ ప్రపంచంలో నడుస్తుందని, దీన్ని గట్టిగా తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సాంప్రదాయ వైజ్ఞానిక విద్యలను, యోగాను కాపాడుకోవాలని ఆయన సూచించారు. యూసుఫ్ గూడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్ మే ప్రాంగణంలో నిర్వహించిన విశ్వ ఆయుర్వేద పరిషత్ సదస్సు(వ్యాప్ కాన్-2005)ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఆయుష్ శాఖ ద్వారా ఆయుర్వేదం, యోగాతోపాటుగా నేచురోపతి, యునాని, సిద్ధ వైద్యం, హోమియోపతి వంటి వాటికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. ప్రజల దైనందిన జీవితంలో ఆయుర్వేదాన్ని ఓ భాగంగా మార్చేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. సిద్దిపేట, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రులు ఏర్పాటు చేసి యోగా, నేచురోపతి చికిత్స అందిస్తున్నామన్నారు. రామంతపూర్‌లోనూ ఇలాంటి ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

వేల ఏళ్ల క్రితమే ప్రపంచానికి మార్గదర్శనం

వేల ఏళ్ల క్రితమే చరక సంహిత, సుశ్రుత సంహిత వంటి గ్రంథాలు వైద్యం, ఆపరేషన్లలో యావత్ ప్రపంచానికి మార్గదర్శనం చేశాయని కిషన్‌రెడ్డి తెలిపారు. తాను ఇంటర్‌మీడియట్ పూర్తయ్యే వరకు అలోపతి టాబ్లెట్ వేసుకోలేదని గుర్తుచేశారు. మోదీ ప్రధాని అయ్యాక 2014 తర్వాత ఆయుర్వేదానికి మరింత ప్రాధాన్యత పెరిగిందన్నారు. కరోనా సమయంలో పసుపు వినియోగం పెరగడం, తిప్పతీగ ద్వారా ఇమ్యూనిటీ పెంచుకోవడం వంటివాటిని ప్రపంచ వ్యాప్తంగా అనుసరించారని కిషన్ రెడ్డి చెప్పారు. భారత్‌ను గ్లోబల్ వెల్‌నెస్ కేంద్రంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

4 రోజుల పాటు భారీ వర్షాలు

» నేడు పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

» ములుగు జిల్లా వెంకటాపురంలో 10.6 సెంటీమీటర్ల వాన


నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): రాష్ట్రంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని పేర్కొంది. శనివారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వానలు కురిశాయి. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడగా.. పలుచోట్ల ముసురు పడింది. అత్యధికంగా ములుగు జిల్లా వెంకటాపురంలో 10.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉమ్మడి ఖమ్మం, ములుగు జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో అక్కడక్కడ లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా.. చెరువులు, వాగులు పొంగి పొర్లాయి. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కావడిగుండ్ల-గోపన్నగూడెం మధ్యన వాగులో ఏపీకి చెందిన ఇద్దరు మహిళా కూలీలు కొట్టుకుపోయి మృతి చెందారు. కావడిగుండ్లకు కూలీ పనుల నిమిత్తం వచ్చిన ఏలూరు జిల్లా పూచికపాడుకు చెందిన పచ్చిశాల వరలక్ష్మి (52), పాలడుగుల చెన్నమ్మ (50) వాగు దాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.

సాగర్ 26 గేట్ల నుంచి నీటి విడుదల..

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద పెరగటంతో 26 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువ నుంచి 2.74 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. అంతే మొత్తంలో గేట్లు, విద్యుదుత్పత్తి, కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 2.76 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. గేట్లు, విద్యుదుత్పత్తి, కాలువల ద్వారా 2.82 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు 1.57 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.63 లక్షల క్యూసెక్కులను కిందకు విడుస్తున్నారు.



అంపశయ్య నవీన్‌ను సత్కరిస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి, పొన్నం

భూమి పుత్రుడికి ఘన నివాళి

- భూమిని నమ్ముకున్న గొప్ప వ్యక్తి పొన్నం సత్తయ్య: తుమ్మల
- సత్తయ్య ఈ తరానికి ఆదర్శమూర్తి: మంత్రి జూపల్లి
- నవీన్ ఇంట్లో నేనే పాలు పోసే వాడిని: మంత్రి పొన్నం

రవీంద్రభారతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసి తమ పిల్లల్ని ప్రయోజకులను చేసిన భూమిపుత్రుడు పొన్నం సత్తయ్య అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణభాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ 15వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్య జీవనసాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్, జానపద గాయని అంతడుపుల రమాదేవిలకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరై ముందుగా పొన్నం సత్తయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పురస్కార గ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పొన్నం సత్తయ్య పేరు మీద కవులు, కళాకారులను సత్కరించడం అభినందనీయమన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పొన్నం సత్తయ్య ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడి, ఈ తరానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తమది వ్యవసాయ కుటుంబమని, కరీంనగర్‌లో అంపశయ్య నవీన్ ఇంట్లో తానే స్వయంగా పాలు పోసే వాడినని గుర్తుచేసుకున్నారు. గతేడాది బలగం కొమురయ్యకు పురస్కారం ప్రదానం చేశామని, ఇచ్చిన మాట ప్రకారం ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సత్తయ్యతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని మంత్రి శ్రీధర్‌బాబు పంచుకున్నారు.

యాదగిరిగుట్టలో త్వరలో నగదు రహిత సేవలు

- రూ.10 లక్షలతో 6 కియోస్క్ యంత్రాల ఏర్పాటు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు కొండపై త్వరలో నగదు రహిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు అందించే సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు స్వీయసేవ (కియోస్క్) యంత్రాలను ఆలయ అధికారులు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ఆ యంత్రాలను ప్రధాన కార్యాలయంలో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు శనివారం పరిశీలించారు. కెనరా బ్యాంకు యాదగిరిగుట్ట బ్రాంచ్ సౌజన్యంతో, రూ.10 లక్షల విరాళంతో దేవస్థానంలో కొత్తగా 6 కియోస్క్ యంత్రాలను అధికారులు సమకూర్చారు. ఈ యంత్రాల ద్వారా దర్శనాలు, ప్రసాదాలు, వ్రతాలు, విరాళాలతో పాటు ఇతర సేవలను భక్తులు సులభంగా నగదు రహితంగా పొందవచ్చని ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

అయోధ్య, వారాణసీలకు ఆర్టీసీ ప్యాకేజీలు!

- అధికారులకు సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన అయోధ్య, వారాణసీ తదితర ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలను వెంటనే అందుబాటులోకి తేవాలని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ఇటీవల ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నందున కొత్త ప్యాకేజీలను త్వరలోనే అందుబాటులోకి తేవాలని కోరారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం రాష్ట్రస్థాయి విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సజ్జనార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. 'యాత్రదానం'లో భాగంగా అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లేందుకు డిపోల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

లోక్‌అదాలత్‌లో 11 లక్షల కేసులు పరిష్కారం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 11లక్షలపైగా కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.595 కోట్లు పరిహారంగా అందజేశారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యాంకోషీ లోక్‌అదాలత్ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించారు. నిర్మల్ జిల్లాలో ఆయన లోక్‌అదాలత్‌ను ప్రారంభించి, కేసులకు సంబంధించిన చెక్కులను కక్షిదారులకు అందజేశారు. అలాగే, హైకోర్టు ప్రాంగణంలో హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ మౌషమీ భట్టాచార్య పర్యవేక్షణలో లోక్‌అదాలత్ జరిగింది. ఇందులో 2016లో రోడ్డు ప్రమాదంలో వైకల్యం పొందిన ఓ విద్యార్థికి న్యూఇండియా అస్యూరెన్స్ కంపెనీ రూ.1.20 కోట్లు పరిహారంగా అందజేసి కేసులో రాజీకుదుర్చుకుంది. ఈ చెక్కును జస్టిస్ మౌషమీ భట్టాచార్య బాధిత వ్యక్తికి అందజేశారు.



వరంగల్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ లక్ష్మణ్

అపరిష్కృత కేసులకు అందరూ బాధ్యులే

- లోక్‌అదాలత్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

వరంగల్ లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం కాకపోవడానికి అందరం బాధ్యులమని జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి, హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షిదారులు కేసుల పరిష్కారానికి సమాన బాధ్యత తీసుకోవాలని సూచించారు. వరంగల్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా మోటార్ ప్రమాద బీమా కేసులను పరిష్కరించారు. అనంతరం హైకోర్టు జడ్జి మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని కోరారు. ఈమేరకు వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనం ఎదుట మధ్యవర్తిత్వం ద్వారా జరిగే లాభాలకు సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు.

సీఎం రేవంత్‌రెడ్డితో బీసీ కమిషన్ సభ్యుల భేటీ!

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా తెలంగాణ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకలాపాలను కమిషన్ ఛైర్మన్ నిరంజన్ సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఛైర్మన్ నిరంజన్‌తో పాటు కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి శనివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అవలంబించాల్సిన వ్యూహం పట్ల ఈ సందర్భంగా వారు సీఎంతో చర్చించినట్లు సమాచారం.

కృష్ణా జలాల్లో 71% ఇవ్వాల్సిందే!

- కృష్ణా ప్రాజెక్టులను బీఆర్ఎస్ పూర్తి చేయలేదు
- నీటిని సంపూర్ణంగా వినియోగించుకోలేకపోవడానికి కారణం ఇదే: మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించారని, అందులో 65 శాతం డిపెండబులిటీతో 71 శాతం వాటాను తెలంగాణకు కేటాయించేలా ట్రిబ్యునల్‌లో పట్టుబడతామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదనలపై శనివారం ఆయన జలసౌధలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, న్యాయ నిపుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమావేశమయ్యారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను కాపాడుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇదే అంశంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని ఢిల్లీకి చేరుకుని సమీక్షిస్తారని వెల్లడించారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని, అందుకనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రిబ్యునల్‌కు సమర్పించామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్, నదీ యాజమాన్యాల బోర్డుల ఎదుట తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతుండడంతో నిర్మాణాల్లో కొంత ఆలస్యం జరుగుతోందని, నిర్మాణాలపై తెలంగాణకు ఉన్న హక్కులను కూడా ట్రిబ్యునల్ ఎదుట జరిగే వాదనల్లో వినిపిస్తామని వివరించారు. తెలంగాణ ప్రాంతంలో ఇప్పటి వరకు ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, దాంతో, కృష్ణా నీటిని సంపూర్ణంగా వినియోగించుకోలేకపోయిందని, దీనికి ప్రధాన కారణం బీఆర్ఎస్ పాలకులేనని ఆక్షేపించారు. గత పాలకుల ఉదాసీనత వల్లే ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించుకునిపోయి.. ప్రయోజనం పొందిందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే న్యాయంగా తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై గట్టిపట్టు పడుతున్నామన్నారు.



కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలపై సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్

చుక్క నీటినీ వదలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సీఎంవో కార్యదర్శి మాణిక్యరాజ్ కన్నన్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ అంజద్ హుస్సేన్‌తో ఆయన సమీక్ష నిర్వహించారు. ట్రిబ్యునల్ ఎదుట అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు బలమైన వాదనలు వినిపించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విచారణకు హాజరవుతారని చెప్పారు. "ఇంత కాలం కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలి. మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థంగా వాదనలు వినిపించాలి. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందుంచండి. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకోండి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్‌కు అందించండి" అని న్యాయ నిపుణులకు దిశానిర్దేశం చేశారు.

తీరని ద్రోహం చేసిన కేసీఆర్ సర్కార్

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఏపీకి 512 టీఎంసీలను కట్టబెట్టి, రాష్ట్రానికి 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందనే అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణ వాటాగా 299 టీఎంసీలు చాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒప్పుకొన్న విషయాన్ని ట్రిబ్యునల్ ముందు ఏపీ ప్రస్తావించిందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు. దాంతో, ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయంగా రావాల్సిన కోటాను సాధించటంలో దారుణంగా విఫలమైందని తెలిపారు. కృష్ణాపై తలపెట్టిన పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను పెండింగ్‌లో పెట్టిందని, నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. దిగువ రాష్ట్రాల హక్కులతోపాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా జలాల్లో మొత్తంగా 904 టీఎంసీల వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా, ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్ ముందుకు తీసుకు రావాలని చెప్పారు.



సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉత్తమ్, అధికారులు

శ్రీశైలం నిండకముందే నీటి తరలింపు

శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి కృష్ణా జలాలను ఏపీ ఇతర బేసిన్‌లకు తరలించుకుపోతోందని సీఎం రేవంత్ చెప్పారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేసుకొని అన్ని ప్రాజెక్టుల ద్వారా శ్రీశైలం నుంచి రోజుకు 10 టీఎంసీలను తరలించేలా ఏర్పాట్లు చేస్తోందని, ఎక్కడ పడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతోపాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపూడి వరకు అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కృష్ణా నీటిని శ్రీశైలం నుంచి ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జున సాగర్‌తోపాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూతపడే ప్రమాదం ముంచుకువచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి ఏపీ చర్యలతో విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలనూ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప ఇతర గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణ తరఫున వాదనలు వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతోపాటు కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని సూచించారు.

అనధికార బార్లపై మీ నిఘా ఏమైంది?

- ముంబై పోలీసులు ఇక్కడికొచ్చి డ్రగ్స్ పట్టుకునే వరకు మీరేం చేస్తున్నారు?
- ఎక్సైజ్ అధికారులకు మంత్రి జూపల్లి ప్రశ్నలు
- పరిశ్రమలు, రైస్ మిల్లులపై నిఘాకు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ఒక్క బార్ కోసం లైసెన్స్ తీసుకుని మూడు బార్లను నిర్వహిస్తుంటే మీ నిఘా ఏమైంది. మద్యం దుకాణదారులు సిటింగ్ రూముల నిర్వహణలో నిబంధనలు పాటించకున్నా.. మీరెందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.. చర్యలెందుకు తీసుకోవట్లేదు..? అక్కడ గంజాయి.. ఇక్కడ డ్రగ్స్ దొరికాయని రోజుకో కేసు పెడుతున్నారే.. మరి ఎన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి'అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఎక్సైజ్‌శాఖ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎక్సైజ్ భవన్‌లో మంత్రి సమీక్ష జరిపారు. డ్రగ్స్ మాఫియాను గుర్తించడంలో ఎక్సైజ్ నిఘా వర్గాలు వైఫల్యం చెందాయని మండిపడ్డారు. చర్లపల్లి ఘటనపై స్పందిస్తూ.. ముంబై పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ పట్టుకునే వరకు మీరేం చేశారని నిలదీశారు. ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యతని.. ఇందులో అలసత్వం వహించొద్దని జూపల్లి వ్యాఖ్యానించారు. నల్లబెల్లం తయారీ కేంద్రాలు, నాచారం, చర్లపల్లి వంటి పారిశ్రామిక ప్రాంతాల్లోని పరిశ్రమలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఫామ్‌హౌస్‌లు, ఖాళీగా ఉన్న, మూతపడిన రైస్ మిల్లులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ తయారీ, రవాణాపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని చెప్పారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు ఆయుధాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దసరా తర్వాత కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎక్సైజ్‌శాఖ శాఖ పట్టుకున్న బెల్లాన్ని రైతులకు సేంద్రియ ఎరువుల తయారీకి ఇవ్వడానికి మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను ధ్వంసం చేయకుండా.. వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.

నేను పోటీ చేయాలన్నది.. జూబ్లీహిల్స్ ప్రజల కోరిక

- టికెట్ ఇచ్చి.. మంత్రిగా అవకాశం ఇవ్వాలి
- చిట్‌చాట్‌లో అంజన్ కుమార్ యాదవ్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాను పోటీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. తనకు జూబ్లీహిల్స్‌లో ఓటు ఉందని, తాను స్థానికుడినని పేర్కొన్నారు. శనివారం అంజన్‌కుమార్ విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు సికింద్రాబాద్ ఎంపీగా గెలిచిన తాను జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో అధిక జనాభా గల సామాజిక వర్గానికి మంత్రి మండలిలో చోటు లభించాల్సి ఉందని, అందుకే జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని, గెలిచిన తర్వాత మంత్రి పదవి ఇవ్వాలనీ అన్నారు. తన కుమారుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు యూత్ కాంగ్రెస్ కోటాలో ఎంపీ పదవి ఇచ్చారని, ఆయన నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేశాడని చెప్పారు. కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా ఉన్న తనకు ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ: దానం

ప్రస్తుతానికి తాను కాంగ్రెస్‌లో ఉన్నానని, అధిష్ఠానం ఆదేశం మేరకు ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. పార్టీ ఫిరాయింపు విషయానికి సంబంధించి స్పీకర్ నుంచి తనకు ఇంకా నోటీసులు రాలేదని చెప్పారు. నోటీసులు వచ్చిన తర్వాత అన్ని అంశాలు పరిశీలించి సమాధానం చెబుతానన్నారు.

స్పీకర్ నోటీసులపై బీఆర్ఎస్ సమాధానాలు సిద్ధం

నేడో, రేపో స్పీకర్ కార్యాలయానికి అందజేత

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి శాసనసభ స్పీకర్ ఇచ్చిన నోటీసులకు బీఆర్ఎస్ సమాధానాలు సిద్ధం చేసింది. తమ పార్టీ నుంచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిపై చర్యలు తీసుకోవాలని గతంలోనే స్పీకర్‌కు ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. చర్యలు తీసుకోవడం ఆలస్యం అవుతుందంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ తరువాత స్పీకర్ కార్యాలయం 8 మంది ఎమ్మెల్యేలకు నోటీసులిచ్చింది. బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులను జతచేస్తూ, సమాధానం చెప్పాలని అడిగింది. దాంతో 8 మంది ఎమ్మెల్యేలు స్పీకర్‌కు సమాధానం ఇచ్చారు. తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమాధానాలను పరిశీలించిన స్పీకర్.. మీకేమైనా అభ్యంతరాలున్నాయా? అంటూ మళ్లీ బీఆర్ఎస్ తరఫున పిటిషన్ వేసినవారికి నోటీసులిచ్చారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు సమాధానం సిద్ధం చేశారు. 10 మంది ఎమ్మెల్యే పార్టీ ఫిరాయించారంటూ ఆధారాలను, ఫొటోలను జత చేశారు. ఆ సమాధానాలను నేడో, రేపో స్పీకర్ కార్యాలయానికి అందించనున్నారు.

సీఎంను కలిస్తే పార్టీ ఫిరాయించినట్లా?

హరీశ్‌రావు, కేటీఆర్.. ప్రధాని మోదీని కలవలేదా?.. స్థాయిని మించి రాహుల్‌గాంధీపై కేటీఆర్ విమర్శలు

- ఆయన వ్యాఖ్యల వెనుక బీజేపీ నేతలు: మహేశ్‌గౌడ్
- ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: మధుసూదన్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డి దమ్మున్నోడు కాబట్టే మిమ్మల్ని ఓడించాడు: అద్దంకి
- కేటీఆర్ ఏ మొహం పెట్టుకుని గద్వాలకు వస్తారు?: సంపత్

హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రిని అందరూ కలుస్తారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా కలిశారు. కలిస్తే పార్టీ ఫిరాయించినట్టేనా?" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హరీశ్‌రావు, కేటీఆర్ కూడా ప్రధాని మోదీని కలిశారని, దీంతో వాళ్లు బీజేపీలో చేరినట్టేనా? అని అన్నారు. కేటీఆర్ తన స్థాయిని మించి రాహుల్‌గాంధీపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మోదీ మోక్షం కోసమే రాహుల్‌గాంధీని విమర్శిస్తున్నారని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు కలిసి బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు ప్రయత్నించారంటూ కవిత చెప్పారని గుర్తు చేశారు. మానసికంగా బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనమైందన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు గురించి రాహుల్‌గాంధీ ఎందుకు స్పందిస్తారని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశం స్పీకర్ పరిధిలోని విషయమన్నది గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ పదేళ్ల పాలించి.. వందేళ్లకు సరిపడా దోచుకున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకు బీజేపీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నారని అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యల వెనక బీజేపీ నేతలున్నారని చెప్పారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపకపోవడం ద్వారానే బీఆర్ఎస్ వైఖరి బట్టబయలైందని, ఆ పార్టీ పరోక్షంగా ఎన్డీఏకు మద్దతు తెలిపినట్టు స్పష్టమైందని పేర్కొన్నారు. 48 గంటల్లో కాళేశ్వరం అవినీతిని తేలుస్తామన్న కిషన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారని ప్రశ్నించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంలో భాగంగానే కాళేశ్వరంపై విచారణ ఆగిందని భావిస్తున్నామని చెప్పారు. కోట నీలిమకు ఈసీ నోటీసులివ్వడం రాజకీయ కక్షసాధింపు చర్య అని మహేశ్‌గౌడ్ ఆరోపించారు. 2017లో కోట నీలిమ కుటుంబం చిరునామా మార్చాలని ఎన్నికల కమిషన్‌కు ఫామ్-6 ఇచ్చినా ఈసీ చర్యలు తీసుకోలేదని తెలిపారు. తమ విధులు సక్రమంగా నిర్వహించని ఈసీ.. ఇప్పుడు బీజేపీ ఒత్తిడితో నోటీసులిచ్చిందని మండిపడ్డారు. దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు.



గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

ఇంటిపోరు భరించలేక కేటీఆర్ జిల్లాల బాట

కేటీఆర్‌ను చూస్తే జాలి కలుగుతోందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఇంట్లో ఓవైపు చెల్లెలి పోరు, బావ నసుగుడు, మరోవైపు తండ్రి సతాయింపు తట్టుకోలేక కేటీఆర్ జిల్లాల దారి పడుతున్నట్టుందని ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష పార్టీలను పట్టపగలు ఖూనీ చేసిన బీఆర్ఎస్.. ఫిరాయింపులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా, కేటీఆర్ మాట్లాడే సుద్దపూస మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోరని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. రేవంత్‌రెడ్డి మొగోడైతే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలంటున్న కేటీఆర్.. గతంలో బీఆర్ఎస్‌లో చేర్చుకున్న ఎమ్మెల్యేలతో మగతనం లేకనే రాజీనామా చేయించలేదా? అని ప్రశ్నించారు. "రేవంత్‌రెడ్డి దమ్మున్నోడు కాబట్టే తొడకొట్టి మిమ్మల్ని ఓడించి ఫామ్‌హౌస్‌కు పంపించారు" అని తెలిపారు. కాగా, పదేళ్లపాటు చేనేత మంత్రిగా పని చేసిన కేటీఆర్ గద్వాలలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయకుండా చేనేత కార్మికులను మోసం చేశారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. తిరిగి ఏ ముఖం పెట్టుకుని అక్కడికి వెళతారని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ఫిరాయింపుల విషయం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ రాజకీయాలను వ్యభిచారంగా మార్చారని మండిపడ్డారు.

ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు

- ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకున్నారు
- ఒక్కో పోస్టుకు రూ.3 కోట్లు పోగేశారు
- 'గద్వాల గర్జన' సభలో కేటీఆర్ ధ్వజం

గద్వాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయిస్తే.. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీం కోర్టు సీరియస్‌గా ఉందన్నారు. ఉప ఎన్నికలు రావడం గ్యారెంటీ అని, వారిని తుక్కుతుక్కుగా ఓడిద్దామని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 'గద్వాల గర్జన' పేరుతో నిర్వహించిన సభకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి కోసం వెళ్లామంటున్న ఎమ్మెల్యేలు.. ఎవరి అభివృద్ధి కోసమో చెప్పాలని, వారి నియోజకవర్గాల్లో ఎంత అభివృద్ధి జరిగిందో చూపించాలని అన్నారు. లంకె బిందెలు ఉన్నాయని వస్తే.. ఖాళీ ఖజానా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, ముఖ్యమంత్రి ఇలా మాట్లాడితే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని తలసరి ఆదాయంలో నెంబర్ వన్‌గా చేసి బంగారు పల్లెంలో అప్పగిస్తే.. తెలంగాణ అప్పుల పాలైందని, క్యాన్సర్ రోగం వచ్చిందని రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "రాష్ట్రం దివాలా తీసింది అంటే పైసలు ఇచ్చేవాడు ఎవడైనా ఇస్తాడా? ముఖ్యమంత్రి ఇలా మాట్లాడొచ్చా? అర్ధరాత్రి లంకె బిందెల కోసం తిరిగే వారిని ఏమంటారు? ప్రజలు ఏమైనా అంటే తిరిగి వారిపై కేసులు పెడతారు. ఢిల్లీకి పోతే ఆయనకు అపాయింట్‌మెంట్లు ఇస్తలేరట. చెప్పులు ఎత్తుకెళతాడనే భయంతోనేమో! ఇలాంటివాడు మన సీఎం.. ఇది మన ఖర్మ" అని అన్నారు.



గ్రూప్-1 పోస్టులు అమ్ముకున్నారు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి.. రెండున్నరేళ్లు అయినా కల్పించడంలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లు గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారని, ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.3 కోట్లకు అమ్ముకొని రూ.1500 కోట్లకు పైగా పోగేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై అభ్యర్థులు రుజువులతో కోర్టులో కేసు వేస్తే పరీక్ష ఫలితాలను కోర్టు రద్దు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన యూరియాను అమ్ముకున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి పది లక్షల ఎకరాల సాగును పెంచామని చెప్పారు. కేసీఆర్ వల్లే పాలమూరు అన్నం పెట్టే అన్నపూర్ణ అయిందన్నారు.

జమ్మూ కశ్మీర్‌లో పలుచోట్ల కుంగుతున్న భూమి

జమ్మూ, సెప్టెంబరు 13: భారీ వర్షాల కారణంగా జమ్మూ కశ్మీర్‌లోని పలుచోట్ల భూమి కుంగుతోంది. జమ్మూ ప్రాంతంలోని రాంబన్, కిష్త్వార్, పూంచ్, రెసాయ్, కథువా జిల్లాల్లోని 19 ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పూంచ్ జిల్లాలోని కాలాబన్ గ్రామంలో సుమారు 100 నిర్మాణాలు బీటలువారాయి. మూడు స్కూలు భవనాలు, ఓ మసీదు, గ్రామానికి వచ్చే రోడ్డు కూడా దెబ్బతిన్నాయి. ఈ పరిణామంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. 700లకు పైగా గ్రామస్థులను పునరావాస శిబిరాలకు తరలించారు. లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కట్టుకున్న ఇళ్లు కళ్ల ముందే బీటలు వారాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జమ్మూ కశ్మీర్ మంత్రి జావెద్ రాణా ఆ గ్రామాన్ని సందర్శించి పరిస్థితి అంచనా వేశారు. పునరావాస పనులను పర్యవేక్షించారు. అధిక వర్షపాతం వల్ల గత కొన్ని రోజులుగా పూంచ్, రాజౌరీ, కశ్మీర్ ప్రాంతాల్లో భూమి కుంగుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితే రాంబన్ జిల్లాలోని టాంగర్ ప్రాంతం, జమ్మూ శివారు ప్రాంతాల్లో నెలకొంది. ఇక్కడి నుంచి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.

త్వరలో బీజేపీ అధ్యక్షుడి నియామకం?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ ముగిసిపోవడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక త్వరలో జరిగే అవకాశాలు ఉన్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసే లోపు బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. సోమవారం నుంచి జాతీయ అధ్యక్షుడి ఎన్నికపై సంప్రదింపుల క్రమం ప్రారంభమవుతుందని, ఆ తర్వాత కొత్త అధ్యక్షుడి ఎంపిక షెడ్యూల్ ప్రకటిస్తారని ఈ వర్గాలు తెలిపాయి. జాతీయ అధ్యక్షుడిని ఖరారు చేసే ముందు యూపీ, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల పార్టీ అధ్యక్షులను నియమించే అవకాశాలున్నాయి. యూపీ నుంచి ప్రధాని మోదీ, గుజరాత్ నుంచి అమిత్ షా బీజేపీ జాతీయ మండలి సలహా సభ్యులుగా ఎంపిక కావల్సి ఉన్న రీత్యా ఈ రాష్ట్రాలలో పార్టీ అధ్యక్షుల నియామకం పూర్తి చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ ఐటీ సెల్‌పై బీజేపీ కేసు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ప్రధాని మోదీ తల్లిని అవమానించారంటూ బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ ఐటీ సెల్‌పై ఢిల్లీలోని నార్త్ అవెన్యూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. కృత్రిమ మేధ సాయంతో కాంగ్రెస్ బిహార్ శాఖ రూపొందించి, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియోపై అభ్యంతరం తెలుపుతూ ఫిర్యాదు చేసింది. ప్రధాని మోదీ, ఆయన తల్లి హీరాబెన్ పోలికలు ఉన్న పాత్రలతో కాంగ్రెస్ ఆ వీడియోను సృష్టించింది. 'సాహెబ్ కలలోకి వచ్చిన అమ్మ' పేరుతో హిందీలో రూపొందించిన ఆ వీడియోలో మోదీని తల్లి తిడుతున్నట్టు ఉంటుంది. 'ఈ రోజు ఓట్ చోరీ పూర్తయింది. ఇక నిద్రపోదాం' అని మోదీ పాత్రధారి అనడం అందులో కనిపిస్తుంది. దానిపై తల్లి పాత్రధారి స్పందిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును దుర్వినియోగం చేస్తున్నావంటూ మందలిస్తుంది. 'నోట్ల రద్దు వేళ నన్ను లైనులో నిలబెట్టావు. అనంతరం నా కాళ్లు కడుగుతూ రీల్స్ చేశావు. రాజకీయాల కోసం ఎన్నిసార్లు దిగజారుతావు?' అంటూ ప్రశ్నించడం ఆ వీడియోలో ఉంది.

యూకేలో సిక్కు యువతిపై గ్యాంగ్ రేప్

» 'నీ దేశానికి వెళ్లిపో' అంటూ బెదిరింపులు

లండన్, సెప్టెంబరు 13: బ్రిటన్‌లో భారత సంతతి సిక్కు యువతిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 'నీ దేశానికి తిరిగి వెళ్లిపో' అంటూ జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ ఆమెను బెదిరించారు. ఇంగ్లండ్‌లోని ఓల్డ్‌బరీలో ఈనెల 9వ తేదీన చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కడే పుట్టి పెరిగిన 20 ఏళ్ల యువతి ఉదయం ఓ పార్క్ సమీపంలో వెళ్తుండగా.. ఇద్దరు శ్వేత జాతీయులు దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. 'నీది ఈ దేశం కాదు.. నీ దేశానికి నువ్వు తిరిగి వెళ్లిపో' అంటూ బెదిరించారు. దీనిపై బాధితురాలు కుటుంబీకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇది జాతి వివక్షతో కూడిన దాడేనని పేర్కొన్నారు. ఘటనపై బ్రిటన్‌లోని సిక్కు సమాజం ఆగ్రహం వ్యక్తం చేసింది.

విరిగిన ఎముకను 3నిమిషాల్లో అతికించే 'గ్లూ'

బీజింగ్, సెప్టెంబరు 13: చిరిగిన కాగితాన్ని బంక/జిగురు(గ్లూ)తో అతికించినట్టుగా విరిగిన ఎముకను అతికించేందుకు చైనా శాస్త్రవేత్తలు ఓ గ్లూ కనిపెట్టారు. ఇది కేవలం మూడు అంటే మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముకను అతికిస్తుందని చెప్పారు. నీటి అడుగున వివిధ పరిసరాల్లో బలంగా అతుక్కునే ఆలుచిప్పల స్ఫూర్తితో ఈ గ్లూను అభివృద్ధి చేశారు. తూర్పు చైనాలోని షెజాంగ్ ప్రావిన్స్‌లోని సర్ రన్ రన్ షా ఆస్పత్రిలో అసోసియేట్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ లిన్‌షాన్ ఫింగ్ నేతృత్వంలోని బృందం 'బోన్ 02' పేరిట ఈ గ్లూను అభివృద్ధి చేసిందని చైనా మీడియా పేర్కొంది. శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎముక విరిగిన చోట ఓ సూది ద్వారా బోన్02 గ్లూను పెట్టవచ్చని, ఆ తర్వాత రెండు నుంచి మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముక అతుక్కుంటుందని లిన్ చెబుతున్నారు. రక్త ప్రసరణ అధికంగా ఉన్న భాగాల్లో కూడా మెరుగ్గా పని చేసే బోన్ 02 గ్లూ.. ఎముక అతుక్కున్న వెంటనే శరీరంలో కలిసిపోతుందని, ఇన్‌ఫెక్షన్ల భయం కూడా లేదని వెల్లడించారు. 150 మందికి పైగా రోగులకు ఈ గ్లూతో చికిత్స చేశామని, ఈ గ్లూతో అతికిన ఎముకలు చాలా ధృడంగా ఉన్నట్టు గుర్తించామని లిన్ పేర్కొన్నారు.



విజయ్ బస్సుయాత్రకు భారీగా తరలివచ్చిన జనం

హామీల అమల్లో డీఎంకే విఫలం: విజయ్

» తిరుచ్చిలో టీవీకే అధినేత బస్సుయాత్ర ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో 500లకు పైగా హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన డీఎంకే.. వాటి అమలులో మాత్రం విఫలమైందని తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత, సినీ నటుడు విజయ్ విమర్శించారు. అలాంటి పార్టీకి మళ్లీ ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. పార్టీని ప్రారంభించిన రెండేళ్ల తరువాత తొలిసారిగా విజయ్ జనంలోకి వచ్చారు. 'రాక్‌ఫోర్ట్' సిటీగా పేరుగాంచిన తిరుచ్చి నగరంలో శనివారం ఆయన బస్సు యాత్రను ప్రారంభించారు. సుమారు రెండు లక్షలమందిదాకా ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన అభిమానులు, వారి వాహనాలతో తిరుచ్చిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కూడా ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో పోలీసులు ఆయనకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సి వచ్చింది.

విశ్వాసమనే వంతెన వేయాలి

భారతమాత కిరీటంలో మణిపూర్ ఒక రత్నం.. అక్కడ హింసకు తావు ఉండొద్దు: మోదీ



మణిపూర్ ఘర్షణల్లో చనిపోయిన వారి కుటుంబసభ్యులతో ప్రధాని మోదీ

ఇంఫాల్/చురాచంద్‌పూర్/ఐజ్వాల్, సెప్టెంబరు 13: తెగల మధ్య ఘర్షణలతో అతలాకుతలమైన మణిపూర్‌లో శాంతి నెలకొనాలని, వేగంగా అభివృద్ధి సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ఆ రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లో ఉండే కుకీ తెగ, లోయ ప్రాంతాల్లో ఉండే మైతేయి తెగ ప్రజల మధ్య పరస్పర నమ్మకం పెరగాలంటూ.. 'కొండలు, లోయ ప్రజల మధ్య పరస్పర విశ్వాసమనే బలమైన వంతెన వేయాలి' అని పిలుపునిచ్చారు. భారత మాత కిరీటంలో మణిపూర్ ఒక రత్నమని అభివర్ణించారు. అక్కడ ఎలాంటి హింసకు తావు ఉండొద్దని పేర్కొన్నారు. శనివారం ఈశాన్య రాష్ట్రాలు మణిపూర్, మిజోరం, అసోంలలో పర్యటించిన ప్రధాని మోదీ పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మణిపూర్‌లోని చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లోని కాంగ్లా కోటలో నిర్వహించిన సభల్లో మోదీ ప్రసంగించారు. అసోం రాజధాని గౌహతిలో రోడ్ షో నిర్వహించారు. ప్రఖ్యాత సంగీతకారుడు భూపేన్ హజారికా జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ఘర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత..

2023 మేలో మణిపూర్‌లో మైతేయిలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనలకు, పలు కొండ ప్రాంతాలను రిజర్వు ఫారెస్టులు ప్రకటించడానికి వ్యతిరేకంగా కుకీలు ఆందోళనకు దిగారు. ప్రతిగా మైతేయిలు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో చురాచంద్‌పూర్ కేంద్రంగా కుకీలు, మైతేయిల మధ్య హింసాత్మక ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే. ఇరుతెగలకు చెందిన 260 మందికిపైగా మృతిచెందారు. ఈ ఘర్షణల తర్వాత తొలిసారిగా శనివారం మోదీ మణిపూర్‌లో పర్యటించారు. చురాచంద్‌పూర్‌లోని పునరావాస శిబిరంలో, ఇంఫాల్‌లోని కాంగ్లా కోటలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నో ఘర్షణలు, వివాదాలను తాము గత పదకొండేళ్లలో పరిష్కరించామని పేర్కొన్నారు. అభివృద్ధి చెందాలంటే శాంతి ముఖ్యమని.. మణిపూర్‌లో శాంతి నెలకొనేందుకు అన్ని గ్రూపులు ముందుకు రావాలని మోదీ విజ్ఞప్తి చేశారు. మణిపూర్ ఘర్షణల్లో నిర్వాసితులైన వారి కోసం 7 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని, రాష్ట్రానికి రూ.3 వేల కోట్ల ప్యాకేజీ ఇస్తున్నామని ప్రకటించారు.

ఓటు బ్యాంకు రాజకీయాలతో దెబ్బ

ఇన్నాళ్లూ ఓటు బ్యాంకు రాజకీయాలు, నిర్లక్ష్యం కారణంగా ఈశాన్య రాష్ట్రాలు వెనుకబడ్డాయని.. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటయ్యాక అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శనివారం ఆయన మిజోరం రాష్ట్ర రాజధాని ఐజ్వాల్‌లో రూ.9 వేల కోట్ల విలువైన పథకాలను, ఐజ్వాల్-ఢిల్లీ తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. తర్వాత జరిగిన సభలో మాట్లాడారు. గత పదకొండేళ్లుగా తాము మిజోరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామని, రాష్ట్రం ఇప్పుడు దేశ అభివృద్ధిలో చోదక శక్తిగా మారిందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో క్రీడలకు భారత్ ముఖ్యమైన హబ్‌గా మారుతోందని, అందులో మిజోరం పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ప్రధాని మోదీ ఎనిమిదేళ్ల తర్వాత మిజోరంలో పర్యటించడం గమనార్హం. జీఎస్టీలో చేసిన మార్పులతో దేశ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మోదీ చెప్పారు. "2014కు ముందు టూత్‌పేస్టులు, సబ్బులు, నూనెల వంటివాటిపై 27శాతం పన్ను ఉండేది. ఇప్పుడు జీఎస్టీలో వాటిపై 5శాతమే పన్ను ఉంది. కేన్సర్ వంటి ఔషధాల ధరలు తగ్గుతాయి. వాహనాల ధరలు ఇప్పటికే తగ్గిస్తున్నారు" అని పేర్కొన్నారు.

మణిపూర్ ఇన్నాళ్లకు గుర్తొచ్చిందా?: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో మోదీ పర్యటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. "ఇన్నాళ్లకు మణిపూర్ ప్రజలు గుర్తొచ్చారా" అని ప్రశ్నించింది. "ప్రధాని మోదీ పర్యటన నాటకం. మణిపూర్‌లో 864 రోజులుగా జరుగుతున్న హింసలో 300 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 67 వేల మంది నిరాశ్రయులయ్యారు. అప్పటి నుంచి మోదీ 46 విదేశీ పర్యటనలు చేశారు. కానీ సొంత ప్రజలతో సానుభూతితో రెండు మాటలు పంచుకోవడానికి ఇన్నాళ్లూ ఒక్కసారి కూడా రాలేదు" అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా విమర్శించారు. ఇక ఘర్షణలు జరిగిన రెండేళ్లకుగానీ మోదీ మణిపూర్ వెళ్లడం దురదృష్టకరమని కాంగ్రెస్ అగ్ర అగ్రనేత ప్రియాంకగాంధీ పేర్కొన్నారు.

నారీ శక్తికి నీరాజనం

» నేపాల్ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీలకు మోదీ అభినందనలు

ఇంఫాల్, కాఠ్‌మాండూ, సెప్టెంబరు 13: నేపాల్‌కు తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీల కర్కికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. మహిళా సాధికారతకు ఇది నీరాజనమని పేర్కొన్నారు. చరిత్ర, విశ్వాసాలు, సంస్కృతి పరంగా భారత్, నేపాల్ అత్యంత సన్నిహిత మిత్ర దేశాలు అని పేర్కొన్నారు. ఈ సంధికాలంలో న్యూఢిల్లీ పూర్తిగా నేపాల్ ప్రజల వెనుకే ఉందని స్పష్టం చేశారు. 140 కోట్ల భారతీయుల తరఫున సుశీల కర్కికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఆమె నేపాల్‌ను శాంతి, స్థిరత్వం, అభివృద్ధివైపు నడిపిస్తారని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. కాగా నేపాల్ పార్లమెంటు ఎన్నికలు వచ్చే ఏడాది మార్చి 5న నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ కార్యాలయం ప్రకటించింది. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీల కర్కి సిఫారసు మేరకు నేపాల్ ప్రతినిధుల సభను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించిన అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఈమేరకు పార్లమెంటు ఎన్నికలు నిర్వహించే తేదీని ప్రకటించారు.

తాలిబన్ల దాడిలో 19 మంది పాక్ సైనికుల మృతి

ఇస్లామాబాద్, సెప్టెంబరు 13: పాకిస్థాన్ తాలిబన్లు జరిపిన కాల్పుల్లో 19 మంది పాక్ సైనికులు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. సైనికులు వెళ్తున్న వాహనశ్రేణిపై శనివారం వేకువజాము నాలుగు గంటల సమయంలో తహెరీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ-పాకిస్థాన్ తాలిబన్) కాల్పులు జరిపింది. అఫ్ఘానిస్థాన్‌కు సరిహద్దులో ఉన్న పశ్చిమ వజీరిస్థాన్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పర్వత ప్రాంతంలో రెండు వైపుల నుంచి కాల్పులు జరపడంతో సైనికులు అక్కడికక్కడే మరణించారు. అనంతరం తాలిబన్లు సైనికుల వద్ద ఉన్న ఆయుధాలు, డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు గత మూడు రోజుల్లో 45 మంది తాలిబన్లను హతమార్చినట్టు సైన్యం ప్రకటించింది.

పాఠశాలలపై వైమానిక దాడి.. 19 మంది విద్యార్థుల మృతి

» మయన్మార్‌లో సైన్యం దురాగతం

నైపిడా, సెప్టెంబరు 13: మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం (జుంటా) దారుణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. పశ్చిమ రాఖైన్ రాష్ట్రంలో శనివారం తెల్లవారుజామున రెండు ప్రైవేటు పాఠశాలల భవనాలపై సైన్యం జరిపిన వైమానిక దాడిలో సుమారు 19 మంది విద్యార్థులు మరణించారు. మరో 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్యాక్‌టా ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. దాడి జరిగినప్పుడు విద్యార్థులంతా నిద్రిస్తున్నారని తెలిసింది. అరకాన్ ఆర్మీ (ఏఏ) అనే సాయుధ గ్రూపు ఈ దారుణాన్ని ఖండించింది. బాంబు దాడిలో చనిపోయిన విద్యార్థుల వయసు 15 నుంచి 21 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపింది. 2021లో తిరుగుబాటు చేసి అధికారాన్ని చేపట్టిన సైనిక జుంటా, అరకాన్ ఆర్మీ మధ్య పోరాటం ఇటీవల తీవ్రంగా పెరిగింది. ఈ నేపథ్యంలో సైనిక జుంటా పౌర ప్రాంతాలపై దాడులు చేస్తోందని మానవ హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి.

ఇక దేశంలోనే 'రఫేల్'ల తయారీ

» రూ.2 లక్షల కోట్లతో114 విమానాలు

» హైదరాబాద్‌లో ఇంజన్ల మరమ్మతు కేంద్రం.. పరిశీలిస్తున్న రక్షణ శాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఆపరేషన్ సిందూర్‌లో సమర్థంగా సేవలు అందించిన రఫేల్ యుద్ధ విమానాలు ఇకపై దేశంలోనే తయారుకానున్నాయి. ఫ్రాన్స్‌కు చెందిన మాతృ సంస్థ డసో ఏవియేషన్ దేశంలోని ఏరోస్పేస్ సంస్థలతో కలిసి వీటిని తయారు చేయనుంది. ఈ యుద్ధ విమానాల్లో 60% పరికరాలను దేశంలోనే రూపొందించనున్నారు. 'మేడ్ ఇన్ ఇండియా' కింద రూ.2 లక్షల కోట్ల వ్యయంతో 114 రఫేల్ యుద్ధ విమానాలను తయారు చేయాలంటూ భారత వాయుసేన చేసిన ప్రతిపాదనను రక్షణ శాఖ పరిశీలిస్తోంది. ఈ మెగా డీల్‌పై రానున్న రోజుల్లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ బోర్డు చర్చలు జరపనుంది. అక్కడ అంగీకారం లభిస్తే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ తుది ఆమోదం తెలపనుంది. వీటి సేకరణ పూర్తయితే వాయుసేనలో మొత్తం 176 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నట్టవుతుంది. ఇప్పటికే వాయుసేన కోసం 36 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేశారు. నౌకాదళం కోసం మరో 36 కొనుగోలు చేసేందుకు ఆర్డర్లు ఇచ్చారు. ఆకాశ యుద్ధంలో రఫేల్‌లు సమర్థంగా వ్యవహరించాయి. ఆపరేషన్ సింధూర్‌లో చైనాకు చెందిన పీఎల్-15 యుద్ధ విమానాలపై ఆధిక్యతను ప్రదర్శించాయి. కాగా, ఆకాశం నుంచి నేలపై ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణులను కూడా ఈ యుద్ధ విమానాల్లో అమర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. రఫేల్ యుద్ధ విమానాల్లోని ఎం-88 ఇంజిన్ల మరమ్మతుకు డసో కంపెనీ హైదరాబాద్‌లో మెయింటనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇందుకు స్థానికంగా ఉండే కంపెనీల సాయాన్ని తీసుకోనుంది. రఫేల్‌ల తయారీలో టాటా కంపెనీ భాగస్వామిగా చేరే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో సు-30 ఎంకేఐ యుద్ధ విమానాలు, తేలికపాటి యుద్ధ విమానాలైన ఎల్‌సీఏ మార్క్ 1ఏలను తయారు చేస్తున్నారు. 180 విమానాల కోసం ఆర్డర్లు పెట్టారు. 2035 తరువాత అయిదో తరం యుద్ధ విమానాలను కూడా దేశంలో తయారు చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయి.

'రక్తం-క్రికెట్' కలిసి ఆడతాయా?

రక్తం-నీరు కలిసి ప్రవహించవన్నారే!.. పహల్గాం రక్త ధారలు మరిచారా?

» మహిళల సిందూరం చెరిపిన దేశంతో క్రికెట్టా... ఇది దేశభక్తా.. వ్యాపారమా?

» ప్రధాని మోదీపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఆప్



పాకిస్థాన్‌తో భారత్ క్రికెట్ ఆడటంపై ఆప్ నేత సౌరభ్ నిరసన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: దుబాయ్‌లో జరుగుతున్న 'ఆసియా కప్'లో భాగంగా ఆదివారం భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. అయితే.. ఈ మ్యాచ్‌పై కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు నిప్పులు చెరుగుతున్నాయి. ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తూ... భారత్‌పై ఎగదోస్తున్న పాక్‌తో క్రికెట్ ఆడడమేంటని నాయకులు నిలదీస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పహల్గాంలో ఈ ఏడాది ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిని ప్రస్తావిస్తున్నారు. "నాటి దాడిలో ఎంతో మంది మహిళల సిందూరాన్ని చెరిపేసిన పాక్‌తో ఇప్పుడు క్రికెట్ అవసరమా" అని అనేక మంది నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ల నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీలోని ఆప్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. "నీరు-రక్తం కలిసి ప్రవహించవని.. సింధూ జలాల విషయంపై మీరే ఉద్ఘాటించారు. కానీ, ఇప్పుడు రక్తం-క్రికెట్ కలిసి ఆడుతాయా?. ఇదెలా?." అని శివసేన(యూబీటీ) అధినేత, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ప్రధాని మోదీని నిలదీశారు. "యుద్ధం-క్రికెట్.. ఒకే సమయంలో ఎలా జరుగుతాయి?. దేశ భక్తికి తోసిరాజని మీరు వ్యాపారం చేస్తున్నారు." అని నిప్పులు చెరిగారు. పహల్గాం ఉగ్ర దాడి బాధిత కుటుంబాలు కూడా భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌ను తప్పుబట్టాయి. ఉగ్ర దాడిలో తన భర్త శుభం ద్వివేదీని కోల్పోయిన ఐషన్య ద్వివేదీ స్పందిస్తూ.. "ఇది చాలా తప్పు. బీసీసీఐ మనసులేకుండా, కనీస మానవత్వం చూపకుండా వ్యవహరిస్తోంది" అని వ్యాఖ్యానించారు.

ఉద్ధవ్‌కు నైతిక హక్కు లేదు: శివసేన

శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేపై.. శివసేన(శిండే) నేతలు విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగాయని, ఆ సమయంలో కూడా ఇరు జట్ల మధ్య క్రికెట్ సమరం జరిగిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్‌కు తాజా మ్యాచ్‌పై విమర్శలు చేసే నైతిక హక్కులేదని విమర్శించారు. అధికారం కోసం హిందుత్వను వదిలేసిన ఉద్ధవ్.. ఒకానొక దశలో పాక్‌పై ప్రశంసలు గుప్పించారని గుర్తు చేశారు.

మనం వచ్చేస్తే.. పాక్‌కు లబ్ధి: కేంద్రం

భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ వివాదంపై కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. "అందరూ అర్థం చేసుకోవాలి. ఆసియా కప్‌లో మనం ఆడితీరాలి. ఒక వేళ మనం తప్పుకొంటే.. పాకిస్థాన్ మ్యాచ్ పాయింట్లను సొంతం చేసుకుంటుంది. ఏసీసీ, ఐసీసీలు అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించినప్పుడు మనం పాల్గొనక తప్పదు. దేశాల పరంగా చూసినా ఇది అవసరం. పైగా.. మనం పాక్‌తో ద్వైపాక్షిక మ్యాచ్ ఆడడం లేదు." అని అన్నారు. అంతేకాదు, ఉగ్రవాదానికి పాక్ మద్దతు ఉపసంహరించే వరకు వారితో ద్వైపాక్షిక మ్యాచ్ ఆడకూడదన్నది భారత విధానమని తెలిపారు. మరోవైపు, జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా.. ఈ మ్యాచ్‌ను సమర్థించారు.

ఎస్ఐఆర్ నిర్వహణ మా పరిధిలోనిదే!

» దాంట్లో న్యాయస్థానాల జోక్యం వద్దు

» సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన ఈసీ

» 2026 జనవరి 1 ప్రాతిపదికగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) మీద పూర్తి అధికారాలు తమవేనని, దీనిపై సుప్రీంకోర్టు ఎటువంటి ఆదేశాలు జారీ చేసినా అది తమ పరిధిలో జోక్యం చేసుకోవటమే అవుతుందని ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రతీ ఎన్నికకు ముందు ఎస్ఐఆర్ నిర్వహించేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈసీ ఈ మేరకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం పార్లమెంటుకు, దేశంలోని అన్ని శాసనసభలకు ఎన్నికలు నిర్వహించటం, ఓటర్ల జాబితాను సిద్ధం చేయటం పూర్తిగా తమకు సంబంధించిన విషయమేనని ఈసీ పేర్కొంది. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను బట్టి ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళన చేయాలా? లేక, కొన్ని మార్పులు సరిపోతాయా? అన్నది ఈసీ నిర్ణయాధికారమని తెలిపింది. దీంట్లో భాగంగానే బిహార్ మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో 2026 జనవరి 1వ తేదీ ప్రాతిపదికగా ఎస్ఐఆర్ చేపట్టాలని గత నెల 5వ తేదీన ఎన్నికల ప్రధానాధికారులకు (సీఈఓలకు) ఆదేశాలు జారీ చేశామని ఈసీ సుప్రీంకోర్టుకు తెలిపింది.

భారీ సుంకాలతో బాదేయండి!

» భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోండి

» జీ-7 సభ్య దేశాలపై అమెరికా ఒత్తిడి

న్యూయార్క్, సెప్టెంబరు 13: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాపై భారీ సుంకాలు విధించాలని జీ7 దేశాలను అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం మూడో ఏడాదిలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మాస్కో ఆదాయ మార్గాలను మూసివేసే ప్రయత్నాల్లో భాగంగా ట్రంప్ యంత్రాంగం తాజా ప్రతిపాదనలను తెరపైకి తీసుకొచ్చింది. కెనడా ఆర్థిక మంత్రి నేతృత్వంలో శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జీ7 సభ్య దేశాల ఆర్థిక మంత్రులు సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌కు నిధులు సమకూర్చడానికి స్తంభింపజేసిన రష్యన్ ఆస్తులను ఉపయోగించుకోవడం సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుంకాల విషయంలో తాను అనుసరిస్తున్న మార్గాన్ని పాటించాలని అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ వారిని కోరారు. కాగా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే దిశగా నాటో దేశాలు చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధించాలని, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మానుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. దీనికి నాటో దేశాలన్నీ అంగీకరిస్తే రష్యాపై భారీ ఆంక్షలు విధించడానికి తాను కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో శనివారం పోస్టు చేశారు. నాటో దేశాలు రష్యా నుంచి చములు కొనుగోలు చేస్తుండటంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు రష్యాతో చర్చలు, బేరసారాలను బలహీనపరుస్తున్నాయన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.